# కథామంజరి


## పది కథల సమాహారం



సెప్టెంబర్ 2022

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**సెప్టెంబర్ 2022**

సంపుటి : 3 ♦ సంచిక : 9

ఈ మాసపు

కథామంజరి సంచిక

## కథామంజరి
## బృంద

సౌజన్యంతో

వెలువడుచున్నది



# మా జట్టు

సంపాదకుడు
**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త
**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం
**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**

ప్రచురణా సహకారం
**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం
**Harbinger Publishing**

బొమ్మలు
**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

ఈ నెల శ్రావ్యసంచికకి
'గళ' సహకారం అందించిన కళాకారులు

- శ్రీ వెంపటి కామేశ్వర రావు
- శ్రీ పప్పు భోగారావు
- శ్రీ అవసరాల రాఘవరావు
- శ్రీమతి సరస్వతి కరవది
- శ్రీ బి.ఎస్. మూర్తి
- శ్రీ భువనపల్లి రంగనాథం

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి

# కథామంజరి
## దీపావళి కథల పోటీ

సాహితీప్రియులకు సాహితీ పండగ దీపావళి. ప్రత్యేక కథలతో దీపావళి ప్రత్యేకసంచికలు తెలుగువారి ముంగిట అలరించేవి. ఆ ప్రత్యేకసంచికలను తిరిగి తీసుకురావాలనే ఉద్దేశంతో కథామంజరి ఈసారి కూడా నవంబరు 2022 సంచికను దీపావళి ప్రత్యేకసంచికగా విడుదల చేస్తోంది. దీపావళి కథల పోటీ నిర్వహిస్తూ.. కథలను ఆహ్వానిస్తున్నాం!

- ❖ ప్రథమ బహుమతి ... ... ₹ 5116/-
- ❖ ద్వితీయ బహుమతి ... ... ₹ 3116/-
- ❖ తృతీయ బహుమతి ... ... ₹ 2116/-
- ❖ పది ప్రత్యేక బహుమతులు ... ... ₹ 516/- చొప్పున

**నిబంధనలు:**

* ఇతివృత్తం ఏదైనా పర్వాలేదు. 1500 పదాల కంటే మించరాదు.
* కథను యూనికోడ్‌లో టైపు చేసి వర్డ్ ఫార్మాట్లో పంపాలి. పిడియఫ్‌లో పంపే కథలు అనుమతించబడవు.
* కథతో పాటు హామీపత్రం జతచెయ్యాలి. ఆ పత్రంలో.. కథ స్వీయరచన అని, మరే ఇతర పత్రికలకు పంపలేదని, సాంఘిక మాధ్యమాలలో గాని, బ్లాగులలో గాని ప్రచురణ/ప్రసరణ జరగలేదని, సుస్పష్టంగా పొందుపరచాలి.
* పోటీకి వచ్చిన కథలలో సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు ఎంపిక చేసుకుని, వీలువెంబడి ప్రచురణ చేస్తాము. అలా ప్రచురణకు తీసుకునే కథలను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి పంపడం జరగదు. దయచేసి రచయితలు "పోటీలో బహుమతులు పొందకపోతే మా కథని తిప్పి పంపమని" మాకు అభ్యర్థనలు పంపవలదు. ఈ విషయం ప్రత్యేకంగా గమనించవలసిందిగా కోరుతున్నాం.
* కథ హామీపత్రంలో "దీపావళి కథల పోటీకి" అని వ్రాసి పంపాలి.
* కథలను *submit@kathamanjari.in* కు మెయిల్ ద్వారా **30.09.2022 తేది రాత్రి 10 గంటలలోగా** చేరేటట్టు పంపాలి. ఆ తర్వాత వచ్చే కథలను పోటీకి పరిగణించడం జరగదు.
* కథల పోటీ నిర్వహణ, ఎంపిక విషయంలో కథామంజరిదే తుది నిర్ణయం.

ఈ కథల పోటీ ఫలితాలు దీపావళి రోజునే తెలియచేయగలం. దీపావళి ప్రత్యేకసంచిక నవంబరు ఒకటో తారీఖున మీ నట్టింట వెలుగుతుంది.

ఈ పోటీలో విరివిగా ఉత్సాహంగా పాల్గొనవలసిందిగా రచయిత(త్రు)లను మనసారా ఆహ్వానిస్తున్నాం.

---

**కథామంజరి బృందం**

# యువ రచయిత(త్రు)ల
# అంతర్జాల సమావేశం

కథలు రాస్తున్నవారు గాని, రాయాలనే అభిలాష ఉన్న యువ రచయిత(త్రు)ల కోసం 'కథామంజరి' త్వరలో ఓ అంతర్జాల సమావేశం (Webinar) ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశం సుమారు రెండు గంటల పాటు జరుగుతుంది. ప్రసిద్ధ రచయితలతో కథారచనల మీద ఇష్టాగోష్టితో పాటు మెలకువలు, సూచనలు చేయబడతాయి.

ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి కావలసినవి ..

- ✦ 35 సంవత్సరాల లోపు వయసు
- ✦ కొంచెం సాహిత్యాభిలాష
- ✦ 'మంచి' కథ రాయాలనే తపన
- ✦ ఓ రెండు మూడు గంటలు సమావేశం లో పాల్గొనగలిగే ఓపిక, సమయం, సాంకేతికత

ఇవి కనుక ఉంటే ..

- ✦ పేరు, వయసు, ఇమెయిల్ ఐడి, ఫోన్ నెంబరు వివరాలను *submit@kathamanjari.in* కి ఇమెయిల్ ద్వారా పంపండి.
- ✦ ఆదివారం కార్యక్రమం – మీకు అనువైన సమయాన్ని తెలియచేయండి.
- ✦ ఈ కార్యక్రమం లో మీరు ఆశించిన అంశాలను తెలియచేయండి.

---

ఈ అంతర్జాల సమావేశానికి ..

**సెప్టెంబరు 15 లోగా మొదట నమోదు చేసుకునే 20 మందికి మాత్రమే హాజరవడానికి వీలు కల్పిస్తాం.**

ఉత్సాహవంతులను వెంటనే తమ పేర్లని నమోదు చేసుకోవలసిందిగా కోరుతున్నాం!

---

**కథామంజరి బృందం**

# ఇదీ వరుస

## శీర్షికలు


| | | | | | |
|---|---|---|---|---|---|
| కథాకీయం | ... | ... | ... | ... | i |
| విశిష్ట అతిథి | ... | ... | ... | ... | ii |
| కథా మార్గదర్శి | ... | ... | ... | ... | iv |
| కథా పరిచయం | ... | ... | ... | ... | vi |
| వినదగునెవ్వరు చెప్పిన | ... | ... | ... | ... | viii |


## కథలు, వ్యాసాలూ


| | | | | | |
|---|---|---|---|---|---|
| దుర్గమ్మ కిరాణా కొట్టు | ... | మానస (డబ్ల్యు.వి. హరగోపాల్) ... | | | 1 |
| తెల్లని నీడ | ... | వాడపల్లి పూర్ణ కామేశ్వరి | | ... | 7 |
| బోను | ... | సింహప్రసాద్ | ... | ... | 10 |
| ఆయుధం | ... | డా. ఎమ్. సుగుణరావు | ... | ... | 14 |
| ఇట్లు! మీ ... | ... | బాడిశ హనుమంతరావు | | ... | 19 |
| ఆత్మబంధువు | ... | గొర్తి వాణిశ్రీనివాస్ | ... | ... | 21 |
| అప్పు | ... | ఎన్. డి. ఎస్. వి. నాగేశ్వరరావు | | ... | 27 |
| మాస్టర్ ప్లాన్ | ... | చిత్ర వెంకటేష్ | ... | ... | 30 |
| స్పర్శ | ... | సింగరాజు శ్రీనివాసరావు | | ... | 38 |
| కొత్త సంతకం | ... | పి. మంగరత్నం | ... | ... | 43 |


Cover Page Credit: Ms Reggie Pankova, Russia

# కథాకీయం

ఈ మధ్యకాలంలో ఏ సాహితీసభకి వెళ్ళినా.. వక్తలూ, ప్రేక్షకులూ ఏభై అరవై ఏళ్ల వయసు పైబడినవారే కనబడుతున్నారు. వాళ్ళ దగ్గరే వక్తలు కూడా తమ ఆవేదన వ్యక్తపరుస్తూ.. "ఈతరం వాళ్ళు సాహిత్యానికి, భాషకి దూరమవుతున్నారు. పుస్తకాలు చదవడం లేదు, మనదైన సాహితీవిషయాల మీద అవగాహన ఉండటం లేదు, కనీసం దైనందిన జీవితానికి అవసరమై విషయాలను కూడా తెలుసుకోడానికి ప్రయత్నం చేయడం లేదు! పుస్తకపఠనం బొత్తిగా లేదు. చదివే చదువుల్లో కూడా టిక్కులతోనే డిగ్రీలు సంపాదిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలా కొనసాగితే తెలుగు భాష, సాహిత్యం.. చివరికి మనిషి మనుగడే ప్రశ్నార్థకమై పోతుంది!" అంటూ తమ భాషణలలో వాపోతున్నారు. ఈ పరిస్థితులకు కారణం.. మారిన కాలమాన పరిస్థితుల ప్రభావమా, పెంపకమా, విద్యావ్యవస్థా, సమాజమా, ప్రపంచమంతా ఏకమై మనిషిలో మనిషిని చంపిన ప్రపంచీకరణా... ఇవన్నీ కారణభూతాలే!

రెండు సంవత్సరాల క్రితమే కనబడిన ఈ సమస్యని ఎదుర్కోడానికి, మనవంతు విధిని నిర్వర్తించడానికి అలోచనలు చేయగా.. వచ్చిన ఆలోచనే కథామంజరి! మొదలు దగ్గరే ఎరువు వెయ్యాలని తలచి.. యువతరంలో కథలు చదివే ఆసక్తితో పాటు, రచనలు చేయాలనే అభిలాష కలిగించాలనే మార్గాన్ని ఎన్నుకుని, ముందుకు అడుగులు వేసాం. ఈ రెండేళ్లల్లో మేం గమనించింది ఏమిటంటే... దేశవిదేశాలలో ఉన్న ఎందరో సాహితీప్రియులు, సంస్థలు ఈ కోవలో పనిచేస్తున్నారు. ఎవరి పంథాలో వారు, వారివారి పరిధులు దాటి.. కొంత సమయం, ద్రవ్యం వెచ్చించి కూడా పనిచేస్తున్నారు. పూర్తిగా పెన్ను పుస్తకాలను పక్కన పెట్టి, అరచేతిలో ప్రపంచయానం చేస్తున్న నేటి యువతరాన్ని ప్రభావితం చేయడానికి, ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్, బ్లాగులు... ఒకటేమిటి అంతర్జాలంలో కనబడే ప్రతి మూలా దూరి, ప్రచారం చేస్తూనే ఉన్నారు. పుస్తకాల్లోనే చదవక్కర్లేదు, మీకిష్టమైన అంతర్జాలంలోనే చదవండి. మన కథ, మన కవిత, మన పద్యం, మన చరిత్ర, మన ఇతిహాసాలు... ఒకటేమిటి అన్నీ ఈ రోజు అంతర్జాలంలో నిక్షిప్తమై ఉన్నాయి. ఆ సౌకర్యాన్ని వినియోగించుకోమని నడుంకట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా తెలుగు కథ మీద ఎక్కువ మందే కృషి చేయడం ఆనందం కలిగిస్తుంది.

అ, ఆ లు నేర్పించినట్టు.. కథలు రాయడంలో ఉండే మెలకువలను నేర్పించడం నుంచి, యువతీ యువకులకు కథాసాహిత్యం మీద అవగాహన కల్పించేందుకు వెబినార్లు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాని స్పందన అంతంత మాత్రమే కనబడుతున్నది. "కథామంజరి" కూడా యువరచయితలను చేరదీయాలని తలచి ప్రయత్నాలు చేసింది. యువకలం శీర్షిక క్రింద వారి కథలు అవసరం మేర మార్పులు చేర్పులు చేసి, నెలకి కనీసం వారివి నాలుగు కథలు ప్రచురించాలనీ తలపెట్టాం. రెండు నెలలు రెండేసే కథలు వచ్చాయి.. ఈ నెల అదీ లేదు! అయితే ఆ ప్రయత్నాలని విరమించే ఆలోచనని దగ్గరకి రానివ్వం! ఆ ప్రయత్నాలలో భాగంగా, త్వరలో కథలు రాయాలనే యువతీ యువకులకు ఓ అంతర్జాల సమావేశం (వెబినార్) నిర్వహించబోతున్నాం! ఈ వెబినార్లో ఔత్సాహిక రచయిత(త్రు)లకు విశిష్ట రచయితలతో కథారచనలపై సూచనలు, సలహాలతో ఇష్టాగోష్ఠి ఉంటుంది. ప్రత్యేక ప్రకటన ఈ సంచికలో వేరేగా పొందుపరచడం జరిగింది. ఔత్సాహికులందరూ ఉత్సాహంగా పాల్గొంటారని ఆశిస్తూ .. కథామంజరి తలపెట్టిన కథాయజ్ఞంలో పాలుపంచుకొవల్సిందిగా ఆహ్వానిస్తూ .. స్వస్తి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. కె. వివేకానందమూర్తి**

“డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాను’ అన్న డైలాగు సాధారణంగా సినిమా నటుల దగ్గర వింటాం. ఇందులో నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో అంతే నిజం ఉంటుందనే విషయం కూడా తెలిసిందే! అయితే ఓ బీరకాయ ప్రియుడిలో మెండుగా నెయ్యి ఒకటే కాదు, ఇతర సుగంధ పరిమళ ద్రవ్యాలు నిండుగా ఉన్నాయి. ఓ మిమిక్రీ ఆర్టిస్టు, ఓ రచయిత, ఓ సంపాదకుడు, ఓ నటుడు, ఓ మంచి వక్త, ఓ హాస్య ప్రియుడు, ఓ స్నేహశీలి .. ఇలాంటి బహుముఖ ప్రజ్ఞలతో పాటు పూర్తిగా ఓ వైద్యుడు ఆయనలో ఇమిడిపోయాడు. ఆయనే డా.కె. వివేకానందమూర్తిగారు.

“దేవుడి కథలు, దెయ్యాల కథలు, కన్నీటి కథలు, పన్నీటి కథలు, చావు కథలు, బతుకు కథలు... అన్నీ చక్కని చమత్కార దారిలో నడుస్తాయి. విస్కీ ద్రవం, దానికి చేర్చే సోడా / నీరు.. ఉపద్రవం.., ఇద్దరు మిత్రుల స్నేహాల ముచ్చట్లను స్కాచి వడబోయటం.. తడిసిన సాయంకాలం తలంటి పోసుకున్న ఆడపిల్లలా కనబడటం.., వహ్వా!” అంటూ వివేకానందమూర్తి గారి కథలలో ఉండే పద, వాక్య విన్యాసాలకి ‘త్రీ చియర్స్’ అని ముళ్ళపూడి రమణగారు కితాబు అందిస్తే, “ముక్కుపచ్చలారని ఈ కుర్రవాడా ఆ ముదురు కథ వ్రాసాడని” ఆశ్చర్యపోయి, “ఈయన వాక్యాలు అతనంత షోగ్గానూ, నాజూగ్గానూ, ఆయనలా అమాయకంగా గలగల నవ్వుతూ, స్నేహంగానూ సరదాగానూ పలకరిస్తాయి.” అంటూ నండూరి రామ్మోహనరావుగారు ఈయన కథలకు ‘ఇంతకు ముందు మాట’ లో ప్రస్తుతించారు. ఇంకా తమాషా ఏమిటంటే, వివేకానందమూర్తి గారు.. తన కథల సంపుటిని ‘నా కథలే కాక, ఏ కథలు చదవని నా శ్రీమతికి....’ అంటూ ఆయన అలవరసల్లో అంకితం చదవగానే ఆ పుస్తకం చదవకుండా ఉండలేం! తెలుగు భాషలో ఉన్న చమత్కారాన్ని, చతుర’అస్త్రం’ గా వాడుకుని కథలు, మాటలు అందించగల చమత్కారి ఈయనే. అయితే... డాక్టర్ గా అడుగు పెట్టకుండానే రైటర్ అవడం, రైటర్ అయిన తర్వాతే డాక్టర్ అవడం, రైటర్ డాక్టర్ అవగానే యాక్టర్ అవడం, తర్వాత మళ్ళీ డాక్టర్ గా ఇంగ్లండు వెళ్ళిపోవడం... తర్వాత రచన, నటనలని అటకెక్కించి.. తెలుగు సాహితీ ప్రియులకు ఆకాశంలో తోకచుక్కలా అప్పుడప్పుడు కనబడటం.. ఇది చాలామంది తెలుగు సాహితీ ప్రియులకు నిరాశ కలిగించింది. అసలు ఒకానొక దశలో దశాబ్దిన్నర పాటు వీరి కథ లేకుండా ఏ తెలుగు పత్రికా వెలువడలేదంటే అతిశయోక్తి కాదు! “బాస్.. ఇది అన్యాయం!” అంటూ సాటి రచయితలు, పుస్తకాల వాళ్ళు, సినిమాల వాళ్ళు... ఒకరేంమి కర్మా.. వాళ్ళూ వీళ్లూ అందరూ నానా’మాటలతో’ అడిగారు. పెద్దవాళ్ళు అభిమానంగా తల కడిగేసారేమో కూడా! వాళ్ళ మాటల్లో.. ‘ఓ

మంచి తెలుగు కథా రచయిత పెన్ను పక్కన పడేసేరే..' అనే ఆవేదన ఉంది. ఉక్రోషం ఉంది! అందుకు కారణాలు.. ఆయన కథల్లో నవరసాలు తొంగి చూస్తాయి. నవ్విస్తాయి, గుండెల్ని పిండేస్తాయి! నవ్వించినా, గుండెల్ని కుదిపేసినా.. కళ్ళంట నీళ్లు తెప్పిస్తాయి. వివేకానందమూర్తిగారికి అభిమాన రచయిత దేవరకొండ బాలగంగాధర తిలక్ గారు. 'చరిత్ర శిథిలం' చదివి ఆయనే ఈయన్ని శభాష్ అన్నారన్నా, ఈయన కంటే పది ఇరవై ఏళ్ళు వయసులో పెద్దవాళ్ళు ఈయన అభిమానులుగా ఉండేవారన్నా...వివేకానందమూర్తిగారి కథల్లో ఎంత 'సారం' ఉందో తెలుస్తుంది.


కడియాల వివేకానందమూర్తి గారు ఓ డెబ్బై ఏళ్ళ క్రితమెప్పుడో పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో పుట్టారు. విశాఖపట్నంలో వైద్యం చదివారు. దాంతో పాటు ఇంగ్లీషు, తెలుగు పుస్తకాల్ని కూడా చెడామడా చదివేసారు. మిమిక్రీ ఆర్టిస్టుగా ఊరూవాడా పేరు సంపాదించి, కథలు రాయడం పద్దెనిమిదవ ఏట 'చావు' కథతో మొదలెట్టారు. నాటక రంగంలో ప్రవేశించి, మరో మెట్టు పైకెక్కి, సినిమా రంగం ప్రవేశం చేసారు. "జ్యోతిచిత్ర" అనే సినిమా వారపత్రికకు మొట్టమొదటి సంపాదకుడు వివేకానంద మూర్తిగారే. అలా రాస్తూ, నటిస్తూ.. వైద్యుడుగా ఇంగ్లాండ్ వెళ్ళిపోయారు. నాలుగు దశాబ్దాలుగా అక్కడే స్థిరపడి, ఇంకా నేషనల్ హెల్త్ సర్వీసులో బిజీ డాక్టరుగా ఉద్యోగం చేస్తూ, అడపాదడపా కథలు రాస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు వంద కథలు వ్రాసారు. అక్కడ తెలుగువారితో 'యుక్త' అనే సంస్థని స్థాపించి, నిరంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. 1975లో ఈయన సేవలకు గుర్తింపుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2016 లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ వారిచే జీవిత సాఫల్య పురస్కారం కూడా అందుకున్నారు.

వివేకానంద మూర్తి గారి కథలలో.. నేను చూసిన నక్షత్రం, చరిత్ర శిథిలం, చావు, రైలు తప్పిన దేవుడు, గుంపులో గోవిందా, చెన్నకేశవ జావా అమ్మేశాడు వంటి కథలు పాఠకుల మన్ననలు పొందాయి. భావుకత బాగా కనబడే ఈయన కథలలో విలక్షణమైన ఇతివృత్తం, మంచి భాష, చక్కని అలంకారాలు, ఉపమానాలు, శ్లేషతో వ్యాఖ్య విన్యాసాలు కనబడతాయి. ఆయన ప్రతిభ వెనుక ఆయన తండ్రిగారి ప్రేరణ ఉందంటారు. తెలుగు భాష అంటే ఎంత ఇష్టమంటే.. తెలుగుని 'ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్' అని ఎందుకనాలి, ఇటాలియన్ భాషనే "తెలుగు ఆఫ్ ది వెస్ట్" అని ఎందుకనకూడదంటారు! వివేకానందమూర్తిగారికి రావిశాస్త్రి గారి దగ్గర్నుంచి బాపు రమణల వరకు అందరూ మిత్రులే. మరో ఆప్తమిత్రుడు, దర్శక శ్రేష్టుడు శ్రీ కె. రాఘవేంద్రరావు గారితో పాటు భరాగో, జ్యోతి మాసపత్రిక సంపాదకుడు వి.వి రాఘవయ్యగారి లాంటి ఎంతోమంది అభిమానుల ప్రోద్బలంతోనే కథల సంపుట వేసానని ఆనందంగా చెప్తారు. '1972లో విడుదలైన 'భార్యాబిడ్డలు' సినిమాలో ఉత్తమ నూతన నటుడుగా అవార్డు లభించింది. బాపుగారి 'అందాలరాముడు' సినిమాలో వీరి నటన తెలుగు ప్రేక్షకులు నీరాజనాలు అర్పించారు. అలా చాలా సినిమాల్లో నటించి, మెప్పించి.. 'ఇక చాల్లే' అని అనుకున్నారేమో, తర్వాత ఇంచక్కా ఇంగ్లండు వెళ్ళిపోయారు.

ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి వివేకానందమూర్తి గారు 'ఇంక ఇండియా ఏం వస్తారు' అని మాబోటి వాళ్ళు సరిపెట్టుకున్నా, రాసిన కథలతో ఆయన సరిపెట్టుకోకుండా... అడపాదడపా కాకుండా అర రోజుకో కథ వ్రాయాలనీ, వ్రాసి తెలుగు కథాప్రియులను అలరించాలనీ ఆశిస్తూ, అడగగానే 'కథామంజరి' ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**డా. కొమ్మూరి వేణుగోపాలరావు**

ఓ కథో, నవలో, వ్యాసమైనా సరే.. చదవడం మొదలెట్టగానే పూర్తిగా చదివించగలిగేదే మంచి రచన. అందులో నవల అయితే.. రచయితకి చాలా కష్టసాధ్యమైన పని. దీర్ఘమైన కథాంశం, దాన్ని నడిపింవగలిగే సంభాషణలు, సంఘటనలు, వర్ణనలు, చదివించగలిగే శైలి, భాష.. నవలకి అవసరం. ఆ నైపుణ్యం నవలారచయితలకు ఉండాలి. 1965 కాలంలో పరిశోధనాత్మకమైన తెలుగు నవలలు అప్పట్లో లేవనే చెప్పాలి. ఆ సమయంలో ఓ నవల వచ్చింది. పాఠకుల్లో ఓ రకమైన చైతన్యాన్ని తీసుకొచ్చింది. చాలామందికి ఆ నవల చదివి, ప్రేరణ కలిగి డాక్టర్ చదవాలనే పట్టుదల తీసుకువచ్చింది. ఆ నవల రాసేటపుడు.. ఇప్పటిలా సాంకేతికపరమైన సదుపాయాలు లేవు. ఏ విషయం కావాలన్నా గ్రంథాలయాలకు వెళ్ళి, పుస్తకాలు చదువుకోవాల్సిందే! ఓ కథో, నవలో పరిశోధనాత్మక కథావస్తువుని ఎంపిక చేసుకున్నా సరే, కథని మలుపులు త్రిప్పి, తాము చెప్పదలచుకున్న విషయాన్ని అందులో ఇమిడ్చి రాస్తారు. కాని అలా కాకుండా వైద్యంలో అన్ని విభాగాలను చాలా ఉత్కంఠభరితంగా వ్రాసి, ఎత్తిన పుస్తకాన్ని దించకుండా చదివించగలిగే నవల "హౌస్ సర్జన్". ఆ నవలా రచయిత డా. కొమ్మూరి వేణుగోపాలరావు గారు. ఈయన రచించిన మరో నవల "పెంకుటిల్లు" చాలా గొప్ప నవల అని చాలామంది మెచ్చుకుంటారు. కాని ఆ రోజుల్లో ఆయన సమకాలికులు అలాంటి నవలలు రాసారు. అయితే "హౌస్ సర్జన్" లాంటి నవలని.. అప్పుడే కాదు, ఇప్పటి వరకు కూడా ఎవరూ వ్రాయలేదని గట్టిగా చెప్పొచ్చు!

1938 సెప్టెంబరు 4 తేదిన విజయవాడలో జన్మించిన వేణుగోపాలరావు గారు, హైస్కూల్ విద్య విజయవాడలోనూ, ఎం.బి.బి.ఎస్. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజిలోనూ చదివి, హౌస్ సర్జన్ ను గుంటూరు మెడికల్ కాలేజీలో పూర్తి చేసారు. ఆ తర్వాత విజయవాడలో వైద్య వృత్తి కొనసాగిస్తూ, మరో పక్క రచనలు చేస్తూ సాహిత్య సేవ చేసారు. రెండు రంగాల్లోనూ మంచి పేరు సాధించారు. ఇంటర్ చదువుతున్నప్పుడే 'కొత్త డాక్టరు' అనే నాటకం రాసి, అందులో డాక్టర్ పాత్ర కూడా ఆయనే వేసి, పేరు తెచ్చుకున్నారు. ఈయన తన పద్దెనిమిదవ ఏట "పెంకుటిల్లు" నవల రాసారు. ఆ నవలకి కూడా మంచి గుర్తింపు లభించింది. తర్వాత కాలంలో గోరింటాకు, జాలి లేని జాబిలి, విషవలయం, హౌస్ సర్జన్, ఒకే పాటకు రెండు రాగాలు, ప్రేమ నక్షత్రం, న్యాయానికి అటూ ఇటూ.. మొదలగు సుమారు నలభై నవలలు రాసారు. రెండు వందల పైగా కథలు వ్రాసిన వేణుగోపాలరావు గారు చిన్నపిల్లల వైద్యంలో గొప్ప పేరు సంపాదించారు. మంచి హాస్య చతురులు, సంభాషణలో కూడా హాస్యం తొంగి చూసేది. భార్య అహల్యా దేవి, ముగ్గురు మగపిల్లలు.

డా. కొమ్మూరి వేణుగోపాలరావుగారి మీద బెంగాలీ రచయిత శరత్‌చంద్ర గారి రచనల ప్రభావం ఎక్కువగా కనబడి, ఆంధ్రా శరత్ అనే పేరు కూడా వచ్చింది. వేణుగోపాలరావుగారి చిన్నతనంలోనే అంటే పదిహేనో ఏట తన అక్కయ్య కొడుకు మరణిస్తే, ఓ చిన్న పాప విలపించడం చూసి, చలించి ఓ కథ రాసారు. ఆ కథ పేరు "చావు బ్రతుకులు". ఆ కథ 'భారతి' సాహిత్య మాసపత్రికలో ప్రచురితమైంది. కథా రచనకు అదే ఆయన నాందీప్రస్తావన అని చెప్పాలి. తర్వాతి రోజుల్లో కనపడ్డ పుస్తకాలు చదవడం, పెద్దవాళ్ళతో సాహిత్యసంభాషణలు చేయడం..వేణుగోపాలరావుగారి దినచర్యలో ఓ భాగమైంది. నవలలు, కథలతో పాటు రేడియో నాటికలు రాసారు. పురాణం సుబ్రమణ్య శర్మగారు, గొల్లపూడి మారుతీరావు గారితో కలిసి, తెలుగు నవలా సాహిత్యంలో ఓ కొత్త ప్రయోగం చేసి, మొట్టమొదటి గొలుసు నవల "ఇడియట్" వ్రాసారు. మధ్యతరగతి జీవితాలకు దర్పణం పట్టే ఈ నవల ఆ రోజుల్లో ఓ సంచలనం సృష్టించింది. మధ్యతరగతి కుటుంబాలు, పేద ప్రజలు, ఆర్థిక సమస్యలు, గుమస్తాలు, రాజకీయ సిద్ధాంతాలు, కులాల తారతమ్యాలు... వంటి వాటిని కథావస్తువుగా రచనలు అందించిన వేణుగోపాలరావు గారి శైలి వారికే ప్రత్యేకమని చెప్పాలి. 1950–54 సంవత్సరాల మధ్య వంద కథలు రాసి పాఠకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా, తాను చదువుతున్న కాలేజీలో సన్మానం కూడా పొందారు. 1940–1957 మధ్య కాలంలో వెలువడిన నవలలో "పెంకుటిల్లు" కి ప్రథమ బహుమతి.. 'తెలుగు భాషా సమితి' వారి ద్వారా అందుకున్నారు. ఆనాటి లోక్‌సభ అధ్యక్షులు శ్రీ అనంతశయనం అయ్యంగార్ గారి ద్వారా అందుకున్న అతి పిన్నవయసు నవలా రచయిత వేణుగోపాలరావుగారే! అదో మధురమైన జ్ఞాపకంగా ఎప్పుడూ తలుచుకునే వేణుగోపాలరావుగారి కథలు పద్నాలుగు కథాసంపుటాలుగా వెలువడ్డాయి. వీరి నవలలు, కథలు కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోకి అనువదించబడ్డాయి.

*ఆకాశానికి నిచ్చెన, ఆశ, ఇల్లు కొన్నాడు, గ్రామఫోన్ రికార్డు, చంద్రుడి ప్రయాణం, చావు బ్రతుకులు, వెళ్ళిపోయే వ్యక్తులు..* వంటి వీరి కథలు అన్నీ ఆణిముత్యాలే. ఆనాటి నుంచి ఈనాటి వరకు వైద్య వృత్తిలో ఉండే వారందరూ గర్వంగా చెప్పుకునే మహోన్నతమైన వ్యక్తి డా. కొమ్మూరి వేణుగోపాలరావు గారు.. తర్వాత తరాల్లో ఎంతోమంది రచయితలకు మార్గదర్శకులుగా నిలిచిపోయారు.

తెలుగు సాహితీప్రపంచంలో ఆనాటి నుండి నేటి వరకు ఓ ధృవతారగా వెలుగొందుతున్న రచయిత డా. కొమ్మూరి వేణుగోపాలరావుగారు తన అరవై తొమ్మిదో ఏట కన్నుమూసారు. ఆ మహనీయుడిని తలుచుకుంటూ.. వారికి నివాళి అర్పిస్తున్నాం!

**కథామంజరి బృందం**

## యజ్ఞం – కాళీపట్నం రామారావు

కథ చదవడానికి, కథ రాయడానికి ధైర్యం కావాలంటే, సాధారణంగా నమ్మలేని విషయం. కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) గారి 'యజ్ఞం' కథ చదివిన తరవాత ఆ అభిప్రాయం మారి తీరుతుంది. 'యజ్ఞం' ఒక గొప్ప కథ. రామారావు గారు రాసిన కథలలో ఆయనకు చాలా పేరు తెచ్చిన కథ. ఎక్కువ కథలు రాయలేదాయన. అయితే రాసిన కొద్దీ కూడా ఆణి ముత్యాలు.

'యజ్ఞం' కథ 1964 లో రాయబడింది. 1966 లో యువ దీపావళి సంచికలో ప్రచురించబడింది. ఈ కథ ఆయనకెంతో పేరు తెచ్చింది, సాహిత్య ప్రియులనుంచి ఎన్నో ప్రశంసలు పొందారు.

ఒక కథ గొప్పదని ఎలా నిర్ణయించాలి? కథ చదివిన తరువాత ఆ కథ పాఠకుడి మనసులో ఉండి ఆలోచింపచేయాలి. కథలోంచి తనదంటూ ఒక భాగాన్ని తీసుకోగలగాలి. కథలో మమైకం కాగలగాలి. రాసిన విధానం బాగుండాలి. పాఠకుడిని చదివించాలి. కారా మాస్టారుగారి కథ ఇవన్నీ చేస్తుంది. కథాంతాని కొచ్చేటప్పటికి తల ఒక్కసారి కొట్టినట్లౌతుంది. దిమ్మెక్కిన తలకి కొద్ది క్షణాలు ప్రపంచం ఆగిపోయినట్లు చేస్తుంది. మనలో మనకే సమాజపు అవకతవకలలో మన బాధ్యతెంతుందనే ప్రశ్న ఎదురౌతుంది.

అదొక చిన్న గ్రామం. పేరు సుందరపాలెం. కథ అరవైల్లో కాబట్టి అప్పట్లో గ్రామీణజీవితమన్న మాట. ఊరి పెద్దలు, పూరి పంచాయితీ, అందులో ఒక హరిజన మెంబరు అప్పల్రాముడు, ప్రెసిడెంటు శ్రీరాముల్నాయుడు, మాజీ షావుకారు – ఒకప్పుడు బాగా బతికి ప్రస్తుతంలో చితికి బతుకుతున్న గోపన్న, ఒక లక్ష్మన్నాయుడు మొదలైనవారు....

అప్పల్రాముడు గోపన్నబాబుకు చాలా ఏళ్ళ నించి ఓ రెండున్నర వేలు బాకీ. ఎప్పటికి తీర్చలేకపోతాడు. కొంతకాలం క్రితం ఒక ఒప్పందానికొస్తారు, ఓ మూడేళ్ళలో బాకీ తీర్చేయాలని. అప్పల్రాముడు తీర్చలేకపోతాడు. ఇప్పుడు పంచాయితీ అందుకోసం. వాళ్ళిద్దరి మధ్యా విరోధమేమీలేదు. గోపన్న పెద్దవాడైపోతున్నాడు. ఒకప్పుడు సంపాదించి బాగా బతికినవాడే. కాని ఇప్పుడవన్నీ లేవు. పిల్లలు తమ దారి తాము చూసుకున్నారు. తనకి ఇప్పుడు అవసరం మరి. అలాగని అప్పల్రాముడికీ బాకీ తీర్చకుండా ఉండాలనే దురుద్దేశం లేదు. తన పిల్లలు తనకు తోడుగా ఉన్నా, వచ్చే సంపదన తినడానికే సరిపోదు. ఏం చెయ్యగలడు?

శ్రీరాముల్నాయుడు తన నాయకత్వంలో ఆ గ్రామంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చాడు. కొత్త మిల్లులొచ్చాయి. కొత్త రోడ్లు వేసారు. కొంతమంది ధనికులయ్యారు.

తేడా అల్లా, మునుపు వ్యాపారాలు తక్కువ పరిధిలో జరిగేవి. ద్రవ్యమార్పిడీ చిన్నగా ఉండేది. ఐతే, వచ్చిన మార్పుల వల్ల అన్నీ పెరిగాయి. సంపాదించే వాళ్ళు సంపాదిస్తున్నారు. పెద్ద చేపలు చిన్న చేపల్ని మింగడం, చిన్న చేపలు బుల్లి చేపల్ని మింగడం మొదలైంది. గోపన్న మింగబడిన చేపల్లో ఒకడైనాడు. ఎదగ గలిగినన్ని రోజుల్లో ఎదిగాడు. ఎప్పుడో ఎవడో తన వ్యాపారాన్ని ముంచడంతో మళ్ళీ మొదలుకొచ్చాడు.

శ్రీరాముల్నాయుడంటే అందరికీ గౌరవమే. సుమారు పాతికేళ్ళ వయసు నుంచి గ్రామం వృద్ధిచెందాలని కంకణం కట్టుకుని పనిచేస్తున్నాడు. గ్రామంలో వచ్చిన మార్పులకి అతనే చాలా వరకూ కారకుడు. అతను మాట తొణకడు. ఆవేశం అంతకంటే

చూపడు. అతని మాటలు సమతుల్యంగా ఉంటాయి. ఎవరి పక్షంగానూ మాట్లాడనట్లనిపిస్తాడు. న్యాయం జరగాలనేదే అతని తాపత్రయమని అందరూ నమ్మారు. అందుకే అతనంటే, అతని మాటంటే అంత గౌరవం. అతని హయాంలో గ్రామంలో ఏ తగవు వచ్చినా గ్రామం దాటి పోకూడదనే అతని మాటని ఎవరూ జవదాటరు. ఇప్పుడొచ్చిన తగవు కూడా అంతే.

మొదటిరోజు పంచాయితీకి శ్రీరాముల్నాయుడు ఊళ్ళో ఉండడు. రెండో రోజొస్తాడు. గ్రామప్రజలందరికీ ఈ తగవు ఎలా తీర్చబడుతుందో అనే ఉత్కంఠ. ఏముందీ, అప్పల్రాముడి కుటుంబానికి ఓ రెండున్నర ఎకరాల పొలముంది. అది గోపన్న పేరిట రాసేస్తే, తగవు తీరినట్టే కదా! అదీ పెద్ద మనుషుల ఏకాభిప్రాయం.

మొదటిరోజు ఎక్కువగా మాట్లాడని అప్పల్రాముడు అందరి అభిప్రాయాలూ విని అందరినీ ఉద్దేశించి మాట్లాడతాడు రెండో రోజు. అతని మాటలు చదివి తీరాలి. నేను చెబితే కాదు.

పల్లెలో ఎన్నో మార్పులొచ్చిన మాట నిజమే. తను గోపన్న షావుకారునించి అప్పుతీసుకున్న మాట నిజమే. ఈ రోజు తను అప్పు తీర్చలేకపోయిన మాట కూడా నిజం. అయితే గ్రామంలో వచ్చిన మార్పుల వల్ల ఎవరు లాభం చెందారు? తను, తనలా కాయకష్టం చేసుకు బతికే మాలపల్లెలో ఏ మార్పైనా వచ్చిందా? తన తండ్రి దగ్గరనించి తనదగ్గరకొచ్చిన పొలం హరించుకుపోయి కొద్దిమాత్రం మిగిలింది. ఈ మిగిలిన భూమి ఇచ్చేస్తే తన పిల్లలకి, వారి కుటుంబాలకి ఏముంటుంది? ఏ రోజు తిండానికి ఏమున్నా లేక పోయినా, తన రెక్కల కష్టం మీద బతికిన తను తన పిల్లలకేమివ్వ గలిగాడు? అదే రెక్కల కష్టం... అవే గంజినీళ్ళు. తరానికి తరానికి ఏమి తేడా వచ్చింది తన కుటుంబంలో? అవును గ్రామం వృద్ధి చెందింది. ఎవరు బాగుపడ్డారు? మాలవాడ మాత్రం అప్పటిలాగే మిగిలిపోయింది.

ప్రగతిపథంలో ముందుకు సాగిపోతున్నామనే ఒక కృత్రిమమయిన భావనలో మునిగిపోయిన ఈ సమాజంలో ఇంకా ఇంకా పెరిగిపోతున్న అంతరాల విషవలయంలో చిక్కుకుని పైకెదగలేక, ముందుకు సాగలేక భవిష్యతరాలలో బతుకుపై ఆశ చూడలేకపోతున్న పేద ప్రజలని ఆహుతిని చేస్తున్న ఈ యజ్ఞం ఆగదా?

ఇదీ సారాంశం.

కథ అప్పల్రాముడి మాటలతో ఆగిపోతే ఎంత బాగుణ్ణు? అలా చెయ్యలేదు రచయిత. కథ ముగింపు మనల్ని ఝుళిపిస్తుందొక్కసారి. ఆ పేద గుండెలలో తరతరాలుగా రగిలే మంటలలో మనం భస్మీపటలం అయిపోతాం. కథ చదివిన తరువాత పేజీ తిరగవేసే శక్తి నశించిపోతుంది. మనం మళ్ళీ మామూలుగా అవడానికి సమయం పడుతుంది.

కథ చాలా సరళంగా మొదలవుతుంది. చాలా సహజంగా సాగిపోతుంది. రచయిత సంభాషణలలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోని పల్లెటూర్లలోని మాండలీకం వాడారు. కారా మాస్టారు తను తీసుకున్న కథావిషయం, పాఠకులకందించ దలుచుకున్న మెసేజ్ సందిగ్ధత లేకుండా మనముందుంచుతారు.

'యజ్ఞం' కేవలం ఒక కథ మాత్రమే కాదు. మనల్ని మనం ప్రశ్నించుకునేలా చేసే ఒక జీవిత ప్రతిబింబం. ఇది తెలుగు సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయే కథ. గొప్పకథగా ఎన్నో ప్రపంచ భాషలలోకి అనువదించబడింది.

**శాయి రాచకొండ**

హూస్టన్, యు. ఎస్. ఏ.

అద్భుతమైన వర్ణచిత్రంతో ఆగస్టు సంచిక ముస్తాబయ్యింది. కవర్‌పేజీలను ఎంచుకుంటున్న తీరు బాగుంది. ఈ సంచిక కథాకీయంలో కథాసాహిత్యంపై సంపాదకులు అభిప్రాయాలు విస్పష్టంగా తెలియచేశారు. కథలు రాసేవారు గమనించుకోవాల్సిన మరో రెండు విషయాలు కథావస్తువు, శిల్పం గురించి కూడా... విదేశాల్లో మాదిరిగా మన దగ్గర కూడా ట్రైనింగ్ సెంటర్ నిర్వహించే ఆలోచన ఎవరైనా చేస్తారంటారా? ఏమో? కథల మీద ప్రేమ, కథకుల మీద బాధ్యత కలిగిన తరం క్రమంగా మాయమైపోతుంటే... ఊహకైనా కష్టమే!

ఒక పాఠకుడిగా చాగంటి తులసిగారి గురించి విన్నాను కానీ అంత ఎక్కువగా కాదు... కానీ ఈ సంచికలో వారి గురించి చదివాక, పుస్తకప్రదర్శనల్లో వారి రచనల కోసం నా కళ్ళు వెదుకుతాయి.

శాయి రాచకొండగారి కథా పరిచయం చాసో గారి 'బండపాటు' గురించి. మరో మంచి కథా పరిచయం. ఇలాంటి కథల గురించి విన్నప్పుడు, వాటిని చదివినప్పుడు ఆనాటి కథాహాలికుల పాదాల మీద అమాంతం పడిపోవాలనిపిస్తుంది.

ఈ సంచికలోని కథల్లో చలసాని ప్రకాశ్‌గారి కథ '*జగమంతా కుటుంబం*' బాగుంది. *శ్రమకు నీరాజనం*, *శిక్ష* ఫరవాలేదు. ఒక వాట్సప్ గ్రూపు, కథారవళిలో నిర్వహించబడిన పోటీ కథలు – బహుశా ఇచ్చిన వాక్యాలను వాడి కథలు రాయడం కాబోలు(?) వాటికి కొన్ని పరిమితులుంటాయి– ఆ పరిమితుల మేరకు అవి బాగున్నాయి. *దిశానిర్దేశం* ఫర్వాలేదు. చివర్లో జైలర్ పాత్రను మరో కోణంలో చూపి కథను మలుపు తిప్పారు గానీ, ఆ మలుపు కథ మొదలు పెట్టిన పేరాలో చెప్పిన దానికి విబేధించినట్టయింది. '*దిశానిర్దేశం*' అనే పేరు రచయిత ఎందుకు పెట్టి ఉంటారు చెప్మా...!?

తులసిగారి కథ '*బొమ్మ రూపాయి*' కథలోని 'బొడ్డూడని గుంట' మాటలంత ముచ్చటగా ఉంది.

గత సంచికలోని యువకలాలకంటే ఈ సంచికలోని కలాలు కాస్త భిన్నమైన అంశాలు ఎంచుకున్నారు. గాయత్రిగారి కథ చదువుతుంటే, వార్తాపత్రికల్లో చదివిన ఒక సైన్యాధికారి సతీమణి, జ్యోతి నైన్వాల్ గుర్తుకు వచ్చింది. రచయిత్రి రేవతిగారి నుండి ఇంకా మెరుగైన కథలు ఆశించవచ్చు. అభినందించదగిన వేగం ఆమె శైలిలో ఉంది.

నిజానికి స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యంలో కథలు ప్రత్యేకంగా ఉంటాయని ఆశించాను. అలాగే ముద్రా రాక్షసాలు బాగానే కనపడ్డాయి. రచయితలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది... నాతో సహా!

**రాంబో**

# దుర్గమ్మ కిరాణా కొట్టు

'మానస' (డబ్ల్యు. వి. హరగోపాల్)



✆ 9848167978

***వైద్య శిబిరం తరవాత కడివెదురులో రైతులకి మీటింగు పెట్టి నేనీ సలహా ఇచ్చినా ఫలితం దక్కలేదు వెంటనే. కారణం రెండు మూడు లక్షలున్న ధనవంతుడు దొరకలేదు. ముందుకు రాలేదు అక్కడ. దాదాపు రైతులంతా తమని ఆదుకునేదీ.. ఆదుకోగలిగేదీ పిప్పనపల్లిలో ఉన్న దుర్గమ్మ మాత్రమే అని తేల్చి చెప్పారు.***

"నిన్ను ఏ కక్ష కొద్దీ ప్రత్యేకంగా హైద్రాబాద్ నుంచి పిప్పినపల్లికి బదిలీ చెయ్యలేదు మూర్తీ! నీకు తెలుసు. మన బ్యాంకు పాలసీ అది. నీకు బ్రాంచి మేనేజరుగా ప్రొమోషనిచ్చేము. దాని ప్రకారం నువ్వు మూడేళ్లపాటు పల్లెటూళ్లో పని చెయ్యక తప్పదు. నీతో పాటు నీ కుటుంబం మొత్తం ఆ ఊరెళ్లాలన్న రూలేం లేదు కదా. కుటుంబాన్ని సిటీలోనే ఉంచుకునేందుకు అద్దె ఇల్లు సదుపాయం కూడా చేస్తున్నాం కదా. ఇంక ఆలస్యం చెయ్యకు. వెళ్లిరా .. గుడ్‌లక్ !" అంటూ మరో మాట మాట్లాడకుండా షేక్ హ్యాండిచ్చేడు మా రీజనల్ మేనేజరు.

"ఆల్ యువర్ బ్లెస్సింగ్స్ సార్!" అంటూ నమస్కరించి ఆయన రూం లోంచి బైటికొచ్చి, మర్నాడు బయల్దేరి మారుమూల పల్లెటూరు పిప్పినపల్లికి బ్రాంచి మేనేజరుగా వెళ్లేను.

ఇది నలభై ఏళ్ల క్రితం సంగతి.

నిజానికి పిప్పనపల్లి చాలా చిన్న పల్లెటూరు. దాని చుట్టూ మరో పదిహేను అతి చిన్న పల్లెటూళ్లూ .. తండాలు! అయినా అదొక మండల హెడ్‌క్వార్టర్సు. అక్కడొక మండల రెవిన్యూ అధికారి.. ఎం. ఆర్వో.. మండల అధికారి ఎండీవో.. పోలీస్ స్టేషనూ .. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు .. ప్రాథమిక వైద్యకేంద్రంలో ఒక లేడీ డాక్టరు .. పశువుల ఆస్పత్రిలో ఒక వెటర్నరీ డాక్టరూ .. ఐదుగురు ప్రభుత్వాధికారులు ఉండేవారు. ఒక్క ఎస్సై తప్పించి మిగతా నలుగురూ .. మూడు నాలుగు గంటల ప్రయాణం చేసి, సిటీ నుండి వచ్చేవారు... రెండు మూడు రోజులకోసారి. కొత్తగా సర్వీసులో చేరిన లేడీ డాక్టరుకి చార్జీ ఇస్తూ పాత డాక్టరు "మీరు రోజూ మన ఆరోగ్య కేంద్రానికి రానక్కర్లేదు డాక్టర్. నాలా వారానికి ఒక్కరోజు వస్తే చాలు. మిగతావి మన కాంపౌండరూ .. నర్సూ .. ఆయా .. ప్యూను చూసుకుంటారు" అని హితబోధ చేసి మరీ వెళ్లేడట. ఆవిడ అలాగే తు.చ. తప్పకుండా మొదలెట్టిందట.


★★★

"ఈ రూరల్ ఏరియాలో మన బ్రాంచి ఉంది కాబట్టి ... దాన్నెలాగో నడపాలి కాబట్టి ... నువ్వు రూరల్ సర్వీసు చెయ్యాలి కాబట్టీ ... నిన్ను ఇక్కడికి పోస్టు చేసాము మూర్తీ. మూడేళ్లూ ఎలాగో నడిపించుకురా .. వీకెండ్స్‌కీ, మధ్యలో సెలవలొస్తే సిటీకి వచ్చేస్తూ ఉండు. అనవసరంగా రొస్టుపడకు. చూసావుగా మనకేమీ సంబంధం లేకపోయినా ప్రక్కనే వున్న మన నప్పనపల్లి బ్రాంచి మేనేజర్ని వాళ్ల కోరికల కోసం.. ప్రభుత్వం మీద వాళ్ల అలక కొద్దీ, రెండేళ్ల క్రితం నక్సలైట్లు కిడ్నాప్ చేసి, అతన్ని ఒక రోజంతా వాళ్ల దగ్గర ఉంచేసుకున్నారు. ఆ సంగతి నీకూ తెలుసు. అది గుర్తుపెట్టుకో.. అదీగాక, నీ సర్వీసు ఏరియాలో ఉన్న పన్నెండు విలేజీల్లో.. పదకొండిట్లో ఓ మోస్తరుగా యాభై అరవై పర్సెంటు బిజినెస్ బాగానే ఉంది. మిగిలిన ఒక్క ఊళ్లో మూడేళ్ల

నుంచీ బిజినెస్ కొరవడినా, దానికి కారణం నాకు తెల్సుకాబట్టి .. నేను నిన్ను పొరపాటున కూడా సంజాయిషీ అడగను. దాన్ని లైటు తీసుకో!" నేను పిప్పినపల్లి బ్రాంచిలో జేరిన ఇరవై రోజులకే ఇన్‌స్పెక్షన్‌కి వచ్చిన రీజనల్ మేనేజర్ పెద్దరికంగా సలహా ఇచ్చేడు.

★★★

మా బాసు పేరు కూడా ఉచ్చరించడానికి సందేహించిన ఆ ఊరు పేరు 'కడివెదురు'. మూడేళ్ల క్రితం వరకూ అన్నల ప్రభావంతో, వాళ్ల సానుభూతిపరుల అండతో, ఆ ఊళ్లో కొన్ని అరాచకాలూ, దహనకాండలూ జరగడం వల్ల ఆ ఊళ్లో పోస్టాఫీసు పని చెయ్యదు. ఆర్టీసీ బస్సులాగిపోయాయి. కరంటాఫీసు ఉన్నా పని చెయ్యదు. రేషను దుకాణం ఎప్పుడో మూతబడింది. డాక్టరు రానేరాడు. అందరూ ఆ ఊరిని వెలివేసారు. నా ముందు బ్రాంచి మేనేజరు కూడ అప్పటి పరిస్థితుల్లో.. సమాజంలో ఇతర




శాఖలలాగ ఆ ఊరికి కాస్త దూరంగా ఉన్నాడు. పంటల మీద యిచ్చిన ఋణాల వసూళ్లకి వెళ్లలేదు. ఆరు లక్షల రూపాయలలా మొండి బాకీలుగా ఉండిపోయాయి. కొత్త ఋణాలు ఇవ్వలేదు.

నాకు నెలలో పదిహేను రోజులు అద్దె జీపు సదుపాయం ఉండేది. మిగతా పదిహేను రోజులూ ఇరవై మైళ్ల దూరంలో ఉన్న మరో బ్రాంచికి వెళ్లిపోవాలి జీపు. కానీ అవతల బ్రాంచి మేనేజరు 'నాకు జీపు అక్కర్లేదు.. నువ్వే వాడుకో.. నీ బ్రాంచి నుంచే అద్దె కట్టుకో ' అని నాకు పూర్తిగా జీపుని వదిలేసాడు.

★★★

"మీరు నన్ను కడివెదురు ఊరు సంగతి పట్టించుకోవద్దనన్నా, నేను ఆ ఊళ్లో సర్వీసు చెయ్యాలని అనుకుంటున్నాను సార్. చాలా జాగర్తగా ఉంటాను. మందులకోసం ఒక ఐదు వేలు శాంక్షను చెయ్యండి. మన హెడ్డాఫీసు బ్యాంకు డాక్టరుతో మెడికల్ క్యాంపు పెట్టించి చాలా మంది రోగిష్టులుగా ఉన్న ఆ ఊరి ప్రజలకి ముందు కొంత సాయం చేసే ప్రయత్నం చేస్తాను సార్!" అని అర్థించాను.. హెడ్డాఫీసు కి వెళ్లి మా రీజనల్ మేనేజర్ని.

"సరే.. జాగర్త మూర్తీ! మళ్లీ చెబుతున్నాను.. రిస్కు మాత్రం తీసుకోకు." అంటూ కాస్త అన్యమనస్కంగానే నేనడిన ఐదువేలు శాంక్షను చేశాడాయన.

మా హెడ్డాఫీసు డాక్టరు శ్రీధర్ నాకు మంచి మిత్రుడు. నా కోరిక మన్నించి తనతో పాటు మరో ఇద్దరు తన స్నేహితులైన డాక్టర్లను .. వాళ్ల దగ్గరున్న ఎన్నో శాంపిల్ మందుల్నీ తెచ్చేడు మెడికల్ క్యాంపుకి. మా పిప్పినపల్లి లేడీ డాక్టర్ లక్ష్మి నా అభ్యర్ధన మన్నించి, సిటీలో డాక్టరుగా వున్న తన భర్తని కూడా తీసుకుని క్యాంపుకు వచ్చింది. వాళ్లు కొన్ని మందులు తెచ్చేరు. బ్యాంకు ఇచ్చిన ఐదువేలకి నేను ఎంతో సంతృప్తిగా మరో వెయ్యి కలిపి ఖర్చుపెట్టేను. ఎంతో సీనియర్ అయిన డాక్టరు శ్రీధర్ కావలసిన మందులు రాసి, మంచి డిస్కౌంటుతో మెడికల్ క్యాంపుకి ఎక్కువ మందులు వచ్చేట్టు చేశాడు.

ఫలానా బ్యాంకు ఆధ్వర్యంలో 'కడివెదురు ప్రాంతం వారికి ఉచిత వైద్య శిబిరం' అని బేనర్లు రాయించి ఉదయం తొమ్మిది నుంచీ సాయంత్రం ఐదున్నర దాకా మెడికల్ క్యాంపు నిర్వహించేము. అది ఎందరో బాధితులకు, అనారోగ్యపరులకు, గర్భిణీ స్త్రీలకూ గొప్పగా ఉపయోగపడింది. ఉచితంగా వైద్య సలహాలూ, మందులూ అందుకున్న ఆ ఊరి జనాల్లో ఎంతో కృతజ్ఞతా పూర్వక ఆనందం తొణికిసలాడింది. మెడికల్ క్యాంపులో ఆ ప్రాంతంలో... ముఖ్యంగా ఆ ఊళ్లో మా బ్యాంకు సామాజిక సేవ గురించే ప్రస్తావించేను గానీ, పొరపాటున కూడా వ్యాపార విషయాలు.. మా పాత బాకీల గురించి నేను మాట్లాడలేదు గాక లేదు. మర్నాడు వార్తా పత్రికల్లో మా ఉచిత వైద్య శిబిరం గురించి అందరికీ తెలిసేట్టు చాలా మంచి ప్రశంసలొచ్చేయి.

★★★

మా బాస్ "స్లో" అన్నా, కడివెదురులో నా ఈ చొరవవల్ల ప్రస్ఫుటంగా కనపడిన మార్పులు నన్నెంతో ఆనందపరచాయి.

"పెద్ద కుటుంబమూ, బాధ్యతలూ ఉన్న మీరే ఇలా పల్లెటూళ్లో ఉండిపోయి ఇక్కడ ప్రజలకీ, కస్టమర్లకీ నిరంతరం సేవ చేస్తుంటే, వయసులో మీ కన్నా చాలా చిన్నదాన్ని.. నేను వారానికి ఒక్కసారి రావడం దారుణం సార్! ముమ్మాటికీ మీరే స్ఫూర్తి నాకు. నేను రోజూ పిప్పినపల్లికి వస్తాను సార్" అంటూ లేడీ డాక్టర్ లక్ష్మి రావడం మొదలు పెట్టింది. కొన్ని రోజులు ప్రాథమిక వైద్య కేంద్రంలోనే ఉండిపోయేది. రైతుల్తో మాట్లాడ్డానికీ, పంటల్ని చూడ్డానికీ.. నేను రోజూ మధ్యాహ్నం పూట ఒక గ్రామానికి నా జీపులో వెళ్లేవాడిని. లేడీ డాక్టరూ, ఆవిడ సహాయకురాలూ, ఇద్దరూ నాతో వచ్చి, ఆ ఊళ్లలో వారికి కావలసిన వైద్యసలహాలిచ్చి, మందులిచ్చి సాయం చేసేవారు. గర్భిణీ స్త్రీలు దాదాపు ఇంటిదాకా డాక్టరు రావడంతో అమితానందం పొందేవారు.

ఎమ్మార్వోగారితో మాట్లాడి కడివెదురులో మూసేసిన రేషన్ షాపు స్థానంలో రెండు షాపులు వచ్చేట్టు చూసి .. వాటికి స్వల్ప వడ్డీతో ఆర్థిక సాయం చేసాను. ఆ వ్యవస్థ పని చెయ్యనారంభించింది. పరిస్థితులు మారాయి అని ఆర్టీసీ అధికారులని నేను కలిసి అభ్యర్థించగా, వారు దయతో కడివెదురుకు బస్సు సౌకర్యం పునరుద్ధించేరు.

బ్యాంకు సాధారణ విధానాల ప్రకారం క్రాప్ లోన్లు అనబడే పంటల మీద ఋణాలు, రైతులు తిరిగి చెల్లించగానే ఒక్కరోజు గ్యాపు తీసుకుని, మర్నాడు రెన్యువల్‌గా మళ్లీ ఇచ్చేస్తాము. అంటే జస్ట్ పాత బాకీ జమ కట్టి మళ్లీ వెంటనే కొత్తలోను తీసుకోవడం అన్నమాట. మేము యివ్వడం ఎంత నమ్మకంగా యిస్తామో .. ఖాతాదారులు అంత బాధ్యతగా కట్టాలి మరి ! ఒక్కొక్కసారి సర్పంచి లాంటి ఒక వ్యక్తి ముందుకొచ్చి రైతులకి .. లక్షా .. రెండు లక్షలు సాయం చెయ్యడం.. దాంతో వాళ్లు ఒక్కొక్కరే బ్యాంకులో వాళ్ల బాకీ తీర్చి, మళ్లీ ఋణాలు పొంది సొమ్ము రొటేషను చేసుకోవడం కద్దు.

వైద్య శిబిరం తరవాత కడివెదురులో రైతులకి మీటింగు పెట్టి నేనే సలహా ఇచ్చినా ఫలితం దక్కలేదు వెంటనే. కారణం రెండు మూడు లక్షలున్న ధనవంతుడు దొరకలేదు. ముందుకు రాలేదు అక్కడ. దాదాపు రైతులంతా తమని ఆదుకునేదీ .. ఆదుకోగలిగేదీ పిప్పనపల్లిలో ఉన్న దుర్గమ్మ మాత్రమే అని తేల్చి చెప్పారు.

★★★

పిప్పనపల్లి లో దుర్గమ్మది చిన్న కిరాణాకొట్టు. పేరుకి దుర్గమ్మ కిరాణా కొట్టేగానీ.. నిజానికి అదొక ఎంపోరియం అని చెప్పొచ్చు. ఎటువులూ అమ్ముతుంది. పిన్నీసుల నుంచి స్టీలు బిందెలు దాకా, ప్లాస్టిక్ దువ్వెన నుంచి కుర్చీల దాకా.. తువ్వాళ్ల నుంచి చీరెలు దాకా అమ్ముతుంది. బియ్యం, ధాన్యం, పప్పు దినుసులూ.. వగైరా అన్నీ అమ్ముతుంటుంది. మళ్లీ పెద్దఎత్తున రైతుల దగ్గర్నుంచి కొంటుంది. దుర్గమ్మ పాపులారిటీ, పలుకుబడీ, వ్యాపార చతురత అంటే మొదట్లో ఎంత మురిసిపోయానో, రాను రాను అంత భయపడ్డాను. కారణం.. దుర్గమ్మ నాకు పోటీదారు. రైతులకి పంటల మీద అప్పులిస్తుంది. వడ్డీ ఎక్కువైనా.. కాగితాలూ.. రాత కోతలూ.. ఫోటోలూ.. ఎన్ ఓసీలూ గట్రా అవసరం లేదనీ.. అపరాత్రీ.. అర్ధరాత్రీ.. ఎప్పుడు పడితే అప్పుడు అప్పులిస్తుందనీ.. ఎంత ఊళ్లో మా బ్యాంకు ఉన్నా రైతులు కొంత ఆవిడ వైపు మొగ్గేవారు.

రొటేషనులో తిరుగుతున్న లక్షల డబ్బు కాకుండా.. మూడు నాలుగు లక్షల వస్తువులు, దినుసులు స్టాక్ కాకుండా దుర్గమ్మ దగ్గర ఏ అవసరానికైనా, ఎప్పుడైనా కనీసం రెండు మూడు లక్షలుంటాయని నా అంచనా.

నేను మా బ్యాంకు తరఫున లక్షల్లో బిజినెస్ చెయ్యవచ్చుగానీ మా బ్యాంకు రూల్సు ప్రకారం ఏ రోజూ యాభై వేలు దాటి సేఫ్‌లో నిలవ ఉంచకూడదు. వచ్చిన సొమ్ము వచ్చినట్లు లోన్లిచ్చేయాలి. ఒక వేళ నా దగ్గర యాభైవేలు నిలవ దాటితే అది అర్జంటుగా హెడ్డాఫీసుకి జమ కట్టడానికైనా, ఒక వేళ తగ్గితే, ఎంత కావాలంటే అంత అక్కడ్నించి డ్రా చేసి తెచ్చుకోడానికైనా మా క్యాషియరు రోజు విడిచి రోజు పదిహేను మైళ్లు దూరంలో వున్న మా మరో పెద్ద బ్రాంచికి జీపులో వెళ్లొస్తుండాల్సొచ్చేది. దానివల్ల టైము వేస్టు. క్యాషియర్ సాయం లేకపోవడం.. హైరానా అయ్యేది. ఇదే టైములో పరోక్షంగా కొంత బిజినెస్ కూడా అలవోకగా దుర్గమ్మకి చేరిపోయేది.

★★★

దుర్గమ్మ మనవలు ఆ ఊళ్లోనే ఎనిమిదో క్లాసూ.. పదో క్లాసూ చదువుకునేవారు. వాళ్లకీ, వాళ్లతో పాటు మరో పది పదిహేనిరవై మంది పిల్లలకి నేను సాయంత్రం పూట ప్రైవేటు చెప్పి సాయం చేసేవాడిని.

కాలక్షేపానికి నేను సిటీ నుంచి పాలూ.. చేలూ కార్యక్రమమైనా చూడటానికి పద్నాలుగు అంగుళాల బ్లాక్ అండ్ వైట్ టీవీ కొనుక్కుని, ఎత్తైన యాంటీనా బిగించుకున్నాను నా యిల్లు .. క్వార్టరూ .. అనబడే నా రూములో. అది చూసి బాగుందని దుర్గమ్మకి చెప్పి, అలాంటిదొకటి కొనమని మారాం చేసారు ఆవిడ మనవలు. 'నువ్వీసారి సిటీ నుంచి వచ్చేప్పుడు మాకూ ఒకటి తెచ్చివ్వు మేనేజరు బాబూ' అంటూ అభ్యర్ధించింది దుర్గమ్మ. అలాగే రెండ్రోజుల్లో సిటీ నుంచి వస్తూ టీవీ తెచ్చిచ్చాను. ట్రాన్స్‌పోర్టుతో సహా మొత్తం డబ్బు ఇచ్చేసింది దుర్గమ్మ. నాలుగు రోజుల తరవాత ..' మేనేజరు బాబూ.. నాకు ఇలాంటివి ఐదు టీవీలు కొనివ్వు బాబూ! నాలుగేసి వందలు లాభం వేసుకుని అమ్ముకుంటాను. ఊళ్లో మా చుట్టాలు చాలా మంది అడుగుతున్నారు. అడ్వాన్సులు కూడా ఇచ్చేరు' అంది దుర్గమ్మ. 'అలాగే దుర్గమ్మా!' అన్నాను. కొనిపెట్టేను. ఆ పల్లెటూళ్లో ఆవిడ వ్యాపార సరళికి జోహార్లర్పించకుండా ఉండలేకపోయాను. అలా దుర్గమ్మకి అల్మారాలు, కుక్కర్లు, రేడియోలు లాంటి మరికొన్ని వస్తువులు కొనిపెట్టి సాయం చేశాను. దుర్గమ్మకి నా మీద మరింత గురి ఏర్పడింది.

★★★

"దుర్గమ్మా మా బ్యాంకులో ఖాతా తెరువు తల్లీ" అంటే, అకౌంటు ఓపెన్ చేసింది. "నా అవసరం కొద్దీ... యాభై వేలూ.. లక్షా.. లక్షా యాభై వేలూ అడుగుతుంటాను. అవి నీ అకౌంట్లో జమ చెయ్యి. నేనవి ఆనాటికి వస్తామన్న రైతులకి మా బ్యాంకు లోన్లుగా ఇచ్చి పంపించేస్తాను. వాళ్ల పనుల మీద వాళ్లు వెళ్ళిపోతారు. మా క్యాషియరు జీపులో వెళ్లి మా పెద్దబ్రాంచి నుంచి డబ్బుతేగానే.. నీ దగ్గర విత్‌డ్రాయల్ ఫారం తీసుకుని మళ్లీ నీ సొమ్ము సాయంత్రం నీ కిచ్చేస్తాను. ఒక విధంగా నీ సొమ్ముతో నువ్వు రైతులకు సాయం చేసిన తృప్తి కూడా నీకు మిగుల్తుంది దుర్గమ్మ! దానికి తోడు ఎలాగా చుట్టుపక్కల ఊళ్లనుంచి వచ్చిన రైతులు కొంత మందైనా మళ్లీ నీ కొట్టుకు వచ్చి వాళ్లకి కావాలసినవి వాళ్లు కొనుక్కుంటారు దుర్గమ్మా!" అన్నాను.

"అలాగే మేనేజరు బాబూ.. నేను పొద్దున్న కట్టుకున్న లక్షో.. లక్షా యాభై వేలో మీరు సాయంత్రానికి మళ్లీ నాకే యిచ్చేస్తారుగా.. నా ఇనప్పెట్టిలో ఉండే సొమ్ము కాసేపు మీ బ్యాంకులో కూర్చుంటుంది అంతేగా!" నవ్వుతూ అంది దుర్గమ్మ.

★★★

ఆ రోజు పొద్దున్నే దుర్గమ్మ ఇంటికి వెళ్లేను. "దుర్గామ్మా.. నేనిప్పటికి కడివెదురు గ్రామానికి పదిసార్లైనా వెళ్లేను. ఏదో .. ఆ వూళ్లో మూడు నాలుగేళ్ల క్రితం ఏవేవో అరాచకాలు జరిగితే జరిగుంటాయి. నీకు తెలియందికాదు, అక్కడ రైతులూ, ప్రజలూ మంచి వాళ్లు. వాళ్లకి సాయం చెయ్యాలనుకుంటున్నాను. నీ వ్యాపారానికి పోటీ అనుకోకు. కడివెదురులో కొన్నికిరాణా కొట్లకీ, కనీసం మరో రెండు ఎఱువుల కొట్లకీ, ఒక బట్టల దుకాణానికీ లోన్లు ఇవ్వాలనుకుంటున్నాను!" అన్నాను.

"ఇయ్యండి బాబూ .. వాళ్లూ బ్రతకాలి కదా!" అంది దుర్గమ్మ.

"ఇదిగాక నేను ఆ వూరి రైతులకి చెయ్యాల్సిన మరో పెద్ద సాయం ఉంది. అందుకు నీ సాయం కావాలి దుర్గమ్మా!" అన్నాను.

"నేనా మేనేజరు బాబూ!" ఆశ్చర్యంగా చూసింది దుర్గమ్మ.

"అవును నువ్వే.. నేను కోరినప్పుడు నీ ఖాతాలో డబ్బు కట్టుకుని అదే రోజు విత్‌డ్రా చేసుకుని నాకెలా సాయం చేశావో.. అలాగే మా బ్యాంకుకి బాకీ పడిన కడివెదురు రైతులకీ సాయం చెయ్యి. రోజుకి రెండు లక్షల చొప్పున నువ్వు మళ్లీ అప్పులిచ్చి, దాంతో వాళ్లు మా బ్యాంకులో పాత బాకీలు తీర్చుకునేట్లు సాయం చెయ్యి దుర్గమ్మా. అలా కడివెదురు పాత బాకీలు తీరిపోగానే, నాకు మళ్లీ వాళ్లకి ఋణాలిచ్చే అవకాశం కలుగుతుంది కాబట్టి, ఆ మర్నాడే కొంత పెంచి, ఆ మొత్తంతో మళ్లీ కొత్త ఋణాలిచ్చేస్తాను.

వాళ్లు వెంటనే నీ బాకీలు తీర్చేస్తారు. అంటే నీ సొమ్ము నీకు ఒక్క రోజులోనే నీకు వచ్చేస్తుందన్నమాట. అలా అవసరాన్ని బట్టి నాకోసం ఒక వారం, పది రోజులు.. పదిహేను రోజులు ఒక రెండు లక్షలు రొటేషను చెయ్యి దుర్గమ్మా! కడివెదురు రైతులు లైన్లో పడిపోతారు. నీ డబ్బు వెంట వెంటనే తిరిగిచ్చేస్తారు. సందేహించకు. నీకు నా వ్యక్తిగత పూచీమీద రెండున్నర లక్షలకి నోటు కూడ రాసి తెచ్చాను దుర్గమ్మా!" అన్నాను ఉద్వేగంగా.

'నోటు వద్దు, కాగితం వద్దు మేనేజరు బాబూ.. మీ మాట చాలు బాబు నాకు! మీరు మాకు మంచి చెప్పేవాళ్లు, మంచి చేసేవాళ్లు. మా పిల్లలకి చదువులు చెబుతున్నారు. ఊళ్లల్లో జనాలకెంతో సాయం చేస్తున్నారు. నిజానికి మీరు వచ్చిన దగ్గర్నుంచీ నా వడ్డీ వ్యాపారం బాగా పడిపోయినా.. నా మిగతా వ్యాపారం మీ దయ వల్ల చాలా బాగుంది బాబూ! మీ చలవ వల్ల డాక్టరమ్మ రోజూ వస్తోంది. మీతో వూరూరా తిరుగుతోంది. కాన్పుకి ఇబ్బంది పడే ఇద్దరు ముగ్గుర్ని మీ జీపులో పెద్ద ఊరు ఆస్పత్రికి జేర్పించేరు. నా భర్తతో సహ పాము కాటుతో ప్రాణాలు పోయేవాళ్లనో ముగ్గుర్ని మీ జీపులో పెద్దాసుపత్రికి పంపి కాపాడేరు. నోరులేని పశువులకి కూడా వైద్య పరీక్షలు చేయించి మందులిప్పించి రైతులకెంతో సాయం చేసారు. అలాంటి మీరు అడగ్గా.. నేను చెయ్యగలిగిన ఈ పాటి సాయం చెయ్యకపోతే నేను పాపం మూటకట్టుకున్నట్టవుతుంది బాబూ! మీ మాట చలవతో కడివెదురు ప్రజలు నా డబ్బు నాకు తిరిగి ఇచ్చేస్తారు మేనేజరు బాబూ. ఒకవేళ వాళ్లు ఇవ్వకపోయినా నేను బాధపడను. గత నాలుగైదేళ్లలో వాళ్లు నాకు రెండు లక్షలకి మించి వడ్డీలు కట్టేరు బాబూ! ఈ క్షణం నుంచే కడివెదురు రైతుల్ని పిలిపించండి సారూ. నేను రోజూ రెండు లక్షల చొప్పున వాళ్ల బాకీలు తీరుస్తాను. తీర్పిస్తాను బాబూ!" ఎంతో ఆనందంతో.. ఆత్మవిశ్వాసంతో అన్న దుర్గమ్మ కాళ్లకి చటుక్కున వంగి నమస్కరించాను.

మూడేళ్లు ఇట్టే గడిచిపోయాయి. ఇక నాకు స్థానభ్రంశం తప్పదనుకున్నాను.

ఆ రోజు .. నన్ను మరో రెండేళ్ళు అక్కడే ఉంచుదామనుకుంటున్నానని కొత్తగా వచ్చిన రీజనల్ మేనేజర్ ఫోను చేసి చెప్పాడు.

నిజానికి ఆ క్షణంలో.. నవ్వాలో, ఏడ్వాలో తెలియని పరిస్థితి.

కానీ..

ఆ ఊళ్ళు.. ఆ ప్రదేశాలూ.. సంతృప్తిగా మారిన మనుషులు.. అక్కడి అనుభూతులు.. ముఖ్యంగా పెద్ద దిక్కు దుర్గమ్మ గారూ.. నాకు మరింత ఆనందాన్నిచ్చే అవకాశం కలిగించేరని భావించి.. "మీ ఇష్టం సార్" అంటూ రీజనల్ మేనేజర్ గారికి ఫోను చేసి చెప్పేను.

# తెల్లని నీడ

వాడపల్లి పూర్ణ కామేశ్వరి



✆ 8056024790

**కథారవళి – శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన 2022 మెరుపు కథల పోటీ ప్రథమ బహుమతి పొందిన కథ.**

*ఉడుకు రక్తపు వేగం. ఒళ్ళు తెలియని పొగరుతో వ్యవహరించాం; వీధి రేసింగులూ, స్టంట్ డ్రైవింగులూ అంటూ. ఆ పోటీలే గొప్ప ఘనకార్యమని అనుకున్నాం. ఎందరి మనోవ్యధకో కారణమయ్యాం కదరా! ఎందరినో ఏడిపించిన మనకు ఈ శిక్ష చాలదురా. ఇంకా కావాలి!"*

'కళకళలాడుతున్న నా ఇల్లు ఒక్కసారిగా మోడువారి పోయింది. ఎప్పుడూ కిలకిలా నవ్వుతూ ఉండే నా చిట్టి తల్లి గొంతు మూగవోయింది! విశాలమైన తన ఇంట అడుగు పెడుతున్న రఘునాథం అనుకున్నాడు.

ఎంతో కష్టపడి నిర్మించుకున్న నా ఇంట్లో ఇప్పుడు నేను నీడనై తిరుగాడుతున్నాను. పురిటికి వచ్చిన కూతుర్ని మురిపెంగా చూసుకుంటూ, దౌహిత్రుడు పుట్టాడని మనవడ్ని చూసుకుని మురిసిపోయి నెలయినా అవ్వలేదు. అంతలోనే పరలోకానికి చేరిపోయాను.

'అప్పుడే వెళ్ళిపోవలసిన వయసు కాదు మన రఘునాధానిది. ఇంత చిన్న వయసులోనే దుర్మరణం పాలవ్వడం చాలా దురదృష్టకరం' ఘోరాన్ని సహించలేని వారంతా పరామర్శకు వచ్చి అనుకున్న మాటలవి.

విదేశీ ప్రాజెక్టుకై ఆరు నెలల పాటు శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి వెళ్లి తిరిగి వచ్చిన అల్లుడ్ని విమానాశ్రయంలో రిసీవ్ చేసుకుని తీసుకొస్తున్నప్పుడు జరిగింది ఆ ఘోర ప్రమాదం. తెల్లవారు ఝామున హైవేలో, అదుపు మీరిన వేగంతో రేసులు ఆడుతున్న కుర్రకారు నిర్లక్ష్యానికి బలైపోయారు ఆ మామా అల్లుళ్ళు.

★★★

మూడు నెలల తరువాత.

అది స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రి. కోలాహలంగా వున్న ఎమర్జెన్సీ వార్డులో పని చేస్తున్నాడు రోహిత్. రోడ్డు ప్రమాదానికి గురై రక్తం చిందుతూ స్ట్రెచర్ మీద తీసుకు వచ్చిన వ్యక్తిని చూసి కడుపులో దేవేసి, వాంతి చేసుకుంటున్న సాకేత్ వెన్నుపై నిమురుతూ.. "అంతా సద్దుకుంటుందిరా సాకేత్. భయపడకు!" అంటున్నాడు.

"నాకు చెపుతున్నావే కానీ, నీ చేతులూ వణుకుతునే వున్నాయిరా!" గద్గద స్వరంతో అన్నాడు సాకేత్.

"ఈ అంబులెన్సుల శబ్దాలూ, రక్తపు మడుగులూ, విరిగిన ఎముకలూ, చెదిరిపోయిన కన్నవారి కలలూ, ఆరని గాయాలూ చూడలేకపోతున్నానురా. దీనికన్నా జైలు శిక్షే మేలనిపిస్తోందిరా!" కుమిలి పోయాడు రోహిత్.

మోగుతున్న మొబైల్ ఫోనుని తీస్తూ, "చెప్పరా మచ్చా, అక్కడ నువ్వూ, మన సుమంత్ ఎలా వున్నార్రా? కొత్త చోట పనీ, అనుభవం ఎలా వున్నాయి?" అన్నాడు రోహిత్.


రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న సంజయ్ కాల్ అది. సుమంత్‌తో పాటు సంజయ్ కూడా అక్కడే పనిచేస్తున్నాడు.

"యాక్సిడెంట్ వార్డుకి ఇప్పుడే ఒక గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో వచ్చాడురా. దగ్గరగా వెళ్ళి చూస్తే, మన రాజేష్ బావ అని గుర్తు పట్టానురా. నాకు చేతులూ కాళ్ళూ ఆడటం లేదనుకో. నువ్వైతే వాడికి ఈ వార్త జాగ్రత్తగా చెపుతావని ముందు నీకు ఫోను చేస్తూన్నాను. ప్రస్తుతం ఏమీ చెప్పలేమంటున్నారు డాక్టర్లు. మనమంతా ఆ పెళ్ళిలో ఎంత సందడి చేసామో. అలాంటిది ఇప్పుడు, అతడిని ఇలా చూస్తుంటే...." బోరుమని ఏడ్చేసాడు సంజయ్.

"ఉడుకు రక్తపు వేగం. ఒళ్ళు తెలియని పొగరుతో వ్యవహరించాం. వీధి రేసింగులూ, స్టంట్ డ్రైవింగులూ అంటూ ఆ పోటీలే గొప్ప ఘనకార్యమని అనుకున్నాం. ఎందరి మనోవ్యధకో కారణమయ్యాం కదరా! ఎందరినో ఏడిపించిన మనకు ఈ శిక్ష చాలదురా. ఇంకా కావాలి!" సంజయ్‌తో అంటూ చికిత్స పొందుతున్న రాజేష్ బావను చూస్తూ బాధపడుతున్నాడు సుమంత్.

★★★

సరిగ్గా ఆరు నెలల క్రితం.



ఈస్ట్ కోస్ట్ రోడ్. రాత్రి పదకొండు గంటలు. బెట్టింగ్ మరియు స్టంట్ రేసింగ్ జరుగుతోంది. సుమారు ఇరవై మంది యువకులు ఆ పోటీలో తమ తమ సత్తాని రుజువు చేసుకునేందుకు బైకులతో సిద్ధంగా వున్నారు.

"సింగిల్ వీల్ లిఫ్టరన్. ఒక కిలోమీటరు దూరం, ఎత్తిన చక్రం దించకుండా. గంటకి నూట నలభై కిలోమీటర్ల వేగంతో నాతో పోటీకి సిద్ధపడే వారెవరు?" సవాలు విసిరాడు మోహిత్.

"వీలీస్, స్టాపీస్, బర్న్ ఔట్స్. అన్నింటి కాంబోతో నేను రెడీ!" కావాసాకీ బజాజ్ 636 మోడల్ స్టంట్ బైక్ పైనున్న రోహిత్ అన్నాడు.

టీవీఎస్ అపాచి ఆర్.టీ.ఆర్ 160 రేసు బైకును సిద్ధం చేస్తూ మరో సవాలు విసురుతూండగా ఆదిల్ చేతిని పట్టుకున్నాడు అక్కడికి అకస్మాత్తుగా వచ్చిన ఎస్.ఐ. ఒక్కసారిగా పోలీసుల బృందం వచ్చి చుట్టుముట్టడంతో ఈసారి పరారయ్యే అవకాశం చిక్కలేదు ఆ గ్యాంగుకి. అన్ని బైకులనూ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

"మీ ముఠా కోసం ఎన్నాళ్ళనుంచో కాపు కాచుకుని చూస్తున్నాం. మెరీనాలో ఒక రోజైతే, పాండిచేరిలో మరో రోజూ. ఇక్కడ ఈసీఆర్ రోడ్డులో ఇంకో రోజు. ఎప్పుడు ఎక్కడ పెట్టుకుంటారో తెలియకుండా టైములు మార్చేస్తూ మా కళ్ళు కప్పుతున్నారు. కలవారి పిల్లలైనందున పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్నారే కానీ, కాని పనులు చేస్తే చట్టం మాత్రం చూస్తూ

ఊరుకోదు. ఇక కోర్టు ఆదేశాల తరువాతే మీ బళ్ళు మళ్ళీ మీ చేతికి చిక్కేది. మీ అందరిపై కేసును నమోదు చేస్తున్నాం. మీరు చెప్పుకోదల్చుకున్నదంతా కోర్టులోనే!" ఆవేశంగా అన్నాడు ఇనస్పెక్టర్ మిత్రా.

★★★

"రేసులంటూ, నడి వీధుల్లో అర్ధరాత్రి విపత్కరమైన విన్యాసాలు చేస్తూ చెలరేగి పోతున్నారు యువతరం. తమ ప్రాణాలకు ప్రమాదం కొని తెచ్చుకోవడమే కాకుండా మరెందరి ప్రాణాలకో అపాయం తలపెడుతున్నారు. గత ఆరు నెలలుగా నగరంలో విపత్మరణాలకు గురైన వారి జాబితోపాటు, కేవలం రేసుల కారణంగా తమ శరీర అవయవాలను కోల్పోయిన యువత జాబితాను కూడా కోర్టుకు సమర్పించడమైనది. రహస్యంగా చేస్తున్న ఇట్టి విపత్కరమైన విన్యాసాలు చట్ట విరుద్ధమైనవి. ఈ చర్యలకు పాల్పడుతూ పట్టుబడిన వీరిని కోర్టు కఠినంగా శిక్షించాలని కోరుతున్నాను!" తమ వాదనతో కాగితాలను సమర్పించారు ప్రాసిక్యూషను లాయరు.

"కేసు పూర్వాపరాలను పరిశీలించిన పిమ్మట యువతరం దిశ తప్పుతోందన్న వాస్తవాన్ని కోర్టు గుర్తిస్తోంది. ఈ చేదు నిజం మరోసారి మన సమాజాన్ని హెచ్చరిస్తూ వెక్కిరింపుగా చూస్తోంది. చదువు సంస్కారాన్నీ, వివేకాన్నీ ఇవ్వలేని నాడు దానికి సార్థకత లేదు. భావిజీవితపు మంచిచెడులను తెలుసుకోలేని అవివేకంతో చెలరేగుతున్న యువతకు కఠిన శిక్ష వేయమన్న ప్రాసిక్యూషను వారి వాదనను పరిశీలించడమైనది. ఈ యువకులు శిక్షార్హులే! ఐతే అది వారిలో మార్పును తెచ్చి పరివర్తనకు దారితీసేదిగా వుండాలని భావిస్తూ, యీ వినూత్నమైన శిక్షను కోర్టు విధించడమైనది. 'కేసులో సంబంధిత యువకులందరూ ఆరు నెలల పాటు అనేక ప్రభుత్వ ఆసుపత్రులలో ఎమర్జెన్సీ వార్డులలోనూ, యాక్సిడెంటు వార్డులలోనూ సహాయకులుగా పని చేస్తూ, ప్రతీ రోజూ తమ అనుభవాలను ఒక రిపోర్టుగా వ్రాసి, దానిని సరిగ్గా ఆరు నెలల పిమ్మట కోర్టుకు సమర్పించాలి. అది కోర్టు ఆమోదించిన తరువాతే వారికి శిక్ష పూర్తైనట్టుగా కోర్టు ఆదేశిస్తోంది!"

తన చిన్ననాటి స్నేహితుడైన రఘునాథం చిరునవ్వుతో కోర్టు హాలు నుండి తెల్లని నీడలా కనుమరుగవ్వడం చూస్తున్న జడ్జిగారి కళ్ళు చెమ్మగిల్లాయి.

# బోను

సింహప్రసాద్



✆ 9849061668

**కథారవళి – శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన 2022 మెరుపు కథల పోటీ ద్వితీయ బహుమతి పొందిన కథ.**

***“మనం అతడి కోసం బోను పెడితే, ఇంకెవరో మన కోసం బోను పెట్టినట్టున్నారే ఖర్మ! ఇంకెందుకీ కంచి గరుడసేవ, పద పోదాం. త్వరగా గెటప్ మార్చి, ఆ తర్వాత వూరు మార్చేద్దాం. మరో బంగారు పిచిక దొరక్కపోదు. పద పద”***

“గుడ్‌లక్ మ్యారేజ్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నాం మేడం. ఓ ఎన్నారైకి మీ ప్రొఫైల్ చాలా బాగా నచ్చింది. వెంటనే పెళ్లి చేసుకుని భార్యని అమెరికా తీసుకెళ్లిపోవాలని చాలా హర్రీగా వున్నాడు. మీ గురించి ఫేవరబుల్‌గా చెప్పేం. కట్నకానుకలు ఆశించడంలేదు. మీ పెళ్లి కుదిరిపోయినట్టే. తర్వాత మీ ఇద్దరూ కలిసివున్న ఫోటో పంపండి. మా కమీషన్ సంగతి మర్చిపోవద్దు సుమా...!”

నా అమెరికా డ్రీమ్ నెరవేరబోతోంది! ఆనందం గుండెలు పట్టక పాలపొంగులా పొంగసాగింది! వాళ్ళు కమీషన్‌కు కక్కుర్తి పడి, అతడిలోని నలుపుకి తెలుపు పెయింట్ వేయరుగా!

“సుశీలా, నీ రొట్టె విరిగి నేతిలో పడిందే. నీకు అమెరికా సంబంధం ఖాయం చేసేసా. రత్నారావుగారు నీకు ఫోన్ చేస్తారు. ఓకే అని తల గట్టిగా ఊపేసెయ్!” ఫోన్లో సంబరంగా చెప్పింది అక్క.

నాకు తెలీకుండా నా పెళ్లి గురించి తను ఖాయం చేసేయడం ఏమిటబ్బా?

నా సెల్ మళ్ళీ మోగింది.

“మేడం, నేను ఎన్నారై డాక్టర్ రత్నారావుని. మేరేజ్ బ్యూరోలో మీ ప్రొఫైల్ చూసాను. నచ్చింది. మీ సిస్టర్తో అన్నీ మాట్లాడేసాను. మనం ఒకసారి కలిసి ‘ఓకే’ అనుకుంటే బావుంటుంది!” ఎంతో వినయంగా అన్నాడు.

“నా ఆస్తిపాస్తుల వివరాలూ చూసారా! అంతా నేను రిచ్ విడోనని ఇష్టపడుతున్నారులెండి.”


“నాకా అవసరం లేదు. అయాం వెల్ సెటిల్డ్ ఇన్ అమెరికా”

అటు బ్యూరో వాళ్ళు, ఇటు అక్క చెప్పిందీ ఇతని గురించే అని అర్థమైపోయింది. “ఐ సీ. అసలందులో నా ఆస్తుల వివరాలు ఇవ్వడం ఇష్టం లేదు. మా అక్కే.. రెండో పెళ్లి కదా అని ఇచ్చింది! అన్నట్టు మీరు గమనించారో లేదో.. నేను డైవోర్సీని ......”

“మీదే కాదు, నాదీ రెండో పెళ్లే ...!”

“నా వయస్సు 32 సంవత్సరాలు. మీకోసం 20 ఏళ్ల కన్నెపిల్లలు ఎగబడుతూంటారు. వారికన్నా నేను మీకు నచ్చానా!”

“వయస్సు తేడా తక్కువ ఉంటే అవగాహన బాగుంటుంది. ఎప్పుడు కలుద్దాం? నేను వన్ వీక్లో అమెరికా వెళ్ళిపోవాలి. ఆలోగా పెళ్లి చేసుకోవాలి...!”




"నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి ప్లీజ్ ..."

వెంటనే మా అక్కకి ఫోన్ చేసాను.

"చాలా గొప్ప సంబంధం కదా? నీ టేస్ట్ నాకు తెలుసు గనుక, అన్ని ముగ్గులూ పెట్టేసాను. దేవుడు అనుకూలిస్తే రెండు మూడు రోజుల్లో నీ పెళ్ళై పోతుంది. అమెరికా ఎగిరెళ్ళిపోతావు. నన్ను మర్చిపోకేం!"

"అక్కా, గుర్రాన్ని కాస్త కట్టేస్తావా. ఇవాళ రేపు ఎన్నారైల పేరిట చాలా మోసాలు చేస్తున్నారు....."

"నీ అనుమానాలు పాడుగానూ. ఏదేదో ఊహించుకుని బంగారంలాంటి సంబంధం కాలదన్నకు. అమెరికాలో అత్యధికంగా సంపాదించేది డాక్టర్లేనే పిచ్చీ!"

ఎటూ తేల్చుకోలేకుండా ఊగుతూంటే మళ్ళీ ఫోన్ మోగింది.

"హలో.. సుశీల గారేనా? మీరు రత్నారావుగారి సంబంధం కుదుర్చుకున్నారట, నిజమేనా? ఏం లేదు, అది నిజం కాకపోతే మేం ట్రై చేసుకుంటాం!"

"మేం ముహూర్తాలు కూడా పెట్టేసుకున్నాం. సారీ!" ఠక్కున చెప్పి, అంతే వేగంగా పునరాలోచనలో పడ్డాను.

నా అమెరికా కల ఎక్కడ చెదిరిపోతుందోనని తొందరపడుతున్నానా? అసలు నాకన్నా ఎక్కువగా వాళ్ళంతా ఆసక్తి చూపుతున్నారేంటి? వాళ్లకేం ప్రత్యేక ఎజెండా లేదుకదా? లేకపోతే అంతా కలిసి నన్నే ఉచ్చులోకో తరుముతున్నారా? ఛాఛా.. దానికి అవకాశం లేదు గాని, ఒకసారి దెబ్బతిని వున్నాను గనుక నేనే ఆచి తూచి అడుగులు వెయ్యాలి!

★★★

ఆ మర్నాడే రెస్టారెంట్ లో కలుసుకున్నాం. రత్నారావు నన్ను తేరిపార చూస్తుంటే, నేనతన్ని ఆసాంతం పరిశీలనగా చూశాను.

అతనికి 38–40 ఏళ్ళు ఉంటాయి. బలంగా ఎత్తుగా ఉన్నాడు. మా ఇద్దరి ఈడు జోడు బాగానే ఉంటుంది. తన ఐడి కార్డు , పనిచేస్తున్న హాస్పటల్ ఫోటో, న్యూజెర్సీలోని సొంత ఇల్లు.. ఫోన్లో చూపించాడు.

"ఇవన్నీ ఎందుకు చూపిస్తున్నారు? నేనేమీ అడగలేదుగా!"

"డౌట్స్ రాకుండా ముందే చూపించేస్తున్నా. నాకు మలేషియన్ టౌన్షిప్‌లో ఫ్లాటూ, నల్లగండ్లలో ప్లాట్, విలేజ్ లో కొన్ని ల్యాండ్స్ ఉన్నాయి!"

కంగారు పడిపోయాను. ఇన్ని వున్న వాడు నా సంబంధానికి రావటం... దాల్ మే కుచ్ కాలా హై !

"మీ భార్య...పిల్లలు...?"

"నాకు ట్విన్స్. ఆడపిల్లలు. వాళ్ళూ, నా భార్యా ఘోర రోడ్ ప్రమాదంలో ... !"

"అమెరికాలో కదా, ఇన్సూరెన్సు బొచ్చెడు వచ్చి ఉంటుంది ..." అతడి ముఖకవళికలు పరిశీలిస్తూ అన్నాను.

"మనుషులు తిరిగి రారు కదా! మీ సంగతేంటి?"

"డివోర్స్. అతడు శాడిస్ట్.... !"

సడనుగా అప్పుడు మా అక్క ఎంట్రీ ఇచ్చింది. "మీ ఇద్దరికీ శుభాభినందనలు. ఎల్లుండి మధ్యాహ్నం 11.20 నిమిషాలకి బ్రహ్మాండమైన ముహూర్తం కుదిరింది. దైవజ్ఞులు రామనారాయణ శాస్త్రిగారు పెట్టేరు!"

"ఆయనైతే ఇంక తిరుగుండదు. నాకు ఓకే!" అనేసి నా వంక చూసాడు రత్నారావు.

అక్క దూకుడుకి భయమేసింది. పక్కకు లాక్కెళ్లి కోప్పడ్డాను. "నా ఫ్రెండ్ రూప... ఏమైందో నీకు తెలుసుగా అక్కా!"

"ఆ పిల్ల గల్ఫ్ వాడ్ని చేసుకుంది. ఏ అరబ్ షేక్‌కు అమ్మేశాడో లేక ఇంకేం చేసాడో గాని, మొత్తానికి గాయబ్ అయింది. కానీ , ఇతడు అమెరికా వాడే. అక్కడ అమ్మేసేయడాలు కుదరవు. అంతా పక్కాగా ఉంటుంది!"

"ఆల్రెడీ ఒకసారి దెబ్బతిని వున్నాను. ఇతగాడి తొందరపాటు చూస్తుంటే... అతడికి ఇంకేదైనా ఈవిల్ ప్లాన్ ఉందేమోనని భయంగా వుంది. మళ్ళీ రిస్కు తీసుకునే స్థితిలో లేను, కాస్త అర్థం చేసుకోవే!"

"మనుషుల్ని అంచనా వెయ్యడంలో నాది అందె వేసిన చెయ్యి. నోర్మూసుకుని రా!"

కోపంగా అనుమానంగా చూస్తూ అనుసరించాను. అక్క స్పీడు చూస్తుంటే నా వెనుక వాళ్లిద్దరూ ఏదో డీల్‌కు వచ్చినట్టే వుంది. ఇద్దరూ కలిసి నన్ను గినీపిగ్‌ని చేసెయ్యరుగా! ఎవరి లాభం వాళ్ళు చూసుకుంటే, మధ్యలో నేను అన్యాయమైపోతాను!

"గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ముహూర్త బలం అంటే ఇదే మరిదిగారూ!"

"మా వాళ్ళకి ఎలాంటి అభ్యంతరాలూ లేవు. ఎల్లుండి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో పెళ్లి చేసుకుందాం. ఆ నెక్స్ట్ డే వీసా స్టాంపింగ్‌కి వెళ్ళవచ్చు..." నాతో అన్నాడు.

"రిజిస్ట్రార్ ఆఫీస్ బెటర్. వీసాకి పక్కా మ్యారేజ్ సర్టిఫికేట్ కావాలిగా!" అంది అక్క. గుడ్డిలో మెల్ల అనిపించింది.

వాళ్ళు నా పెళ్లిపనుల గురించి మాట్లాడేసుకుంటుంటే శ్రోతలా ఉండిపోయాను. అలాగని ఈ సంబంధం వదులుకోడానికి నేను సిద్ధంగా లేను.

అతడెళ్ళేక, సంతోషం కప్పిపుచ్చుకుంటూ, "ఇంకేదైనా టెస్ట్ చేసుండాల్సిందేమో అక్కా!" అన్నాను.

"చేసేస్తాలే. మై హూ నా!"

మర్నాడు, "కిరణ్‌గాడికి ఐదు లక్షలిచ్చారు రత్నారావుగారు!" మెరుస్తూన్న కళ్ళతో చెప్పి, డబ్బు కట్టల్తో వున్న కిరణ్ ఫోటో చూపించింది.

"మై గాడ్! అతడు నన్ను అనుమానిస్తే మొదటికే మోసం వస్తుందే !" ఏడ్చేసాను.

"కిరణ్‌గాడు నీ మాజీ మొగుడనీ, అప్పట్లో తీసిన నీ న్యూడ్ ఫోటోలు సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడనీ చెప్పేను. అతడ్ని పంపిస్తే అంతా సెటిల్ చేస్తానన్నాడు. చేసేసాడు. దట్సాల్!"

"ఆ డబ్బేది?" కించిత్తు అనుమానంగా చూస్తూ అడిగాను.

"నీ కాబోయే మొగుడి సొమ్ము నేనేం తినెయ్యనులే. రేపు తెచ్చి ఇస్తానన్నాడు"

అక్క మాట నమ్మొచ్చా? కిరణ్‌గాడిని విశ్వసించవచ్చా? డబ్బు దగ్గర అంతా దగుల్బాజీలే !

మొత్తానికి మళ్ళీ పెళ్ళి డ్రెస్ ధరించాను. అక్క ఎంతో శ్రద్ధగా అలంకరించింది.

అక్కా నేనూ క్యాబ్‌లో రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళ్లాం.

ఆఫీస్ గుమ్మం దగ్గర జగ్గారావు, వినయ్‌కుమార్ కనిపించారు. జంట దెయ్యాలని చూసినట్టు అదిరిపడ్డాం.

"వీళ్ళు ఇప్పుడిక్కడికి ఎందుకొచ్చి చచ్చారంటావ్!" ఆందోళనగా అడిగాను.

"వాళ్ళ వంక చూడకు. ముఖం కనిపించకుండా చీర కొంగు కప్పుకో!"

రత్నారావు ఫోన్ చేసాడు. "ఎక్కడున్నావు సుశీలా! నీకోసం ఆఫీసులో వెయిటింగ్!"

"గేటు దగ్గరే వున్నాం. ఇదిగో లోపలికి వచ్చేస్తున్నాం....."

"నువ్వు వెంటపడి మరీ పెళ్లి చేసుకుని, ఆ వెంటనే విడాకులు కావాలని వేధించి, డబ్బు దండుకున్నావని ఎవరో ఇద్దరు వచ్చారు. వాళ్ళు మన పెళ్ళిలో న్యూసెన్స్ చెయ్యకుండా పోలీసులకు పట్టించేస్తాను....."

కాళ్ల కింది భూమి కదులుతూంటే, "వద్దు వద్దు" అరిచి లైన్ కట్ చేశాను. "ఈ దెయ్యంగాళ్ళు అతడ్ని కలిసి చచ్చారక్కా!"

"మాంసం ముక్క విసురుదాం. దెబ్బకి మాయమైపోతారు!" అంటూ అక్క, కిరణ్‌గాడికి ఫోన్ చేయబోతూంటే వాడే చేసాడు. రత్నారావు డబ్బు ఇవ్వలేదనీ, ఇచ్చినట్లు ఇచ్చి తిరిగి తీసేసుకున్నాడనీ చెప్పాడు.

గాభరా పడ్డాను. "ఎక్కడో ఏదో తేడా కొడుతోందక్కా!"

"మనం అతడి కోసం బోను పెడితే, ఇంకెవరో మన కోసం బోను పెట్టినట్టున్నారే ఖర్మ! ఇంకెందుకీ కంచి గరుడసేవ, పద పోదాం. త్వరగా గెటప్ మార్చి, ఆ తర్వాత వూరు మార్చేద్దాం. మరో బంగారు పిచుక దొరక్కపోదు. పద పద___."

మేం వెనుదిరిగామో లేదో, ఎదురుగా జీపునానుకుని నిలబడి నవ్వుతున్నాడు రత్నారావు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ దుస్తుల్లో!

# ఆయుధం

డా. ఎమ్. సుగుణరావు

✆ 8056024790



**కథారవళి – శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన 2022 మెరుపు కథల పోటీ తృతీయ బహుమతి పొందిన కథ.**

***ఆ విషయం ఎవరికి చెప్పుకోలేని సంగతి కనుక.. మహేష్ దాచిపెట్టి, తన తండ్రికి, కళ్ళ మీద ఎవరో కొట్టారని అబద్ధం చెప్పాడు. ఆయన తాగివున్న విషయం కూడా మన దగ్గర దాచాడు. కేటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవటం కోసం ఆ నేత్రాలయాలో చేరి, తనకు తగలరాని చోట తగిలిన గాయానికి డాక్టర్ సీతాపతిగారి చేత వైద్యం చేయించుకున్నాడు.***

"కిరీటిగారా!"

ఫోన్ ఎత్తగానే ఒక పరిచయం లేని స్వరం.

"ఔను. మీరెవరు?" అన్నాడు కిరీటి.

"నా పేరు మహేష్. ఒక కేసు పరిశోధన చెయ్యాలి!" అన్నాడు అవతలి వ్యక్తి.

"సరే వివరాలు చెప్పండి" అన్నాడు.

"ఫోన్లో చెప్పేవి కాదు. ఇంటికి రండి మాట్లాడుకుందాం. మీకు కారు పంపుతాను!" అన్నాడతను.

"సరే" అంటూ ఫోన్ పెట్టేసాడు.

పావుగంట తర్వాత అతని అసిస్టెంటు సుబ్రహ్మణ్యం వచ్చాడు. కేసు సంగతి చెప్పాడు.

అరగంట తర్వాత కారొచ్చింది. సుబ్రమణ్యంతో కలిసి కారెక్కాడు. ఆ రోడ్డు దాటి హైవేలో పావుగంట ప్రయాణం తర్వాత ఊరిచివర ఆ విశాలమైన మూడంతస్తుల భవనం చేరుకున్నారు. బయట గేటు దగ్గర సెక్యూరిటీ గార్డు గేటు తీసాడు. లోపల కారు పార్క్ చేసిన డ్రైవర్, కిరీటిని లోపలకు తీసుకువెళ్ళాడు. ఆ విశాలమైన గదిలో రివాల్వింగ్ చైర్ ఎదురుగా గాజుపలక పరిచిన పొడుగైన టేబుల్. అతను మహేష్ అని అర్థమయింది కిరీటికి. కూర్చున్న వెంటనే, ఏ ఉపోద్ఘాతం లేకుండా చెప్పడం మొదలు పెట్టాడు అతను.

"మా నాన్న సర్వేశ్వరరావు గారిని రెండు రోజుల క్రితం ఎవరో కొట్టారు. ప్రాణానికి ప్రమాదం లేదు. ఎవరు కొట్టారో చెప్పలేక పోతున్నారు. ఆ రోజు సాయంత్రం ఆరు దాటింది. కాస్త చీకటి పడింది. మా గ్రానైట్ ఫ్యాక్టరీలో అంతా వెళ్ళిపోయారు, ఆ ఫ్యాక్టరీ పక్కన మా గెస్ట్‌హౌస్ బయట నాన్నగారు రిలాక్స్ అవుతుండగా అది జరిగింది!" అన్నాడతను.

"ఎదురుగా వచ్చి ఎవరైనా కొడితే, తెలుస్తుంది కదా!" అన్నాడు కిరీటి.

"అయితే ఆయనకు కాస్త చీకటి పడితే కళ్ళు కనబడవు. రెండు కళ్ళకు శుక్లాలు వచ్చాయి. ఆపరేషన్ చేయిద్దామనుకుండగానే ఇది జరిగింది!" అన్నాడు మహేష్.

"ఓహ్.." నిట్టూర్చాడు కిరీటి.

"ఎవరి మీదైనా అనుమానం ఉందా?" అడిగాడు.

"మా గెస్ట్‌హౌస్‌కు వచ్చే వార్తాపత్రికతో ఒక ఉత్తరం వచ్చింది. దాంట్లో ఇలా రాసుంది!" అన్నాడు మహేష్ ఆ కాగితం అతడికి ఇస్తూ.

"నీ దగ్గర ఆయుధం ఉందని విర్రవీగుతున్నావ్... దాన్ని నాశనం చేస్తాము"

ఆ వాక్యాలు చదివి "మైగాడ్... మీనాన్నగారి దగ్గర ఏదైనా ఆయుధం ఉందా?" అన్నాడు కిరీటి.



"ఉంది... ఒక ఆయుధం కాదు చాలా, రండి చూపిస్తాను. కానీ ఎవరికి చెప్పకండి!" అంటూ ఆ గదిలోంచి వేరే గదిలోకి నడిచి బీరువా తెరిచాడు.

రకరకాల కత్తులు, బళ్ళాలు వరుసగా పేర్చి ఉన్నాయి. పక్క సొరుగులో డబుల్ బేరల్ గన్. మూడు రివాల్వర్లు, ఒక రైఫిల్. ఇవి కాక పిట్టలు కాల్చే తుపాకీలు.

వెంటనే మహేష్ చెప్పాడు.

"ఇవన్నీ మా ప్రాణ రక్షణకోసం! అలాగే గతంలో మా నాన్న వేటాడేవారు. అప్పుడు వీటిని ఉపయోగించేవారు. వీటన్నిటికీ లైసెన్సు ఉంది!" అన్నాడు.

"సరే నేను ఇన్వెస్టిగేషన్ చేస్తాను. ఇంతకీ పోలీస్ కంప్లైంట్ ఇచ్చారా?" అన్నాడు.

"లేదు. అది మాకు ఇష్టం లేదు. మా నాన్నను ఎవరు కొట్టారో ఆ సమాచారం ఇవ్వండి. మీకు పాతిక వేలు ఇస్తాను!" అన్నాడతను.

"ఇంతకీ ఎక్కడ కొట్టారు?" అన్నాడు కిరీటి.

అతను క్షణం సేపు అలోచించి "కన్ను మీద కొట్టారు" అన్నాడు.

"అయ్యో.. నేను కేసు పరిశోధిస్తాను!" అంటూ కిరీటి సుబ్రహ్మణ్యంతో కలిసి అతని దగ్గర నుండి సెలవు తీసుకున్నాడు.

★★★

తర్వాత రోజు నగరంలో ప్రముఖ కంటి ఆసుపత్రి సంజీవి నేత్రాలయాకు వెళ్ళాడు కిరీటి. తన స్కూటర్ బైట పార్క్ చేస్తుంటే, ఒక ఆడి కారు వచ్చి ఆగింది. దాంట్లో నుండి దిగాడు నగర ప్రముఖ సర్జన్ డా. సీతాపతి. 'ఈయన వచ్చాడేంటి, ఈయన జనరల్ సర్జన్. కంటి ఆసుపత్రితో ఈయనకేం పని' అనుకుంటూ ఆయన్ని అనుసరించాడు. ఆయన ఆసుపత్రిలోని లగ్జరీ వార్డ్ వైపుగా కదిలాడు. ఆ వార్డ్ చివర వాష్ రూమ్ దగ్గర వున్న బాల్కనీ పక్కన వున్న వార్డ్ బాయ్ టిఫిన్ తింటూ కనిపించాడు.

"ఆ లగ్జరీ రూమ్‌లో వున్న సర్వేశ్వరరావు గారికి ఏమైంది?" అన్నాడు.

"మీరు ఎవరు? చెపితే నాకు ఏమిటి లాభం?" అన్నాడు ఆ వార్డ్‌బాయ్ వెటకారంగా నవ్వి.

జేబులోంచి ఐదు వందల రూపాయల నోటు తీసి.. "ఇప్పుడు చెప్పు!" అన్నాడు కిరీటి.

ఆ వ్యక్తి ఆ నోటు లాక్కుంటూ.. తాను తినడం ఆపుచేసి, కిరీటి చెవిలో మెల్లిగా చెప్పాడు.

"థాంక్ యు" అంటూ కిరీటి తాను విన్న విషయం గురించి ఆశ్చర్యపోతూ ఆసుపత్రి నుండి బయట పడ్డాడు.

★ ★ ★

ఆ తర్వాతి రోజు సాయంత్రమే తన వాహనంలో ఆ గ్రానైట్ ఫ్యాక్టరీకి చేరాడు కిరీటి. అక్కడ ఎదురుగా విశాలమైన స్థలం. సాయంత్రం ఆరు దాటింది. ఆ చుట్టుపక్కల ఏరియా పిల్లలంతా క్రికెట్ ఆడుతున్నారు. ఫ్యాక్టరీ పక్కన ఒక చిన్న కాలనీ. అక్కడి నేపాలీ వాళ్ళు ఉంటున్నారు చాలా సంవత్సరాలుగా. వాళ్ళలో కొంతమంది స్వెట్టర్లు అమ్ముతారు. కొంతమంది ఆ ఊళ్ళో రాత్రిళ్ళు గస్తీ తిరగడం, ఇంకా కొన్ని ఆఫీసుల్లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తారు.

ఆ సమయంలో ఆ నేపాలీలకు చెందిన పిల్లలు, చిన్న చెక్క బ్యాట్లతో క్రికెట్ ఆడడం గమనించాడు. ఒక గంటకు పైగా అక్కడే తిరిగాడు. కొంతమందితో భేటీ వేసాడు. ఆ తర్వాత ఆ గెస్ట్‌హౌస్ ఆవరణలోకి ప్రవేశించాడు. పెద్దాయన ఆసుపత్రిపాలు కావడంతో ఫ్యాక్టరీ మూసేసారు. ఆ గెస్ట్హౌస్లోను ఎవరూ లేరు. ఉండే సెక్యూరిటీ గార్డు కూడా టీ తాగడానికి బైటకు వెళ్ళాడు. లోపల ఆవరణ అంతా చీకటిగా ఉంది. అక్కడి లాన్లో ఒక కుర్చీ. బహుశా ఆ పెద్దాయన కుర్చునేది దానిమీదేమో అనుకున్నాడు. ఆ కుర్చీ క్రింద ఉన్నదాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. తన హేండ్‌కర్చీఫ్‌తో దాన్ని తీసి, తన సంచిలో వేసుకున్నాడు. అతనికి కొంచెం అర్థమైంది. తన పని అయిపోయిందనుకుని అక్కడినుంచి నిష్క్రమించాడు.

★ ★ ★

రెండు రోజుల తర్వాత కిరీటి, సుబ్రహ్మణ్యంతో కలిసి మహేష్ ఇంటికి వెళ్ళాడు.

"దొరికారా...!" అన్నాడు ఆతృతగా వారితో.

"దొరికింది... మీ నాన్నగారిని గాయపరిచిన ఆయుధం ఇదే!" అన్నాడు కిరీటి, తన సంచిలోని ఆ వస్తువు తీసి అతనికి ఇస్తూ...

"క్రికెట్ బాలా.." అన్నాడు అనుమానంగా దానివంక చూసిన మహేష్.

"ఔను ఇలాంటి క్రికెట్ బాల్ ప్రాణాలను తీయగలదు, తగలరాని చోటు తగిలితే..!"

"ఔను... ఇంతకీ ఎవరి పని ఇది?" అన్నాడు కోపంగా.

"ఇది ఎవరి పనీ కాదు. పిల్లలు క్రికెట్ ఆడుతూ పొరపాటున విసిరిన బాల్. గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకొంటున్న మీ నాన్నగారికి తగిలింది. ఆయన తనను ఎవరో కొట్టారనే భ్రమలో ఉండడంతో, మీకు అలా చెప్పారు. కావాలని ఎవరూ చేయలేదు. నేను ఎంక్వయిరీ చేసాను. పిల్లలు భయపడిపోయి తమ బాల్ కోసం కూడా మళ్ళీ మీ నాన్నగారి దగ్గరకు రాకుండా పారిపోయారు. ఇక మీకు వచ్చిన ఆకాశరామన్న ఉత్తరం మీ నాన్నగారి దగ్గరున్న ఆయుధం చూసి, ఎవరో చిలిపిగా రాసారు. ఆయన తన ఆయుధాల గురించి చాలామందికి చెప్పుకుంటారట కదా! అదీ విషయం!" అన్నాడు నవ్వేస్తూ.

"అమ్మయ్య... ఒక సమస్య తీరింది. మీకు థ్యాంక్స్!" అంటూ తన డ్రాయర్ సొరుగులోంచి డబ్బులు తీసి కిరీటికి అందించాడు.

కిరీటి రెండు చేతులు జోడించి సుబ్రహ్మణ్యంతో బైటకు వచ్చాడు. ఇద్దరూ తమ వాహనంలో కదిలి పావుగంట తర్వాత ఇంటికొచ్చారు. అంతవరకూ మౌనంగా ఉన్న సబ్రహ్మణ్యం వెంటనే అన్నాడు.

"ఏంటి సార్.. అసలు విషయం దాచిపెట్టి అబద్ధం చెప్పారు!" అన్నాడు.

"ఒక మంచి పనికోసం, అబద్ధం ఆడినా తప్పులేదు. వాస్తవానికి క్రికెట్ బాల్తో బలంగా కొట్టడం వలననే ఆయనకు గాయం అయి ఆస్పత్రిపాలయ్యాడు. అది తగలరాని చోట తగిలింది. ఆ విషయం ఆసుపత్రి వార్డ్‌బాయ్‌కి లంచం ఇచ్చి తెలుసుకున్నాను. ఆ విషయం ఎవరికి చెప్పుకోలేని సంగతి కనుక.. మహేష్ దాచిపెట్టి తన తండ్రికి, కళ్ళ మీద ఎవరో కొట్టారని అబద్ధం చెప్పాడు. ఆయన తాగివున్న విషయం కూడా మన దగ్గర దాచాడు. కేటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవటం కోసం ఆ నేత్రాలయాలో చేరి, తనకు తగలరాని చోట తగిలిన గాయానికి డాక్టర్ సీతాపతిగారి చేత వైద్యం చేయించుకున్నాడు. ఇక ఎవరో ఆకాశరామన్న ఉత్తరం రాయడం కరెక్ట్. ఏ ఆయుధం చూసుకొని అరవయ్యేళ్ళు దాటినా, ఇంకా కామంతో కళ్ళు కప్పి, అమాయక పేద ఆడవాళ్ళ మీద విరగబడే ఆ మహేష్ తండ్రి 'ఆయుధం' మీద గురిచూసి కొట్టారు!" అన్నాడు కిరీటి కసిగా.

"ఇంతకీ అతడి ఆయుధం మీద ఈ క్రికెట్ బాల్ అనే ఆయుధం ప్రయోగించిన వీరుడి వివరాలు నాకు చెప్పలేదు!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"వీరుడు కాదు, వీరనారి!" అన్నాడు కిరీటి.

"ఆడపిల్ల!" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఔను పన్నెండేళ్ళ పిల్ల. పేరు దుర్గ... ఆరోజు అక్టోబర్ పదిహేను, దసరా పర్వదినం. కాస్త కక్కా ముక్కా తిని, ఫుల్గా తాగి, మత్తుగా ఉన్న ఈ పెద్దమనిషికి ఆడమనిషి కావలసివచ్చింది. ఆ నేపాల్ కాలనీలో ఒక మహిళను గెస్ట్‌హౌస్‌లో పనుందని పిలిచాడు. పిలిచి అఘాయిత్యం చేయబోయాడు. ఆమె తప్పించుకుని పారిపోయింది. ఆ సాయంత్రం ఆమె కూతురు దుర్గ, అమ్మవారి అవతారం ఎత్తింది. తన తల్లిమీద దాడిచేసిన మానవమృగం అయిన వాడు, తాగేసి మత్తుగా పడుకున్న వేళ క్రికెట్ బాల్తో బలంగా కొట్టి పారిపోయింది. వీడు అంతకు ముందు చాలామంది నేపాలి ఆడవాళ్ళను నయానో, భయానో డబ్బు ఎరచూపి లోబరుచుకున్నాడు. అయితే ఈసారి చుక్కెదురయింది. ఆ చిన్నపిల్ల చుక్కలు చూపించింది. సాహసం చేసింది. తాను చుక్క వేసుకొని నిద్రిస్తున్న సమయంలో..!" అన్నాడు చిన్నగా నవ్వి

"ఇప్పుడు ఐదు చుక్కల ఆస్పత్రిలో పడుకొని కనబడని చుక్కల్ని లెక్కిస్తున్నాడు ముసలాడు!" అన్నాడు సుబ్రహ్మణ్యం తాను నవ్వి.

"ఔను.. వాడి కొడుకు ఇంకా దుర్మార్గుడు. ఆ నేపాలీల వలన తన తండ్రికి గాయం అయిందని తెలిస్తే, వారి మీద కక్ష కడతాడు. అందుకే అబద్ధం చెప్పాను!" అన్నాడు.

"మీరు సూపర్.." అంటూ గురువుగారిని హత్తుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"ఐతే ఇక్కడ మనం కీర్తించవలసింది ఆ దుర్గమ్మ సాహసం.. ఆమె ఆయుధానికి ఇవ్వవలసిన బహుమతి మన దగ్గరే ఉండిపోయింది" అన్నాడు కిరీటి.

"ఆయుధం ఏమిటి? బహుమతి ఏమిటి?" అన్నాడు సుబ్రమణ్యం ప్రశ్నార్థకంగా చూస్తూ.

"ఆ ఆయుధం దుర్గ చూపిన ధైర్యం.. అందుకు ఈ బహుమతి పాతిక వేలు ఆమెకే!" నవ్వుతూ చెప్పాడు కిరీటి.

# ఇట్లు! మీ...

**బాడిశ హనుమంతరావు**

**కథారవళి – శ్రీ దండెంరాజు ఫౌండేషన్ వారు నిర్వహించిన 2022 మెరుపు కథల పోటీ తృతీయ బహుమతి పొందిన కథ.**

*ఉపాహార పథకం మొదలయ్యింది. చూస్తుండగానే మరో ఏడాదిన్నర గడిచిపోయింది. తెలియని అయోమయంలో అందరూ ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. నిజమే కదా! పని చేస్తేనే కడుపు నిండటం కష్టం. అలాంటిది పని మానేస్తే ??*

రాజ్యంలో పరిపాలన సాగుతోంది. ఒకే రాజుగారిని చూసి చూసి, ఒకే విధమైన పాలన రుచి చూసి చూసి, ప్రజలకు విసుగు పుట్టసాగింది. ఏమి చేయాలా.. అని అందరూ తలకాయలు పట్టుకున్న సమయంలో, జనాల్లో నుండి ఒకతను ముందుకు అడుగేశాడు.

“ఒకే రాజుని ఎంత కాలం చూడాలి? ఈ విసుగు తగ్గాలంటే రాజుని మార్చడం తప్ప వేరే మార్గం లేదు. మనకు మార్పు కావాలి. ఇప్పుడు రెండో... మూడో పూటలు తింటున్న పచ్చడి మెతుకులు మనకొద్దు. మనకు మూడు పూటలా విందు భోజనం కావాలి!” గొంతెత్తి అరిచాడు.

అరుపులో నుండి ఉద్యమం పుట్టింది. ఉద్యమం పుణ్యమాని ప్రజలకు విసుగు దూరమైంది. వారానికో కార్యక్రమం చేపట్టడంతో ఎప్పటికప్పుడు కొత్తదనం రుచి చూశారు. ఇలా సాగి, సాగి అరిచిన వ్యక్తి రాజయ్యాడు.

ఎవరికి వారే తామే స్వయంగా కొత్తరాజుని ఎన్నుకున్నామన్న తృప్తిలాంటి మత్తుతో ఉండగానే, సంవత్సరం గడిచిపోయింది. అదే పచ్చడి మెతుకులు తింటున్నారు. జనాల్లో కొంతమందికి మూడు పూటలా విందు భోజనం పథకం గుర్తుకు వచ్చింది. ఈ గుర్తుకు వచ్చిన విషయం కొత్తరాజుకీ గుర్తొచ్చింది. ఒక రోజు పొద్దున్నే అందరు పత్రికల వాళ్లని పిలిచాడు.

“అయ్యో... ఇంకా పచ్చడి మెతుకులే తింటున్నారని నాకు తెలుసు. అందుకే నేనూ అది మరిచిపోకుండా పచ్చడి మెతుకులే తింటున్నాను. తింటూ మీ గురించే ఆలోచిస్తున్నాను. ఒక మార్పు రావాలంటే అంత సులభంగా అవుతుందా! ఎంత కట్టుదిట్టంగా చేయాల్సి ఉంటది.. ఇంకా కొద్ది రోజుల్లో అంతా అయిపోద్ది. అసలు నేను కాదు... రాజు... మీరే!!” అంటుండగానే రాజుకి త్రేన్పు వచ్చింది. ఆ వచ్చిన గాలిలో బిర్యానీ వాసన అలా అలా తేలి తేలి గుర్తించలేనంత పలచబడిపోయింది.

జనాల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అందరూ కలసి కొత్తరాజు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అది కొత్తరాజుకి భలే నచ్చింది. ప్రోటోకాల్ లో చేరిపోయింది.

ఇలా మరో ఏడాదిన్నర గడిచింది. మరో ఉదయం పత్రికలవాళ్లని పిలిచి, ‘ఉదయం ఉపాహార పథకం’ మొదలుపెడుతున్నట్లు చెప్పాడు. ‘అందుకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వానిదే’ నొక్కి వక్కాణించాడు.

అంతే! మళ్ళీ ఒక లీటరు పాలు, నాలుగు లీటర్ల నీళ్లు కలిపి పాలాభిషేకాలు జరిగాయి. కాకపోతే ‘పథకం అమలులోకి రావడానికి కాస్త సమయం తీసుకుంటుంది. మీ ఇళ్లల్లో పెళ్లిళ్లు చేయాలనుకున్నప్పుడు, దానికి తగిన కార్యాచరణకు కాస్త కాలం పట్టదా?’ దీనంగా ముఖం పెట్టి అడిగాడు.

“అయ్యో దానికేం భాగ్యం... అలాగే తీసుకోండి.” భరోసా ఇచ్చారు జనం.

'ఉపాహార పథకం' మొదలయ్యింది. చూస్తుండగానే మరో ఏడాదిన్నర గడిచిపోయింది. తెలియని అయోమయంలో అందరూ ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. నిజమే కదా! పని చేస్తేనే కడుపు నిండటం కష్టం. అలాంటిది పని మానేస్తే ??

కానీ కొందరుంటారు. ఎలా నడుస్తుందో కాలం వాళ్ళకి! భలే నడిచిపోతుంది. సాధారణంగా వీరు కొందరు నాయకుల అనుచరులయ్యుంటారు. అది ప్రతిపక్షమో, ప్రభుత్వ పక్షమో....



అలాంటి కొంతమంది పనీపాటా లేని వాళ్లకి విందు భోజన పథకం గుర్తొచ్చింది. జనం ఆలోచిస్తున్నారు. ఇలా ఆలోచిస్తున్న విషయం వేగులద్వారా కొత్తరాజుకి తెలిసింది. ఉదయాన్నే పత్రికల వాళ్లని పిలిచి, రెండు పూటలా విందు భోజన పథకం గురించి ప్రకటన చేశాడు. మళ్ళీ పాలాభిషేకాలు మొదలయ్యాయి. కాస్త సమయం కావాలని షరా మామూలు మాటలు నడిచాయి. విందు భోజనం పథకం మొదలయ్యింది. కొద్ది రోజులు ఫోటోలు, మీటింగులూ జరిగాయి. చూస్తుండగానే పథకం అమలుకాసాగింది. అంత నాణ్యంగా లేకున్నా 'బాలారిష్టాలు ఉంటాయి కదా' అని రాజు బదులు జనమే అనుకున్నారు.

జనం గమనించనిదేమిటంటే... ఉపాహార పథకం అనధికారికంగా ఆగిపోయింది. పాత రాజు ఎంత మొత్తుకున్నా.. ఎవరికీ ఆ విషయం తట్టలేదు. ఇంకా విచిత్రం ఏమిటంటే అది కాగితాలపై నడుస్తూనే ఉంది. అయిదేళ్లు కావస్తున్నది. జనం అయిదేళ్ల కిందటి స్థితికి జారిపోయారు. చడీ చప్పుడు లేకుండా పగటి విందు భోజన పథకం ఆగిపోయింది. ఈ విషయం గుర్తించిన వారికి మాత్రం ఆ పథకాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే ఎక్కడా ఎవ్వరూ మాట్లాడట్లేదు. అయిదేళ్లపాలనపై రిఫరెండం దగ్గరికి వచ్చింది. ఉన్నట్లుండి మరో ఉదయం నాడు పత్రికలవాళ్లని పిలిచాడు కొత్తరాజు.

తీరా చూస్తే ఆ రాజు అప్పటి రాజు కాదు. జనం అంతా ఆసక్తిగా చూస్తున్నారు. ఎవరనే? చర్చలు మొదలు. ఆ ముక్కు, బుగ్గలు, కనుబొమలు.... అన్నీ ఎప్పుడూ చూసిన వాడిలా లేవు. కానీ ఎక్కడో మొఖం కింద అంత సులభంగా మార్చలేని శరీరం అతనెవరో పట్టించింది. అప్పటి కొత్త రాజే! కానీ మరో కొత్తరాజు!!

మొఖం మారిపోయింది. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాట్ట.

"నేనే... గుర్తు పట్టారా? కొత్తరాజుని. మీకు అస్సలు విసుగు కలగనివ్వను. అందుకు అవకాశమే ఇవ్వను. ఇస్తే నా చెప్పుతో నా రెండు చెంపలు కొట్టుకునైనా, మీకు వినోదాన్నిచ్చే రూపం తెచ్చుకుంటా! నేను నా కోసం..." చప్పున నాలుక కరచుకొని "మీ కోసం ఏదైనా చేస్తా! మీ జీవితాల్లో మార్పు తేవడం కోసం నా ప్రాణాలైనా అర్పిస్తా! త్వరలో మూడు పూటలా విందు భోజన పథకం అమలుపై సమగ్ర విశ్లేషణ చేస్తున్నాం. దానికి సంబంధించిన విధి విధానాలు సరళీకరించి అమలు చేసి చూపిస్తాం. అందుకు నేనే హామీ!!"

రిఫరెండం పూర్తయింది. కొత్తరాజు వైపే ప్రజలు మొగ్గు చూపారు. కొత్తరాజుని కళ్లారా చూసుకున్నారు. రాజ్య ప్రజల కళ్ల ముందు వెలుగులు మెరిశాయి. విందు భోజన పథకం మాట వినగానే అందరి నోరు ఊరుతోంది. పాలాభిషేకాలు మొదలయ్యాయి. సజలనయనాలతో పచ్చడిమెతుకులతో భోజనం చేస్తూ... అప్పుడెప్పుడో జంధ్యాలగారు సూచించిన పద్ధతిలో విందు భోజనాన్ని అస్వాదిస్తున్నారు.

# ఆత్మబంధువు

గొర్తి వాణిశ్రీనివాస్



✆ 9441345651

***రైతన్నవాడు ఉన్నవాడో లేనివాడో చెప్పటం కష్టం. అంతా కళ్ళముందే ఉన్నట్టుంటుంది.. అంతలోనే కట్టుబట్టలతో నిలబెడుతుంది. ఓటమి గెలుపుకూ మధ్య ఒక్క అడుగు దూరంలో రైతు జీవిత సర్వస్వం త్రాసుమాదిరి ఊగుతుంటుంది.***

"కురుస్తుందంటావా?" అన్నాడు ముత్తయ్య పైకి చూస్తూ.

"మనకంత భాగ్యం కూడానా?" అంది నర్సమ్మ.

"వానచుక్క చూసి ఎన్నాళ్ళైందో!" అన్నాడు ముత్తయ్య ఆకాశంవైపు ఆశగా చూస్తూ.

"చుప్పనాతి వాన కురిసేది కాదులే!" గుడిసె బయటకొచ్చి నిలబడింది నర్సమ్మ.

సుడిగాలి.. చిత్తుకాగితాలతో బాటు గుడిసెలమీదున్న రెల్లుగడ్డిని కూడా లాక్కుపోతోంది. ఆకాశంలో చిన్న చినుకైతే రాలుతోంది గానీ నేలమీద పడగానే ఆనవాలు లేకుండా ఆవిరైపోతోంది.

"ఈ□మహమ్మారి మావిడికాయల్ని బతకనీదు. పిందెల్నికూడా దులిపేసి, మన కళ్ళల్లోనూ నోట్లోనూ ఇంత దుమ్ము కొట్టిపోడానికి కాకపోతే, వాన కొట్టి మనల్ని ఉద్ధరిద్దామనా ఏందీ!" అన్నాడు ముత్తయ్య.

"నిజవే.. ఇలాంటివి ఎన్నిచూళ్ళేదూ" అంటూ రేగిపోయిన జుట్టుని ముడి పెట్టుకుని, దండానికి చుట్టుకుపోయిన చీరల్ని అతికష్టం మీద మెలికలు తీసి లాక్కొచ్చింది నర్సమ్మ.

చూర్లో పెట్టిన తాటాకు గొడుగు తీసాడు ముత్తయ్య.

"ఓయబ్బో! ఈ పొద్దు వాన కొట్టికురిస్తుందనే? గాలెత్తుకు పోగలదు జాగ్రత్త" అంది కళ్ళకి చెయ్యడ్డం పెట్టికుని. "నన్నా.. గొడుగునా?"

"జాణవే! నీతి నియమాలున్నోడివి, కాలం కష్టం కూడా నిన్నేమీ జెయ్యలేవులే మగడా. గొడుగే మెలి తిరిగి పోద్దేమో సూస్కో!"

భార్య మాటలకు నవ్వుతూ తాటాకు గొడుగుని తిరిగి చూర్లో దోపేసి, తుండుగుడ్డ తలమీద వేసుకుని వీధిలో కొచ్చాడు ముత్తయ్య. చినుకు లావెక్కింది. నేల గుక్కెసి కక్కేంత వాన పడితే బాగుండు అని గొణుగుతూ కళ్ళు చిట్లించి పైకి చూశాడు. మేఘాలు విన్నట్టుగా ఫెటేల్ మని ఆకాశం ఉరిమింది, చినుకు జోరు పెరిగింది. "ముత్తయ్యా! ఈ గాలి దుమారంలో యాడకెలతన్నావ్?" హనుమంతు పిలుపికి ఆగి చూశాడు.

"చేను దాకా పోయొద్దామని. పైరుని ఓపాలి చూడాలనిపించీ. నువ్వాడికి బోతున్నావ్?"

"పైరేటైపోద్ది? గాలెత్తుకుపోద్దా? నాలుగు సుక్కలు రాల్సి మన ఆశల్లా ఆవిరైపోడమేగా. మనూరిని వానదేవుడు కరుణిస్తే ఎట్టా?

మన కష్టాలు తీరితే ఎట్టా? అన్నిటికీ మనవంటే పగే, పతీకారవే!” అన్నాడు హనుమంతు బొంగురుగొంతుతో. నుదుటిపై పడ్డ వానచుక్కని చేత్తో తీసి, ఒక అద్భుతాన్ని చూసినట్టు చూస్తూ.



“ఇంతకీ నువ్వేళ్ళేది ఏడకో సెప్పలా!” అన్నాడు ముత్తయ్య.

“నీ చెవ్విటు పడై” అని ఒంగి ముత్తయ్య చెవిలో గొణిగాడు హనుమంతు.

“అదెట్టా... ఇలాంటి పనులు గూడా సేస్తున్నావేంటి?”

“చేతులు ముడుచుకు కూర్చుంటే ఎట్టా? డబ్బొచ్చే ఉపాయం చూడాల. నీ కూతురు పురిటి ఖర్చైనా సంపాదిద్దువు.. నువ్వా నాతోరా, లావుగా ముట్టుద్దిలే” అన్నాడు హనుమంతు.

కూతురు పేరెత్తగానే ముత్తయ్య మనసు మూలిగింది. ఐదేళ్లక్రితం కొద్దిగా పొలాలు పండుతున్న రోజులవి. పంట చేతికి రాగానే పిల్ల పెళ్లి చేయాలని పట్టుబట్టింది నర్సమ్మ.

“మనమ్మాయి చక్కని చుక్కయ్యా! కాస్త పెద్దింట్లో ఇస్తే సుఖపడుద్ది. పక్కూరులో వుండే పంచాయితీ ప్రెసిడెంట్ కొడుకుతో సంబంధం కుదుర్చుకు రావయ్యా!” అంటూ పోరుపెట్టింది.

ఆడపిల్లని కాస్త ఉన్నింట్లో పడేస్తే తిరిగి చూసుకునే పనుండదని ముత్తయ్య కూడా అనుకున్నాడు. ఊరి పెద్దమనుషుల్ని తీసుకుని వెళ్లి సంబంధం ఖాయం చేసుకొచ్చాడు. రెండెకరాల పొలం, లాంఛనాలూ, పెట్టుబడులు, అమాంబాపతు లక్షరూపాయలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. కుప్ప నూరిస్తే పంట చేతికొస్తుందనే భరోసాతో పెళ్లి ముహూర్తం పెట్టించాడు. పెళ్లి రెండ్రోజులు వుందనగా ఘోరం జరిగిపోయింది. కుప్పకి నిప్పంటుకుంది. గింజ వడ్లు మిగలకుండా కాలి బూడిదయ్యాయి. అలా జరగడం అశుభంగా భావించి, పెళ్లాపేశాడు ప్రెసిడెంటు. వచ్చే పంటకి అడిగిందల్లా ఇచ్చుకుంటానని ముత్తయ్య ఎంత బతిమాలినా ప్రెసిడెంట్ వినలేదు. ‘నువ్వు ఇచ్చేదీ లేదు నేను చచ్చేదీ లేదు.. ఈ పెళ్లి జరగదని’ తెగేసి చెప్పాడు. సహకరించని ప్రకృతిని నిందించాలో, నిర్దయగా మారిన మనిషితనాన్ని దూషించాలో అర్థంకాక ఇంటిల్లిపాదీ బావురుమన్నారు. రైతన్నవాడు ఉన్నవాడో, లేనివాడో చెప్పటం కష్టం. అంతా కళ్ళముందే ఉన్నట్టుంటుంది.. అంతలోనే కట్టుబట్టలతో నిలబెడుతుంది. ఓటమికీ గెలుపుకీ మధ్య ఒక్క అడుగు దూరంలో రైతు జీవిత సర్వస్వం త్రాసుమాదిరి ఊగుతుంటుంది. ఆ పంటకి మంట అంటుకోకుండా ఉన్నట్లయితే గెలుపు తనదయ్యేది అనుకుని ఎంతో బాధపడ్డాడు ముత్తయ్య.

‘ఏడుస్తూ కూకుంటే ఏటొస్తాది. పిల్ల పెళ్లయ్యే మార్గం చూడాలి’ అని హితవు పలికారు గ్రామస్తులు.

"పీటల మీద పెళ్ళాగిపోవడం అంత మంచిది కాదు ముత్తయ్యా. మీ దూరపు బంధువు మోహన్ ఉన్నాడుగా అతన్ని అడిగిచూడు." అన్నారు సన్నిహితులు.

మోహన్ ఆ పెళ్లికి ఒప్పుకున్నాడు. అనుకున్న ముహూర్తానికే కూతురి మెడలో తాళి కట్టించాడు ముత్తయ్య. అల్లుడు డబ్బుకు పేదయినా, ప్రెసిడెంట్‌లా కఠినాత్ముడు మాత్రం కాదని సంతోషంగా కూతుర్ని అత్తవారింటికి సాగనంపాడు. ఆయేడు మొదలు నాట్లు వేసుకుని ఎంత ఎదురుచూసినా వానచుక్క రాలలేదు. మోటారుతో సేద్యం చేయజూసినా కరెంటు కోతలవల్ల పంట తడవక ఎండిపోవవడం జరిగేది. పెట్టుబడి తిరిగిరాక అప్పుల్లో కూరుకుపోయాడు ముత్తయ్య. ఇప్పుడేమో కూతురు పురిటికి వచ్చింది. సరైన ఆహారం, మందులకూ, డాక్టర్ ఖర్చులకీ డబ్బు కావాలి. పిల్ల బలహీనంగా ఉంది. పోషకాహారం ఇవ్వాలని చెప్పాడు డాక్టర్. ఉన్న ముగ్గురికీ మూడు పూటలా తిండికే కటాకటిగా ఉంటే, పోషకాహారం ఎక్కడినుంచి తెచ్చేదని ఆలోచనలో మునిగిపోయాడు.

వాన ఇంకాస్త పెద్దదయ్యింది "ఏం ముత్తయ్యా! రా పోదాం రాత్రికల్లా తిరిగొచ్చేద్దాం. ఎక్కువగా ఆలోచించమాక!" అన్నాడు హనుమంతు.

"ఇప్పుడు నాకు డబ్బవసరం చాలా ఉంది." ఆలోచనల్లోంచి బయటపడుతూ అన్నాడు ముత్తయ్య.

"మరైతే రా ఎల్దాం" అన్నాడు హనుమంతు.

అప్పిచ్చిన నాంచారయ్య అటుగా వస్తున్నాడు. ఎటూ తప్పుకోలేని పరిస్థితి.. ముఖం చాటెయ్యటం ఇష్టంలేక చూస్తూ నిలబడ్డాడు.

"అసలు సంగతెలావున్నా వడ్డీ పెరిగిపోతోంది. ఏదోమార్గం చూసి ఈ నెలన్నా వడ్డీ జమెయ్యి" అంటూ ముత్తయ్యని దాటి వెళ్లిపోయాడు నాంచారయ్య.

ఇక ఏమీ ఆలోచించకుండా హనుమంతుతో కలిసి నాలుగడుగులు ముందుకు వేసాడు. ఎక్కడో పిడుగు పడ్డ శబ్దం. 'అయ్యా' అని వెనకనించి ఎవరిదో పిలుపు. ముత్తయ్య కాలు ముందుకు పడలేదు. గిరుక్కున వెనుతిరిగి ఇంటికి పరిగెత్తాడు.

"ఏమ్మా.. అట్టా అరిచావేందమ్మా? బయపడ్డావా?" అన్నాడు కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ.

"లే నాయనా.. నేనరవలే. పక్కింటోళ్లేమో.." అంది.

కూతుర్ని చూసుకున్నాక కాస్త నెమ్మదించింది ముత్తయ్య మనసు. వాన చుక్కా చుక్కా చిక్కబడి జోరు పెరుగుతోంది.

"ఇన్నాళ్లకు వర్షం కళ్ళ చూసాం. మాతో పాటు ఇంట్లో వుండయ్యా సరదాగా వర్షాన్ని చూస్తూ కూర్చుందాం. ఏరిసెనక్కాయలు ఏగిస్తా. ఎచ్చెచ్చగా తిందాం!" అంది నర్సమ్మ.

"ఆగు హనుమంతుని ఈదిలో నిలబెట్టొచ్చా.. చెప్పేసొస్తా!" అని మళ్ళీ బయటకు నడిచాడు ముత్తయ్య. హనుమంతుతో వెళ్లటమా, రానని చెప్పటమా? తెంపులేని ఆలోచనలు ముళ్ళకంపల్లా చుట్టుముట్టాయి. నాలుగు దినాల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

"నెలతప్పిన పిల్లకి చిన్న సలివిడి ముద్ద, చీరా, గాజులు, పట్టెడు పూలు, పసుపుకుంకాలు ఒళ్ళో పెట్టి పేరంటం చెయ్యకపోతే క్షేమం కాదని పంతులయ్య జెప్పాడు. సాలి సాంబయ్య మగ్గం కాడికెల్లి పిల్లకో చీర పట్రాయ్యా . దాని అచ్చటా ముచ్చటా మనకున్నంతలోనే జరిపిద్దాం!" అంది నర్సమ్మ కూతురివంక ముచ్చటగా చూస్తూ.

నాలుగు బార్ల అవతల సాంబయ్య ఇల్లు. ముత్తయ్య వెళ్లేసరికి అతను ఇంట్లో లేడు.

"సెల్లెమ్మా ఎట్టున్నావమ్మా! నాకూతురు కంటానికొచ్చింది.. సాంబయ్య ఓ చీర నేసిస్తాడేమో అని ఇటొచ్చా" అన్నాడు. "నేతపని మానేసాం అన్నా! ఏవెట్టి నేస్తాం. మా పేగులెట్టి నెయ్యాల. నీకూ తెల్సుగా పత్తికి గిట్టుబాటు ధర రాలేదని మనోళ్లు కొందరు పురుగుమందు తాగిపోలా! కొందరైతే చేలు బీళ్లు పెట్టి పట్నంలో పనులకెళ్లిపోయారు. అన్నిటి ధరలూ పెరిగిపోయాయి. మా పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉంది. దారం బేళ్లు, రంగుల ఖర్చు, పనోళ్ళ కూలీ మొత్తానికే భారం పెరిగిపోయింది. చెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. పెట్టుబడి పెట్టేందుకు కూడా నల్లపూస తప్ప మాకాడ ఏంలేదు. చీరలు కొనుక్కెళ్లే మస్తానయ్య సరైన రేటు కట్టకుండా తూకంతో తూచుకుపోయి, ఇంతో అంతో చేతులో పెడితే ఏ మూలకన్నా! మనం ఊరుకున్నా, కాలే కడుపులు ఊరుకోవుగా. ఇంట్లో సామాను ఒక్కొక్కటే అమ్ముకు తిన్నాం. మిగిలింది మూలబడ్డ మగ్గమే. దాన్నెవరూ కొనేటోళ్ళు లేక అట్టా పడుంది. మేం కూడా సిటీ కెళ్లిపోదాం అనుకుంటున్నాం. మా బాబాయ్ అక్కడికొస్తే అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పని ఇప్పిస్తానన్నాడు. ఎప్పుడో నేసిన చీరొకటుంది పట్టికెళ్లన్నా. ఆయనొస్తే చెబుతాలే!" అంటూ గూట్లో పెట్టిన చీర తీసి చూపించింది.

మావిచిగురు రంగుకు పచ్చంచు నేతచీర.

"నేసి సానాకాలమైంది కాస్త పాతగా వుందన్నా ఫర్వాలేదా?" అంది ఇవ్వటానికి తటపటాయిస్తూ.

"ఫర్లేదులేమ్మా యిందా ఈ వందా తీసుకో!"

"చీర డెబ్బయ్యే అన్నా!"

"ఫర్లేదులేమ్మా వుంచు. అందరం బతికి చెడ్డోళ్లమే. మనందరి కష్టం కడుపుకేగా. సాంబయ్య వస్తే నేనొచ్చి వెళ్లానని చెప్పమ్మా!" అని చీర తీసుకుని ఇంటికెళ్లాడు.

నర్సమ్మ చేతిలో చీరపెట్టి "ముతకచీరని అల్లుడయ్యకు సెప్పకు" చీర మడతల్ని సర్దుతూ అన్నాడు.

"పట్టుసీరని చెబుతాలే" అని నవ్వింది నర్సమ్మ.

"పిల్ల కనేతలికి పంట చేతికొస్తే, ఈ సంతోషం రెండింతలవుద్ది " అన్నాడు చీర కొన్నానన్న సంబరంతో.

మిగిలినవి కొనడానికి చేతిలో డబ్బుల్లేవు. ఇంకేం ఆలోచించకుండా హనుమంతుతో వెళ్ళటానికి సిద్ధపడ్డాడు ముత్తయ్య. చినుకు చినుకు సందు చేసుకుంటూ ఇద్దరూ తూర్పుకొండవైపుకు వడివడిగా నడుస్తున్నారు. వానజల్లు ఏటవాలుగా పడుతోంది. తడుస్తూ వానకి ఎదురు నడుస్తున్న ముత్తయ్య గుండెల్లో తాటాకుల మంట పెట్టినట్టుంది. ఏదో తెలియని బాధ. కళ్ళు బైర్లు కమ్మేలా ఆకాశంలో మెరుపు జిగేలంది. ఆ వెనకే పెద్ద పిడుగు పడింది.

“అయ్యా ..” అంటూ పెద్ద కేక వినబడినట్టు ఉలిక్కిపడ్డాడు ముత్తయ్య. ఈపాలి నిజంగా అరిసింది నా బిడ్డే. ‘ఆగు మళ్ళొస్తా’ అంటూ వెనక్కి పరిగెట్టాడు.

“ఇప్పటికే బాగా ఆలస్యమైపోయింది, ఆగు ముత్తయ్యా. ఎనక్కెళ్లావంటే ముందుకు రాలేవు. ఆగు.” హనుమంతు పిలుస్తున్నా వినిపించుకోకుండా పరుగులాంటి నడకతో ఇంటికెళ్లాడు.

“ఏమ్మా! పిలిశావ్ బయమేసిందా తల్లీ” అన్నాడు కూతురి తలపై చెయ్యివేసి.

“లేదు నాన్నా! నే పిలవలేదు” అంది.

“నూకాదా తల్లీ! నా గుండె మెలి పెట్టినట్టుందమ్మా ఆ పిలుపు. అంతా అయోమయంగా ఉంది నాకు!” అని కంగారుగా బయటకు చూసాడు. వాన జోరు పెరిగింది. ఊరి జనం సగంమంది వానలో తడుస్తూ, ఇంటి బయటే సంబరంగా తిరుగుతున్నారు. చాన్నాళ్ళకి కరుణించిన వానదేవుడికి మొక్కుతున్నారు

“యేడి టీనీళ్లు ఇందా తీసుకో” అంటూ నర్సమ్మ గ్లాసందించబోయింది. ఏదో ఆలోచనలో ఉన్నవాడల్లా గిరుక్కుని తిరిగి బయటకు పరిగెత్తాడు. హనుమంతు బయటే కాచుకున్నాడు ‘ఎల్దామా’ అన్నాడు.

“ఆగు! ఓపాలి చేనుకాడికి ఎళ్లొస్తా!” అని సమాధానం కోసం చూడకుండా పొలం వైపు వడిగా నడిచాడు.

చెరువులు దొరువులు నిండేలా పుష్కలంగా కురిసింది వాన. ఈయేడు పంట బాగా పండి చేతికొస్తే బాగుండు. అప్పులన్నీ wతీర్చేయొచ్చు అనుకుంటూ చేను దగ్గర కొచ్చిచూసేసరికి ముత్తయ్య గుండె గుభేలంది. పైరు తలలు మునిగిపోయి చేనంతా పూటుగా వాననీళ్లు.

‘ఏం ఘోష కొట్టిందిరా దేవుడోయ్’ అని బిగ్గరగా కేకపెట్టాడు. చుట్టుపక్కల ఎవరూ లేరు. ముత్తయ్య చేనుకి అటూ ఇటూ ఉన్న పొలాలు బీళ్లు పెట్టి ఉన్నాయి. పంటలు పండక, అప్పులు తీరక ఇద్దరు రైతులూ పొలంలోనే పురుగుమందు తాగి చనిపోయారు.

ఆయేడు ముత్తయ్యది కూడా అదే పరిస్థితి. ఆనాడు కళ్ళనిండా నీళ్లతో చూస్తున్న ముత్తయ్యని కొన్ని పచ్చి పరకలు తలలూపుతూ ఓదార్చాయి. ‘నువ్వు పోయి నేనుండి నన్నునాధని చేస్తావా’ అని పొలం మొరపెట్టుకుంటున్నట్టుగా అనిపించి, మళ్లీ ధైర్యం తెచ్చుకున్నాడు. ప్రతిఏడూ తెగించి నారు చల్లుకోవడం వానలు లేక అవి ఒత్తిగిలిపోవడం మామూలయ్యింది. కానీ ముత్తయ్య ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. పొలమంటే ఇంత మన్ను, ఇన్ని మొక్కలు కావు. తన జీవితం, తన ప్రాణం. ఈ ఏడుకూడా నమ్మకంగా నాట్లేశాడు. నీళ్లలో మునిగిపోయిన పైరువంక కన్నీళ్లతో చూస్తూ తండ్రిలా తల్లడిల్లాడు. పారా పలుగూ లేకుండా పారొచ్చాను! ఇప్పుడేంచెయ్యడం అని అటూ ఇటూ చూసి, అక్కడున్న తాటి మట్టతో గట్టు తెగ్గొట్టాడు. కాళ్లతో చేతుల్తో మట్టిని పక్కకు నెట్టాడు. మోకాళ్ళలోతు నీళ్లలో పరిగెడుతూ రెండు మూడు చోట్ల గట్టు విరగ్గొట్టి మట్టి గడ్డలు పక్కకి తప్పించాడు. చేనుగట్టు నాలుగువైపులా పరిగెట్టి, నీళ్లను కాళ్లతో బయటకు నెట్టాడు. కాసేపటికి నీళ్లన్నీ బోదిలోకి జారుకున్నాయి. పైరు తలలు పచ్చగా దర్శనమిచ్చాయి. ముత్తయ్య కళ్ళు సంతోషంతో మెరిసాయి. నేను రాకపోయుంటే చేను ముక్కు మునగా నీళ్లలో నాని కుళ్ళిపోయుండేది. ‘అయ్యా... అని మెలిపెట్టే పిలుపు నీదామ్మా!’ అనుకుంటూ, కాసేపు కళ్లారా చూసుకుని వెనుతిరిగాడు.

రోడ్డు పక్క జనాలు పరిగెడుతూ కనిపించారు. వాళ్లలో హనుమంతు కొడుకు కూడా వున్నాడు. అతన్ని ఆపి ఏవయ్యిందని అడిగాడు.

“మనూరుకి చెడుకాలం దాపురించింది బాబాయ్. తూర్పుకొండ కింద సొరంగంలో ఎక్కడోల్లో వచ్చి దొంగసారకాస్తున్నారంట. మనూరోళ్ళు కొందరు డబ్బుకోసం ఆశపడి వాళ్ళకి సాయం చేస్తున్నారంట. ఇయాల వాళ్ళ బండారం మొత్తం బయటపడింది. పోలీసులొచ్చి ఆళ్ల మక్కెలిరగదన్ని జీపులో తీసుకుపోతున్నారు. ఏ పాపం తెలీని మా నాన్నని కూడా తీసుకెళ్తాన్నారు. నేనెల్లి ఇడిపించుకురావాల!” నీతివంతుడు తప్పు చేయాలనుకున్నా ప్రకృతి సహకరించదేమో! కాలం కలిసిరాక, నష్టపోయినా నమ్మిన సిద్ధాంతాన్ని ఒదులుకోవద్దని చెబుతున్నట్టుగా తలూపాయి పంట పరకలు!

# అప్ప


ఎన్. డి. ఎస్. వి. నాగేశ్వరరావు



✆ 9987542133


***ఇంతకీ కనీసం పది వేలు సర్దుబాటు కాకుంటే బయలుదేరలేను. మార్చి నెల వచ్చేసింది. జీతంలో ఆదాయపు పన్ను కోత బాగానే పడింది. చేతికి జీతం వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఏం చేయాలి? అమ్మను మాత్రం చూడాలి.***

ఈసారి ఎలాగైనా అమ్మని చూసి రావాలి. ఈ మాట ఈవారంలో కనీసం వందసార్లు అనుకొని ఉంటాను. నిజమే..... అమ్మని చూసి చాలా కాలం అయ్యింది.

అప్పటికీ మా మామయ్య అనేసాడు, 'ఒరేయ్ మేనల్లుడా! నువ్వు మీ అమ్మని మర్చిపోయావు రా!' అని.

నా ఇబ్బందులు ఏమిటో, అమ్మ దగ్గరికి ఎందుకు రాలేకపోతున్నానో.. మామయ్యకి ఎలా చెప్పాలి। . అందరిలాగే అమ్మంటే నాకు ప్రేమే, అభిమానమే. కానీ, నా పరిస్థితులు అమ్మని కలిసేందుకు నాకు సహకరించడం లేదు. ఇన్నాళ్లూ, కనీసం నాలుగు నెలలకు ఒకసారైనా, అమ్మ దగ్గరికి వెళ్ళేవాడిని! కానీ, ఈ కరోనా పుణ్యమా అని, ఉద్యోగంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. ఇంటి నుంచి పని చేయడం, నెలలో కొన్ని రోజుల జీతమే అందడం, స్కూలు సరిగ్గా నడవక పోయినా ఫీజులు కట్టవలసి రావడం, పిల్లల ఆన్లైన్ చదువుల కోసం స్మార్ట్ ఫోన్లు కొనాల్సిరావడం, ఇలాంటి వాటితో జేబులు బాగా ఖాళీ అయ్యాయి. అలాగని నేను ఏవో కష్టాల్లో ఉన్నాను అని చెప్పలేను. ఎందుకంటే, ఇంతకుముందు సంపాదన జాగ్రత్తగానే ఖర్చుపెట్టే అలవాటు ఉండటంతో, పొదుపు కూడా చేసి ఉంచాను. కానీ, ఆ డబ్బు ఖర్చు పెట్టేస్తే భవిష్యత్తులో ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలో తెలియకపోవడంతో, జాగ్రత్తగానే ఉంటున్నాను.

ఇప్పుడు అమ్మ దగ్గరికి వెళ్లి రావాలంటే కనీసం రైలు ఖర్చులకైనా మూడు వేలు పైన అవుతుంది. ఇంకా మిగతా ఖర్చులు, ఏమైనా పాత బాకీలుంటే తీర్చడం, వీటన్నిటితో ఒక పదివేలు జేబులో వేసుకుని బయలుదేరితే గాని, అమ్మను చూసి రావడం అవ్వదు. ఇదంతా నేను ఒక్కడిని వెళ్తేనే. అదే కుటుంబమంతా కలిసి వెళ్తే, తడిసి మోపెడవుతుంది. అప్పటికీ నా భార్య అంటూనే ఉంది, మీరు మీ అమ్మ గారిని చూడడానికి వెళ్లకపోతే, అందరూ నన్ను ఆడిపోసుకుంటారు అని. తనకి మా అమ్మ మీద ఏమీ ద్వేషం లేదు, అలాగని ప్రేమా లేదు. అందరు అత్తా కోడళ్ళలాగే వాళ్ళూ ఉంటారు.


అసలు అమ్మని.. ఆ ఊర్లో ఎందుకు ఉంచేశావు అని చాలా మంది అడుగుతుంటారు. నేనూ అందరూ చెప్పే సమాధానమే చెప్తూ ఉంటాను. మా పల్లెటూర్లో విశాలమైన సొంతిల్లు, చుట్టూ తెలిసినవాళ్లు, చుట్టాలు అందరూ ఉన్నారు. ఇక్కడికి వస్తే పట్టణంలో చిన్న కొంపలో, ఆవిడకి ఏమీ తోచదు, ఈ వాతావరణంలో ఇమడలేదు. అయితే ఇవి ఏవో కుంటి సాకులు కాదు, నిజాలే!

ఈ సారి ఎలాగైనా అమ్మని చూడాలి అన్న కోరిక బాగా పెరిగింది. ఎందుకంటే, కరోనా వచ్చాక ఈ రెండేళ్లలో అమ్మ దగ్గరికి వెళ్ళలేదు. కారణాలు అనేకం. ఒకటి.. ప్రయాణాల్లో కరోనా ఇబ్బందులు, రెండు.. ఖర్చుల గురించి ఆలోచనలు, మూడు.. అక్కడికి వెళ్లి ఆమె ఆరోగ్యానికి ఏదైనా అయితే జరగబోయే పర్యవసానాలు! ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే ఈ రెండేళ్లలో చూడ్డానికి వెళ్ళలేదు. కానీ విషయం తెలుసుకోకుండా మామయ్య లాంటి వాళ్ళు ఏదో ఒక మాట అనడం మామూలైపోయింది.

ఇంతకీ కనీసం పదివేలు సర్దుబాటు కాకుంటే బయలుదేరలేను. మార్చి నెల వచ్చేసింది. జీతంలో ఆదాయపు పన్ను కోత బాగానే పడింది. చేతికి జీతం వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఏం చేయాలి? అమ్మను మాత్రం చూడాలి.

నా ముందు ఇప్పుడు రెండే దారులు ఉన్నాయి. ఒకటి దాచిన డిపాజిట్ రద్దుచేసి డబ్బులు తీయడం, లేదా ఎవరినైనా అప్పు అడగడం. ఏది చేసినా నా భార్యకు తెలిస్తే, సంజాయిషీ చెప్పుకోవడం. అలాగని తను నన్ను ఏదో అనేస్తుందని కాదు. తన బాధ తనది. నేను చేసే పనులవల్ల పిల్లలకి ఏమైనా ఇబ్బంది కలుగుతుందేమోనని. నా చిన్నప్పుడు మా అమ్మ కూడా ఇలాగే ఆలోచించేదేమో. నాకైతే గుర్తులేదు కానీ, ప్రతి తల్లీ తన పిల్లల గురించే ఆలోచిస్తూ ఉంటుంది. మా అమ్మ గానీ, నా భార్య గానీ అందుకు అతీతం కాదు.

మార్చి నెలలో అందరికీ ఆదాయపు సమస్యలు ఉంటూనే ఉంటాయి. కాబట్టి ఎవరినైనా అప్పు అడిగి, లేదనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే, డిపాజిట్ రద్దు చేసి డబ్బులు తీసుకుందాం అనుకున్నాను. సరిగ్గా అదే సమయంలో, నా చరవాణికి ఒక సందేశం వచ్చింది. చూస్తే మా బ్యాంకు నుంచి వచ్చినట్టుగా అనిపించింది. 'మీ అకౌంట్లో పొరపాటున ఇరవై వేల రూపాయలు వేయడం జరిగింది. అది తిరిగి ఇచ్చేయడానికి మీ సహకారం కోరుతున్నాం. ఈ క్రింద ఉన్న లింకుని క్లిక్ చేయండి' అని ఆ సందేశం సారాంశం. ఒక క్షణం ఆలోచనలో పడ్డాను. బ్యాంకు డబ్బులు నేను తీసుకోవడం సరి కాదు, తిరిగి ఇచ్చేయాలి. కానీ, మరో క్షణం అనిపించింది, సరిగ్గా నా అవసరానికి డబ్బులు అందాయి, ఎందుకు వదులుకోవాలి అని. ఏం చేయాలా అని చాలా మీమాంసలో పడ్డాను. ఒకవైపు బాధ్యత, మరో వైపు అవసరం. ఒకవైపు అమ్మ, మరోవైపు అప్పు. ఏదీ తేల్చుకోలేని నిస్సహాయత.




మరోసారి ఆ సందేశాన్ని చూసాను. మళ్ళీ అమ్మ గుర్తొచ్చింది. అలా ఆ సందేశాన్ని చాలా సార్లు చూశాను. హఠాత్తుగా ఎందుకో మనసులో ఆలోచన మొదలైంది. ఎక్కడో తేడాగా ఉంది అనిపించింది. వెంటనే చరవాణిలో బ్యాంకు అకౌంటు తెరిచి చూశాను. అకౌంటులో ఏ విధమైన డబ్బులు పడలేదు. మరోసారి చరవాణి సందేశాన్ని చూశాను. అప్పుడు నా సందేహం నిజమైంది. ఆ లింకు అనుమానాస్పదంగా అనిపించింది. ఆ మధ్య ఒకసారి బ్యాంకుకు వెళ్ళినప్పుడు, మాటల మధ్యలో క్యాషియర్ చెబుతూ "ఏ విధమైన లింకులు చరవాణికి వచ్చినా, వాటికి సమాధానం ఇవ్వవద్దు సార్" అని అన్నాడు. "సార్.. నిజంగా ఏదైనా అవసరం వస్తే మేమే మీకు నేరుగా ఫోన్ చేస్తాం, వేరే బ్రాంచి వాళ్ళు గాని, లేదా మరో ప్రాంతాల నుంచి గాని..

ఏ విధమైన ఫోన్లు రావు సార్! వచ్చే ఏవైనా లింకులు క్లిక్ చేస్తే, మోసగాళ్ళు మీ అకౌంటు నుంచి డబ్బులు దోచే ప్రమాదం ఉంది సార్! అలాగే, ఎట్టి పరిస్థితుల్లోనూ పాస్‌వర్డ్, పుట్టిన తేదీలు, అకౌంట్ నెంబర్లు మొదలైనవి ఎవరితోనూ చెప్పకూడదు సార్!" అంటూ చాలా విషయాలు చెప్పాడు.

ఆ విషయాలు జ్ఞాపకం వచ్చి, వెంటనే బ్యాంకుకి వెళ్లి, ఈ మెసేజ్ చూపించాను.

"'సార్, మీరు ఈ మెసేజ్‌కి సమాధానం పంపకపోవడం మంచిది అయింది. ఇది పక్కా మోసంచేసే మెసేజ్! వెంటనే ఈ మెసేజ్ డిలీట్ చేసేయండి!" అన్నాడు.

ఒక్క క్షణం, నేను తెలివిగా ప్రవర్తించాను అనిపించి, చాలా ఆనందం కలిగింది.

'థాంక్స్' చెప్పి బయట పడ్డాను. బ్యాంక్ బయట పెట్టిన స్కూటర్ స్టాండ్ తీస్తుంటే, అప్పుడు జ్ఞాపకం వచ్చింది.. అమ్మ!

తిరిగి స్టాండ్ వేసి, బ్యాంక్‌లోకి వెళ్ళాను.

"ఏమిటి సార్.. మళ్ళీ వచ్చారూ?" క్లర్క్ నవ్వుతూ అడిగాడు.

"ఏం లేదు సార్.. నాకు ఓ పదివేలు అప్పు కావాలి, దొరుకుతుందా?" మొహమాటం పడుతూ అడిగాను.

"అదేమిటి సార్.. మా ఉద్యోగమే అది!"

"నిజమే.. కానీ నాదా.. ప్రవేటు ఉద్యోగం! ఆస్తులు, పాస్తులు ఏం లేవు. మీ దగ్గర దాచుకున్న ఫిక్సెడ్లో కొద్దిగా డబ్బులు ఉన్నాయి సార్! అవి పిల్లల చదువుల కోసం ఉంచాను! అంతకంటే నాకేం లేవు సార్!" అన్నాను.

"పర్వాలేదు సార్.. ఆ ఫిక్సెడ్ డిపాజిట్ మీద అప్పు తీసుకోవచ్చు. మీరు నెలకి మూడునాలుగు వందల రూపాయలు కట్టగలిగితే సరిపోతుంది. అప్పు తీరిపోతుంది, ఆ డిపాజిట్ అమౌంట్ అలా భద్రంగా ఉంటుంది!"

చిరునవ్వుతో అన్నాడు.

"వెంటనే ఇస్తారా సార్.."

"పది నిమిషాల్లో ఇస్తాం. మీరు ఆ డిపాజిట్ బాండ్ తెస్తే, ఇప్పుడే ఇస్తాం సార్!"

"అలాగే.. తెస్తాను సార్." అంటూ ఆనందంగా బయటపడ్డాను.

అమ్మ దగ్గరికి వెళ్తున్నాన్న ఆనందంతో ఇంటి ముఖం పట్టాను!

# మాస్టర్ ప్లాన్

చిత్ర వెంకటేష్

***గుండెలమీద సుత్తితో కొట్టినట్టుగా ఫీలయ్యాడు ప్రసాద్. అప్పటికి అప్పుడు ఆమె గొంతు పిసికి చంపాలనుకున్నాడు. కాని అది సమయం కాదు. అందుకే అతి కష్టంమీద ఆవేశాన్ని అణుచుకున్నాడు. నిద్రపోతూనే ఓర కంటితో భార్యను గమనిస్తున్నాడు. తనలో తానే నవ్వుకుంటోంది. అది చూడలేక మొహం పక్కకు తిప్పుకున్నాడు ప్రసాద్. సరిగ్గా గంట తరువాత కళ్ళు తెరిచి చూశాడు. మాలతి గాఢంగా నిద్రపోతోంది.***

అతను ఎదురుగా నేలమీద చూశాడు. అక్కడ అప్పుడే తవ్వినట్టు మట్టి ఉంది. ఉదయం ఆ గోతిని తవ్వాడు అతను. అప్పుడు ఏం భయం వెయ్యలేదు అతనికి. డోంట్ కేర్ అన్నట్టుగా ప్రవర్తించాడు. పని పూర్తయిన తరువాత లోపలికి వెళ్ళాడు. మంచం మీద అతని భార్య లేదు. ఈ విషయం అతనికి తెలుసు. కొన్ని క్షణాల ముందే ఆమెను చంపాడు. కత్తితో కసకస పొడిచాడు. అప్పుడు కాని అతని కసి తీరలేదు.

శవాన్ని ఏం చెయ్యాలా అని ఆలోచించాడు.

అది పగలు కనుక వీధిలో చాల మంది తిరుగుతున్నారు. పైగా ఆ రోజు ఆదివారం. సెలవు రోజు. అందరు టీవి చూస్తూ రిలాక్స్ అవుతున్నారు. కొంతమంది పిల్లలు బయట ఆడుకుంటున్నారు. అంతా గోలగోలగా సందడిగా ఉంది. ఆ టైంలో శవాన్ని కారులో తీసుకువెళ్ళటం చాలా రిస్క్‌తో కూడుకున్న పని. ఎవరైనా చూసే అవకాశం ఉంది.

శవాన్ని పూడ్చిపెట్టటమే మంచిదనిపించింది అతనికి. అది ఇంటి వెనుక పూడ్చిపెడితే ఎవరూ తెలుసుకోలేరు. కనుక్కోలేరు. అక్కడ ఒక శవం ఉంటుందని ఎవరూ ఊహించరు. ఈ ఆలోచన రాగానే అతను మెయిన్‌గేటు తలుపులు మూసి తాళం వేశాడు. శవాన్ని తీసుకుని వెనుక వైపు వెళ్ళాడు. అక్కడ రకరకాల పూలచెట్లు, మొక్కలు ఉన్నాయి. అతనికి గార్డనింగ్ అంటే చాల ఇష్టం. రోజు ఒక గంటసేపు చెట్ల మధ్య గడుపుతాడు.

శవాన్ని నేలమీద పడుకోబెట్టి చూశాడు. భార్య మొహం ప్రశాంతంగా ఉంది. నిద్రపోతున్నట్టు ఉంది. తను హత్య చెయ్యబడుతుందని ఆమె ఊహించి ఉండదు.

రాత్రి అతని పక్కన పడుకుంది. భార్యతో మాట్లాడాలని ప్రయత్నించాడు. కాని ఆమె కొంచం కూడా స్పందించలేదు. పైగా చిరాకుగా చూసింది. అయినా అతను తన ప్రయత్నం మానలేదు. ఎలాగైనా ప్రసన్నం చేసుకోవాలని ట్రై చేశాడు. కాని ఆమె చాల మొండిది. అహంకారం నిండుగా ఉన్న స్త్రీ. అతని పలకరింపులను ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా తిట్టింది.

"ఇష్టం లేనప్పుడు ఎందుకు పలకరిస్తావు. నిజమైన మగవాడు ఇలాంటి పని చెయ్యడు!" అంది.

"అది కాదు నా మాట విను!" అన్నాడు.

ఆమె పట్టించుకోకుండా, అటు తిరిగి పడుకుంది. దాంతో అతని ఈగో చాలా హర్ట్ అయింది. ఇది మొదటిసారి కాదు ఆమె ఇలా ప్రవర్తించటం. డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పటి నుంచి ఆమె ప్రవర్తన మారిపోయింది. నిజమే. ఆమె స్థితిలో ఎవరున్నా అలాగే ప్రవర్తిస్తారు.

ఈ మధ్య అంటే నాలుగు నెలలనుంచి అతని మానసిక స్థితి బాగాలేదు. భార్య మీద విపరీతంగా అనుమానం కలుగుతోంది. దానికి కారణం లేకపోలేదు. ఒక రోజు రాత్రి అతనికి ఉన్నట్టుండి మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచి పక్కకు చూశాడు. భార్య అటు తిరిగి ఎవరితోనో సెల్‌లో మాట్లాడుతోంది. మధ్య మధ్యలో మత్తుగా నవ్వుతోంది. "అబ్బ అలా మాట్లాడకు నాకు సిగ్గువేస్తుంది" అని కూడా అంది.

అతను ఆమె కొలీగ్ కావచ్చు. ఆమె కోలీగ్స్ చాలామంది ఇంటికి వస్తుంటారు. సరదాగా టైం పాస్ చేస్తారు. అతనితో కూడా ఫ్రీగా మాట్లాడతారు. అప్పుడు ఆ విషయం అతను పట్టించుకోలేదు. అదంతా సర్వసాధారణం అనుకున్నాడు. కాని ఈ రోజు ఆమె ప్రవర్తన కొంచం ఎబ్బెట్టుగా ఉంది. ఒక పెళ్ళి అయిన స్త్రీ అలా ప్రవర్తించదు. అయినా అతను కొంచం కూడా స్పందించలేదు. క్యాజువల్‌గా తీసుకుని ఊరుకున్నాడు. అది అంతటితో అంతం కాలేదు. ప్రతి రెండు రోజులకు ఆమెకు ఎక్కడనుంచో కాల్ వస్తుంది. ఎంత నిద్రలో ఉన్నా చప్పున లేచి రెస్పాండ్ అవుతుంది. ఆ కాల్ కోసమే ఎదురుచూస్తున్నట్టుగా కాచుకుని ఉంటుంది. అలా ఆరేడు సార్లు జరిగాయి. ఇక తట్టుకోలేకపోయాడు అతను. ఆ కాల్ చేస్తుంది ఎవరా అని తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే సమయం కోసం కాచుకున్నాడు. ఆ సమయం నెల రోజులు ముందు వచ్చింది.



ఆ రోజు శనివారం. అతను ఆఫీసునుంచి తొందరగా వచ్చేశాడు. రిఫ్రెష్ అయి మంచంమీద పడుకుని ఇంగ్లీష్ నవల చదువుతున్నాడు. ఆ పుస్తకం పేరు 'ఫేస్ టూ ఫేస్ విత్ క్రిమినల్స్'. అది ఒక క్రైమ్ కథల పుస్తకం. నిజంగా దేశంలో జరిగిన నేరాలు. వాటిని నీరజ్ చౌదరి అనే పోలీస్ ఆఫీసర్ దర్యాప్తు చేసి నేరస్థులను పట్టుకున్నాడు. ఆయన రిటైర్ అయిన తరువాత ఆ సంఘటనలను పుస్తకంగా రాశాడు. ఆఫీసు నుంచి వస్తున్నప్పుడు హిగిన్‌బాతమ్స్ పుస్తకాల షాపులో ఆ పుస్తకం కనిపించింది. వెంటనే నూటయాభై ఇచ్చి కొన్నాడు. చాల ఇంట్రస్టింగ్‌గా ఉంది పుస్తకం. కథనం చాల ఆసక్తిగా గ్రిప్పింగ్‌గా ఉంది.

అప్పుడే అతని భార్య వచ్చింది. అతని వైపు చూసి నవ్వి "ఇప్పుడే వచ్చారా?" అంది.

"ఆవును. ఈ రోజు పెందలాడే వచ్చావు. ఆఫీసులో పనిలేదా?" అడిగాడు అతను.

"నాకు ఒంట్లో బాగా లేదు. కొంచం నీరసంగా ఉంది. అందుకే పర్మిషన్ తీసుకుని వచ్చేశాను!" అంది.

తరువాత బీరువా తెరిచి బట్టలు తీసుకుని బాత్రూంలోకి వెళ్ళింది. సెల్ టీపాయ్ మీద పెట్టింది. సాధారణంగా సెల్‌ను ఎప్పుడూ

ఎక్కడా విడిచిపెట్టదు. బాత్రూంకు వెళ్ళినా తీసుకువెళుతుంది. ఆ రోజు విచిత్రంగా మరిచిపోయింది. అతనికి కావల్సింది అదే కదా. అందుకే వెంటనే సెల్ తీసి చెక్ చేశాడు. రాత్రి వేళ ఆమెకు కాల్ చేస్తున్నవాడి పేరు మదన్. ఆ మదన్ ఎవరో తెలియదు. అతను ఆమె ఆఫీస్ కొలీగ్ కాదు. అంటే అతను ఎవరో బయటవాడు అయిఉండవచ్చు. వెంటనే సెల్ తీసి యథాస్థానంలో పెట్టేశాడు.

తరువాత ఆమె హాండ్‌బాగ్ చూశాడు. మామూలుగా పెన్ను, లిప్‌స్టిక్, దువ్వెన లాంటి ఆడవాళ్ళ సరంజామా ఉంది. కింద అడుగున ఒక చిన్న పాకెట్ కనిపించింది. తీసి చూశాను. అది కండోమ్ పాకెట్టు. పెళ్ళయిన స్త్రీ బ్యాగ్‌లో కండోమ్ పాకెట్టు ఉండదు. ఉందంటే ఖచ్చితంగా ఆమెకు పరాయి పురుషుడితో సంబంధం ఉండి ఉండాలి. ఒక్క క్షణం వరకు అతనికి అనుమానం మాత్రమే ఉంది. కండోమ్ పాకెట్టు చూసిన తరువాత అ అనుమానం నిజమని తేలింది. ఒక సునామీ అల తాకినట్టుగా కదిలిపోయాడు అతను. ప్రపంచం అంతా గిర్రున తిరుగుతున్న అనుభూతి కలిగింది. కొన్ని క్షణాల పాటు అచేతనుడయ్యాడు. తరువాత తేరుకుని కండోమ్ పాకెట్టు బ్యాగులో పెట్టేశాడు.

అది ఒక్కసారి మాత్రం కాదు. అలా చాలా సార్లు జరిగింది. ఒకరోజు ఆ మదన్ ఎవరో తెలుసుకోవాలని తీర్మానించుకున్నాడు. ఆ రోజు సాయంత్రం తిన్నగా ఆమె పనిచేస్తున్న కంపెనీకి వెళ్ళి, ఎదురుగా ఉన్న టీ షాపులో టీ తాగుతూ కూర్చున్నాడు. సాయంత్రం అయిదు గంటలకు అతని భార్య ఆఫీసు నుంచి బయటకు వచ్చి, బస్సు స్టాపులో నిలబడింది. అయిదు నిమిషాల తరువాత ఒక కారు వేగంగా వచ్చి ఆమె ముందు ఆగింది. డ్రైవింగ్ సీటులో ఎవరో మగవాడు ఉన్నాడు. అతన్ని ఎప్పుడు చూడలేదు అతను. ఆమె అతని పక్కనే కూర్చుంది. అతను నవ్వుతూ ఆమె భుజం మీద చెయ్యి వేసి కారు స్టార్ట్ చేశాడు.

వెంటనే కారు నెంబర్ నోట్ చేసుకున్నాడు. ఆర్ టీ ఏ ఆఫీసుకు వెళ్ళి, ఆ కారు ఎవరిదో తెలుసుకున్నాడు. ఆ కారు యజమాని పేరు మదన్. అతను ఆమె పనిచేస్తున్న కంపెని యం.డి.

తల మీద పిడుగు పడినట్టుగా అదిరిపడ్డాడు. ఇన్నాళ్ల వైవాహిక జీవితం పూర్తిగా నాశనం అయింది. కారణం తెలియదు. అతని భార్యకు పరాయి మగవాడిమీద మనస్సు అయింది. పవిత్రమైన వివాహబంధాన్ని కాలరాచింది.

ఏం చెయ్యాలో అతనికి అర్థం కాలేదు. నిలదీసి అడిగితే అతనికే నష్టం. సంఘంలో అతనికి అంతో ఇంతో పేరు ఉంది. అతని స్నేహితులు అంతా అతన్ని ఎంతో గౌరవిస్తారు. ఈ విషయం బయటపడితే అతని పరువు పోతుంది. ముఖ్యంగా అతని తల్లి, తండ్రి తల్లడిల్లిపోతారు.

ఆమె ఎందుకు పరాయివాడిని మరిగిందో అతనికి తెలుసుకోవాలని లేదు. దాని వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. కాని ఆమె చేసిన ఆ నమ్మక ద్రోహాన్ని మాత్రం అతను క్షమించలేకపోతున్నాడు. ఇప్పుడు విడాకులు తేలికగా తీసుకోవచ్చు. ఎవరు పెద్దగా పట్టించుకోరు. అది తమ జీవితంలో ఒక భాగంగా చాలా మంది భావిస్తున్నారు. అతని మీద ఇష్టం లేకపోతే ఆ విషయం డైరక్టుగా అతనికి చెప్పవచ్చు. విడాకులు కావాలని అడిగి ఉండవచ్చు. కాని ఆమె ఆ పని చేయకుండా, పరాయివాడితో సంబంధం పెట్టుకుంది. ఇది క్షమించరాని నేరం. దీనికి ఆమె శిక్ష అనుభవించవలసిందే.

అందుకే ఒకరోజు ఆ ఏరియా పోలీస్‌స్టేషన్‌కు కాల్ చేశాడు.

ఇనస్పెక్టర్‌తో మాట్లాడాలని చెప్పాడు. అతను లైన్‌లోకి రాగానే "నా పేరు ప్రసాద్, నెహ్రూనగర్ ఆరవ వీధిలోంచి మాట్లాడుతున్నాను!" అన్నాడు.

"చెప్పండి ప్రసాద్ ఏమిటి మీ ప్రాబ్లం... ఎవరైనా దొంగలు కాని పడ్డారా?" అన్నాడు ఇనస్పెక్టర్.

"కాదు హత్య జరిగింది!" అన్నాడు ప్రసాద్.

"ఎక్కడ ఎప్పుడు!" ఆశ్చర్యంగా అడిగాడు ఇనస్పెక్టర్.

"ఈ రోజు ఉదయం మా ఇంట్లో!"

"వివరంగా చెప్పండి."

"ఈ రోజు ఉదయం నా భార్యను నేనే హత్యచేసాను. శవాన్ని పెరట్లో పాతిపెట్టాను. మీరు వస్తే చూపిస్తాను!"

"ఉదయం హత్యచేసి ఇప్పుడు ఎందుకు చెప్తుతున్నారు?"

"సార్ హత్య చేసినవాడు హత్య చేశానని చెప్తాడా. అలాగే నేను చెప్పలేదు!"

"మరి ఇప్పుడు ఎందుకు చెప్తుతున్నావు!" ఎగతాళిగా అడిగాడు ఇనస్పెక్టర్.

"ఈ విషయం ఎవరికి చెప్పకూడదనే అనుకున్నాను. కాని అది సాధ్యం కాలేదు. మనిషి ఎవరికైనా జవాబు చెప్పవచ్చు. కాని మనస్సాక్షికి జవాబు చెప్పలేడు. అది ఊరికే ఉండదు. పదే పదే మిమ్మల్ని నువ్వు హంతకుడివి అని దెప్పి పొడుస్తుంది. ఆ టార్చర్ భరించటం సాధ్యం కాదు. ఉదయం నుంచి నా మనస్సాక్షి అలాగే టార్చర్ పెడుతోంది. నువ్వు హంతకుడివి హంతకుడివి అని దెప్పి పొడిచింది. తట్టుకోలేకపోయాను. ఈ హింస భరించటం కంటే నేరం ఒప్పుకోవటమే మంచిదని తోచింది. అందుకే కాల్ చేశాను!" అన్నాడు ప్రసాద్.

"మీరు అక్కడే ఉండండి. మేము వెంటనే బయలుదేరుతున్నాం. మీ అడ్రస్స్ చెప్పండి నోట్ చేసుకుంటాను!" అన్నాడు ఇనస్పెక్టర్.

ప్రసాద్ అడ్రస్స్ చెప్పాడు. తరువాత లైన్ కట్ చేశాడు.

పావుగంట తరువాత ఇనస్పెక్టర్ తన సిబ్బందితో వచ్చాడు.

"నేనే మీకు కాల్ చేశాను. నా పేరు ప్రసాద్!" అన్నాడు.

"శవం ఎక్కడుంది!" అడిగాడు ఇనస్పెక్టర్.

"రండి చూపిస్తాను!" అని ఇనస్పెక్టర్ ను పెరటి వైపు తీసుకువెళ్ళాడు. అక్కడ ఒక చోట చూపించి "ఇక్కడే నా భార్యను హత్య చేసి పాతిపెట్టాను!" అన్నాడు.

ఇనస్పెక్టర్ తన సిబ్బందికి సైగ చేశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ పక్కన ఉన్న గునపం పార తీసుకుని తవ్వటం మొదలుపెట్టారు. పావుగంట తవ్విన తరువాత కూడా శవం బయటపడలేదు. ఇంకా కొంచం లోతు తవ్వారు. అయినా ఏం లేదు. ఇనస్పెక్టర్ చిరాకుగా చూశాడు.

"శవం ఏది ప్రసాద్ గారు!" అన్నాడు కోపంగా.

"నేను ఇక్కడే పాతిపెట్టానండి. ఉదయం పాతిపెట్టి లోపలికి వెళ్ళిపోయాను. తరువాత నేను ఇటువైపు రాలేదు. మీకు కాల్ చేసిన తరువాత వచ్చాను!" అన్నాడు ఆశ్చర్యంగా.

అప్పుడే ఒక స్త్రీ వాళ్ళ దగ్గరకు వచ్చింది.

"ఏమిటి ఇదంతా. పోలీసులు ఎందుకు వచ్చారు!" అడిగింది ప్రసాద్ ను.

"ఎవరు మీరు?" అడిగాడు ఇనస్పెక్టర్.

"నా పేరు మాలతి. ఈయన భార్యను!" అంది.

ఇనస్పెక్టర్ షాక్ తిన్నట్టు ఆమె వైపు చూశాడు.

"మీరు బ్రతికే ఉన్నారా?" అన్నాడు.

"వాట్ డూ యూ మీన్?" అంది కోపంగా మాలతి.

"మీ వారు మిమ్మల్ని ఉదయం హత్యచేసి ఇక్కడ పాతిపెట్టానని మాకు కాల్ చేశాడు. కాని తీరా చూస్తే మీరు బ్రతికే ఉన్నారు. ఏమిటి ఈ నాటకం!" అన్నాడు ఇనస్పెక్టర్.

మాలతి కోపంగా ప్రసాద్ వైపు చూసి "మీరు కాని కాల్ చేశారా. నేను చచ్చిపోయానని చెప్పారా!" అడిగింది.

"అవును నేను కాల్ చేసిన మాట నిజం. కాని నిన్ను నిజంగానే హత్య చేశాను కదా. ఎలా బ్రతికి వచ్చావు?"

"మా ఆయనకు కొంచం మతిస్థిమితం తప్పినట్టుగా ఉంది. మీకు ఇబ్బంది కలిగించినందుకు మమ్మల్ని క్షమించండి. మీరు వెళ్ళండి!" అంది.

"మిస్టర్ ప్రసాద్ ఇంకోసారి మాతో హాస్యాలు ఆడకండి. తీవ్రమైన పరిణామాలు ఎదురుకోవలసివస్తుంది!" అని హెచ్చరించి ఇనస్పెక్టర్ తన సిబ్బందితో వెళ్ళిపోయాడు.

మాలతి ఛీత్కారంగా అతని వైపు చూసి లోపలికి వెళ్ళిపోయింది.

ప్రసాద్ చిన్నగా నవ్వాడు. అతను వేసిన పథకం కొంచెం నెరవేరింది. కాని ఇంకా కొంచెం మిగిలి ఉంది. అది కూడా పూర్తి చేస్తే అతని ప్లాన్ ఫలిస్తుంది.

అంతటితో ఆగలేదు ప్రసాద్.

మరో పదిహేను రోజుల తరువాత మళ్ళీ ఇనస్పెక్టర్‌కు కాల్ చేశాడు. ఇంతకు ముందు ఏం చెప్పాడో అదే చెప్పాడు. రూల్ ప్రకారం ఇనస్పెక్టర్ తన సిబ్బందితో మళ్ళీ వచ్చాడు. ప్రసాద్ చూపించిన చోట మళ్ళీ తవ్వాడు. అయినా ఏం కనిపించలేదు. ఆ టైంలో మాలతి ఇంట్లోనే ఉంది.

మళ్ళీ తనే వచ్చి భర్త తరఫున క్షమాపణ కోరింది. యథాప్రకారం ప్రసాద్ అమాయకంగా నిలబడి చోద్యం చూశాడు.

"ఇదే మీకు లాస్ట్ వార్నింగ్. మరోసారి ఇలా జరిగితే ఇద్దరిని అరెస్ట్ చేసి జైలులో పెడతాను. దయచేసి మీ వారిని డాక్టర్ కు చూపించండి. ఆయన విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు!" అని చెప్పి వెళ్ళిపోయాడు ఇనస్పెక్టర్.

ఆఫీసర్ మాటలు మాలతికి సబబుగానే తోచాయి. అదే రోజు ప్రసాద్‌ను మానసికవ్యాధి నిపుణుడి దగ్గరకు తీసుకువెళ్ళింది. ఆయన ప్రసాద్‌కు అన్ని పరీక్షలు చేశాడు. తరువాత మాలతితో అన్నాడు.

"మీ ఆయనకు ఒక విచిత్రమైన వ్యాధి వచ్చింది. ఎవరిమీద అయినా కోపంగా ఉంటే వాళ్ళను హత్యచేసినట్టు భావిస్తాడు. కాని అది మనస్సులో దాచుకోలేడు. ఎవరికైనా చెప్తాడు. అలా చెప్పకపోతే విపరీతంగా బాధపడతాడు. మానసికంగా శారీరకంగా నలిగిపోతాడు. బహుశా మీ మీద ఆయనకు చాలా కోపంగా ఉన్నట్టుగా ఉంది. అందుకే మిమ్మల్ని హత్య చేసినట్టు ఫీలవుతున్నాడు!" అన్నాడు డాక్టర్.

మాలతి తీక్షణంగా భర్తవైపు చూసింది.

ప్రసాద్ ఆమె చూపులను తట్టుకోలేక తల కిందికి దించుకున్నాడు.

మాలతి విపరీతంగా సంతోషపడుతోంది. భర్తకు ఎలా విడాకులు ఇవ్వాలా అని ప్రతిరోజు తెగ ఆలోచిస్తోంది. కాని ఇప్పుడు అనుకోకుండా చక్కని అవకాశం వచ్చింది. ప్రసాద్‌కు విచిత్రమైన మానసిక రోగం ఉంది. ఇది అడ్డం పెట్టుకుని కోర్టులో విడాకులు తీసుకోవచ్చు. ఈ ఆలోచన రాగానే మాలతి చిన్నగా నవ్వి అంది.

"ఎందుకైనా మంచిది నా భర్తకు వ్యాధి ఉన్నట్టు ఒక సర్టిఫికేట్ ఇవ్వండి. ఎవరికైనా ఇబ్బంది కలిగిస్తే సర్టిఫికెట్ చూపించి వాళ్ళను కన్విన్స్ చెయ్యవచ్చు!" అంది.

అలాగే అని డాక్టర్ సర్టిఫికెట్ ఇచ్చాడు.

అది తీసుకుని ఇద్దరు ఇంటికి చేరుకున్నారు. ప్రసాద్ గదిలో మంచం మీద నిరాసక్తంగా కూర్చున్నాడు. మాలతి అతని ముందే సెల్ తీసి మదన్‌కు కాల్ చేసింది.

"డియర్ మనకు లైన్ క్లియర్ అయినట్టే!" అంది.

"అంటే నీ భర్త నీకు విడాకులు ఇవ్వటానికి ఒప్పుకున్నాడా!" ఆత్రంగా అడిగాడు మదన్.

"అతను ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా బాధలేదు. కాని విడాకులు మాత్రం తప్పని సరిగా వస్తాయి!" అంది మాలతి.

"ఎలా?" అన్నాడు మదన్

మాలతి జరిగిందంతా వివరించి చెప్పింది.

"దీన్ని అడ్డం పెట్టుకుని మనం తేలికగా విడాకులు తీసుకోవచ్చు. రేపు లాయరుతో మాట్లాడతాను!" అంది.

"ఎక్సెలెంట్ డియర్. ఇక మనకు ఎవరి అడ్డు ఉండదు. బెస్ట్ ఆఫ్ లక్!" అని ఫ్లయింగ్ కిస్ ఇచ్చాడు.

మాలతి కూడా రెస్పాండ్ అయింది.

జరుగుతున్నదంతా ప్రసాద్ గమనించాడు. అతని గుండెలు కుతకుతలాడిపోయాయి. ఆవేశం ద్వేషం కలిసికట్టుగా అతన్ని కుదిపేశాయి. ఎంత గాఢంగా ప్రేమించాడు భార్యని. ఆమె కోరినవన్నీ ఎందుకూ, ఏమిటీ అని అడగకుండా ఇచ్చాడు. పైగా పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. రాత్రి ఎప్పుడు వచ్చినా కారణాలు అడగలేదు. ఆరు సంవత్సరాల వైవాహిక జీవితంలో ఎప్పుడూ ఆమెను కష్టపెట్టలేదు. పల్లెత్తు మాట అనలేదు. ఆమె చెప్పిన దానికంతా తలాడించాడు. రాత్రి గంటలు గంటలు చాటింగ్ చేసినా పట్టించుకోలేదు. అన్నిటికంటే ఇంకో విషయం ఉంది. పెళ్ళియినప్పుడు ఆమెకు డిగ్రీ లేదు. ఇంటర్మీడియట్ మాత్రం పాసయింది. తనే బలవంతం చేసి డిగ్రీలో చేర్పించాడు. రోజూ కాలేజికి బైక్ మీద దిగపెట్టేవాడు. రాత్రి వేళ ఆమెకు తెలియనివి చెప్పేవాడు. ఆమె పరీక్షల కోసం ఆఫీసుకు సెలవు పెట్టాడు. స్వయంగా తనే పరీక్ష హాలుకు తీసుకువెళ్ళేవాడు.

ఇంత చేసినా ఆమెకు విశ్వాసం లేదు. నీచురాలు ఇలాంటి ఆడదాన్ని బతకనివ్వకూడదు. నరికి పోగులు పెట్టాలి. అయినా ప్రసాద్ తొందరపడలేదు. మరో రెండుసార్లు స్టేషన్‌కు కాల్ చేసి తను హత్యచేసినట్టు చెప్పాడు.

ఆ టైంలో ఇంకో ఇనస్పెక్టర్ ఉన్నాడు. అతను ఆ రోజే చార్జ్ తీసుకున్నాడు. పాత ఇనస్పెక్టర్‌తో మాట్లాడుతూ చాంబర్స్‌లో కూర్చుని ఉన్నాడు. అప్పుడే ప్రసాద్ కాల్ వచ్చింది.

“చార్జ్ తీసుకోగానే ఒక హత్యకేసు వచ్చింది!” అన్నాడు కొత్త ఇనస్పెక్టర్.

“హత్య ఎక్కడ జరిగింది?” క్యాజువల్‌గా అడిగాడు పాత ఇనస్పెక్టర్.

“నెహ్రూనగర్‌లో ఆరవ వీధిలో.. కాల్ చేసి చెప్పింది ప్రసాద్ అనే వ్యక్తి!” అన్నాడు కొత్త ఇనస్పెక్టర్.

పెళ్ళున నవ్వాడు పాత ఇనస్పెక్టర్.

“ఎందుకు నవ్వుతున్నారు. ఇందులో నవ్వటానికి ఏముంది!” చిరాకుగా చూశాడు కొత్త ఇనస్పెక్టర్.

“ఆ ప్రసాద్ అనే వాడికి విచిత్రమైన మానసిక వ్యాధి ఉంది. తను చెయ్యని పని చేసినట్టు చెప్తాడు. సిబ్బందితో వెళ్ళాను. కాని అక్కడ ఏ హత్య జరగలేదు. హత్య చెయ్యబడిన అతని భార్య బతికే ఉంది. అలా రెండు సార్లు జరిగింది. అంతటితో అతను విడిచిపెట్టలేదు. మరో రెండుసార్లు కాల్ చేశాడు. కాని నేను వెళ్ళలేదు అనుకోండి. మీరు కూడా వెళ్ళకండి. అనవసరంగా నవ్వుల పాలవుతారు!” అన్నాడు పాత ఇనస్పెక్టర్.

కొత్త ఇన్‌స్పెక్టర్ సందిగ్ధంగా చూసాడు.

“మీ ఇష్టం. మీకు వెళ్ళాలనుకుంటే వెళ్ళండి. నాకేం అభ్యంతరం లేదు!” అని లేచాడు పాత ఇనస్పెక్టర్.

కొత్త ఇనస్పెక్టర్ ‘ఏం చేద్దాం’ అన్నట్టు తన సిబ్బంది వైపు చూశాడు.

వాళ్ళలో ఒకడు నవ్వి “సార్ చెప్పింది నిజం సార్. రెండుసార్లు మేము వెళ్ళి ఫూల్స్ అయ్యాం. ఇంకోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించాం. అయినా కాల్ చేస్తూ మమ్మల్ని విసిగిస్తున్నాడు. పిచ్చి కదా అని సరిపెట్టుకున్నాం!” అన్నాడు.

ఈ మాటలతో కొత్త ఇనస్పెక్టర్ అనుమానాలు తీరిపోయాయి. నవ్వుతూ పాత ఇనస్పెక్టర్‌కు వీడ్కోలు చెప్పాడు.

రెండు రోజుల తరువాత తన ప్లాన్ అమలుపరిచాడు ప్రసాద్. ఇప్పుడు నిజంగా హత్యచేసినా ఎవరూ నమ్మరు. ఒకవేళ పరిశోధన చేసినా పెద్దగా సమస్యలు రావు. తన భార్య మదన్‌తో వెళ్ళిపోయిందని చెప్తాడు. వాళ్ళిద్దరికి సంబంధం ఉన్నట్టు ఆఫీసు స్టాఫ్ అందరికి తెలుసు. కనుక అతనికి అనుకూలంగా సాక్ష్యం చెప్తారు. పోలీసులు మదన్‌ను అనుమానిస్తారు. అతనే ఆమెను హత్యచేశాడని అనుకుంటారు. ప్రసాద్ మీద ఎవరికి అనుమానం రాదు. అతను ఒక విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని డాక్టర్ చెప్తాడు. సర్టిఫికేట్ కూడా చూపిస్తాడు. సర్టిఫికేట్ అడిగి తన గోతిని తనే తవ్వుకుంది మాలతి.

ఆ రాత్రి ఇద్దరు పక్క పక్కనే పడుకున్నారు. అర్ధరాత్రి కావటానికి ఇంకా పది నిమిషాలు టైం ఉంది. అప్పుడే మాలతి సెల్ చప్పుడు చేసింది. మదన్ చేసినట్టున్నాడు.

“డార్లింగ్ ఈరోజు లాయర్‌ను కలిసాను. అన్ని విషయాలు మాట్లాడాను. తప్పకుండా విడాకులు వస్తాయని చెప్పాడు. అడ్వాన్స్ కూడా ఇచ్చాను!” అంది మాలతి.

అవతల నుంచి మదన్ ఏదో చెప్పినట్టున్నాడు. సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది మాలతి.

“ఛ! ఏమిటా మాటలు. నీకు బొత్తిగా సిగ్గులేదు!”అంది నవ్వి.

గుండెలమీద సుత్తితో కొట్టినట్టు ఫీలయ్యాడు ప్రసాద్. అప్పటికి అప్పుడు ఆమె గొంతు పిసికి చంపాలనుకున్నాడు. కాని అది సమయం కాదు. అందుకే అతి కష్టంమీద ఆవేశాన్ని అణుచుకున్నాడు. నిద్రపోతూనే ఓర కంటితో భార్యను గమనిస్తున్నాడు. తనలో తానే నవ్వుకుంటోంది. అది చూడలేక మొహం పక్కకు తిప్పుకున్నాడు ప్రసాద్. సరిగ్గా గంట తరువాత కళ్ళు తెరిచి చూశాడు. మాలతి గాఢంగా నిద్రపోతోంది.

మెల్లగా దిండు తీసుకుని ఆమె దగ్గరకు వెళ్ళాడు. చప్పున దిండును ఆమె మొహం మీద పెట్టి గట్టిగా వత్తాడు. నిద్రలోంచి లేచింది మాలతి. భర్తను, అతని కోపాన్ని చూసి బిత్తరపోయింది. ఏదో చెప్పాలనుకుంది. కాని ఆమెకు ఆ అవకాశం ఇవ్వలేదు ప్రసాద్. కసిదీరా బలంగా నొక్కాడు. క్షణంపాటు గిలగిల కొట్టుకుని, తరువాత తల పక్కకు వాల్చేసింది. ఆమె ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

ఆమె శరీరాన్ని ఎత్తుకుని పెరటిలోకి వెళ్ళాడు. అప్పటికే ఒకచోట గొయ్యి తవ్వి ఉంది. అందులో ఆమె శవాన్ని పడేశాడు. తరువాత మట్టి కప్పాడు. ఇంతటితో భార్య చరిత్ర ముగిసిపోయింది. ఆమె ఎక్కడికి వెళ్ళిందో ఏమైందో ఎవరికి తెలియదు.

లోపలికి వెళ్ళి ఫైలులోంచి డాక్టర్ సర్టిఫికేట్ తీసుకున్నాడు. దాన్ని జాగ్రత్తగా బీరువాలో దాచి తాళం వేశాడు. మరునాడు అతను డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు. ఆయనకు పాతిక వేలు ఫీజు ఇచ్చాడు.

ఆశ్చర్యంగా చూశాడు డాక్టర్.

“ఆ రోజు మీరు ఫీజు ఇచ్చారు కదా. మళ్ళీ ఎందుకు!” అడిగాడు.

ప్రసాద్ మాట్లాడకుండా బయటకు నడిచాడు!!

# స్పర్శ

సింగరాజు శ్రీనివాసరావు



✆ 9052048706

***"నన్ను క్షమించరా అభీ.. నేను చేసినది తప్పే. మామూలు తప్పు కాదు, క్షమించరాని తప్పు. దానికి నన్ను నేనే శిక్షించుకోవాలని అనుకుంటున్నాను. అందుకే వెళ్ళిపోతున్నాను. ఏ స్పర్శ కోసం నా తండ్రి తపించిపోయాడో, ఆ స్పర్శకు నేను కూడ దూరంగా ఉండడం, నేను చేసిన పాపానికి శిక్ష. ఎవరైనా అడిగితే మా నాన్న కాశీలో ఉంటానని వెళ్ళాడని చెప్పు."***

"నాన్నా.. మీ నిర్ణయం మార్చుకోరా!"

"మార్చుకునే వాడినే అయితే అసలు నిర్ణయం తీసుకునే వాడినే కాదు!"

"మీ మూర్ఖం మీదే గానీ, మా గురించి ఆలోచించరా?"

"మీకు నా గురించి ఆలోచన లేనపుడు నాకు మాత్రం మీ గురించి ఆలోచన దేనికి?"

"పదిమందిలో నా పరువు పోతుంది!"

"ఇక్కడ నా మెదడే పోయేలా వుంది!"

"ఏమంత కష్టమొచ్చింది. సమయానికి అన్నీ వైనంగా అందుతూనే ఉన్నాయిగా! తిని పడుకోక ఎందుకొచ్చిన గలభా ఇది!"

"కొష్ఠంలో పలుపుతో కట్టేసి ఉదయం, సాయంత్రం గడ్డిపెట్టి మేపే పశువుకు, నాకు తేడా లేదు!"

"మరీ అంత దారుణమైన పోలికా!"

"అదే నాకంటే మెరుగు. కనీసం స్వేచ్ఛగా రంకె వేయగలదు. కానీ నాకు ఆ స్వాతంత్ర్యం కూడ లేదు!"


"మీకంతగా కష్టమనిపిస్తే మీ ఇష్టమొచ్చినట్టు తగలడండి!" విసురుగా వెళ్ళిపోయాడు మధుబాబు.

★★★

సరిగ్గా ఇరవై సంవత్సరాల క్రితం తనకు, తండ్రికి జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది మధుబాబుకు. ఆరోజు తండ్రి చేస్తున్నది తప్పని, తనలాగ ఏ కొడుకూ చూడడని అనుకున్నాడు. కానీ తండ్రి మనసులోని వేదనను అర్థం చేసుకోలేక పోయాడు. తండ్రిది మూర్ఖమనీ, ఇల్లు దాటి వెళ్ళిపోతే పదిమందిలో పరువు పోతుందని చిందులు తొక్కాడు. తను సరిగా చూడడం లేదని తండ్రి అలిగి వెళ్ళిపోతున్నాడని అనుకున్నాడే గానీ, అతని మనసులోని బాధను అర్థం చేసుకోలేక పోయాడు. అంత గొడవపడ్డ తరువాత తండ్రి వెళ్ళిపోతాడనుకున్నాడు. కానీ ఆయన వెళ్ళలేదు. బిడ్డను బాధపెట్టకూడదనుకున్నాడో ఏమో ఆగిపోయాడు. ఆరోజు నుంచి తండ్రి మరీ నిశ్శబ్దంగా ఉండసాగాడు. వయసు మళ్ళిన తరువాత అందరూ ఇలాగే ఉంటారులే అనే నిర్లక్ష్యంతో

వెళ్ళిపోయేవాడు. ఆ గొడవ జరిగిన సంవత్సరానికల్లా హఠాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయాడు తండ్రి. భార్య పోయిన దిగులుతో పోయాడని అందరూ అనుకున్నారు. ఇప్పుడు తెలుస్తున్నది మధుబాబుకు తండ్రి చావుకు కారణమేమిటో... ఏదయినా తనదాకా వస్తే గానీ, అర్థం కాదు ఎదుటివారి బాధ మనుషులకు. నిన్న తనకు, తన కొడుకు అభిరామ్‌కు జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది. బాధతో కళ్ళు మూసుకున్నాడు మధుబాబు.

★★★



"అభి..బాగా బిజీనా.." చెప్పులేసుకుంటున్న కొడుకును పిలిచాడు మధుబాబు.

"అవున్నాన్నా.. ఇవాళేమిటి మా ఉద్యోగంలో ఎప్పుడూ హడావుడే. ఇంతకూ ఏం కావాలి?"

"ఒక్క పది నిముషాలు కూర్చోరా నా దగ్గర!"

"సారీ నాన్నా.. నాకంత తీరికలేదు. మీరంటే రిటైరయి ఖాళీగా కూర్చున్నారు. నేనలా కాదుగా, వెళ్ళాలి!"

"నాకు ఒంటరితనం మరీ భారంగా ఉందిరా. ఏమీ తోచడం లేదు!"

"స్మార్ట్‌ఫోను కొనిచ్చాను కదా. యూట్యూబ్ చూసుకుంటూ కాలం గడపండి!"

"ఎంతసేపని చూస్తానురా!"

"లేకుంటే మీ స్నేహితులతో మాట్లాడుకోండి. నన్ను విసిగించక పడుకోండి. మీతో బాతాఖానీ కొట్టే తీరిక నాకు లేదు!" "రోజుకు ఒక్క పది నిముషాలు నాతో గడపలేవటరా. కన్నతండ్రినిరా నేను!" మధుబాబు గొంతులో ఆవేదన. "మీరు పది నిముషాలని కూర్చోబెట్టి, తాతలనాటి రామాయణం మొదలుపెడతారు. నోరు తెరిస్తే అది మూత పడాలంటే పూట మారాలి. అయినా మీరు ఏమాత్రం తాతయ్యతో అంతలా పూసుకుని మాట్లాడారు. నాకు ఊహ తెలిసిన తరువాత చూశాను కదా. విసుక్కోవడమే తప్ప, ఆప్యాయంగా ఎప్పుడు ఉన్నారు ఆయనతో. ఇప్పుడు మీకు వయసు దాటేసరికి కొడుకుతో ముచ్చట్లాడాలనిపిస్తున్నదా?" కడుపులో కసిని కక్కేశాడు అభిరామ్. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు మధుబాబుకు. కొడుకు తను చేసిన తప్పును ఎత్తి చూపిస్తున్నాడు. 'ఆనాడు నొప్పి అనిపించనిది,

ఇప్పుడు నొప్పి అనిపిస్తున్నదా' అని నిలదీస్తున్నాడు. కానీ తను చేసినది తప్పని ఒప్పుకోవాలని అనిపించలేదు మధుబాబుకు.

"ఆరోజు ఆయనతో ముచ్చట్లు చేస్తూ కూర్చుని వుంటే, నువ్వు పదో తరగతితోనే చదువు ఆపేసి, ఏ కిరాణా కొట్లోనో చేరాల్సివచ్చేది. రాత్రింబవళ్ళు కష్టపడ్డాను కనకే నువ్వీరోజు ఇంజనీరువై లక్షలు సంపాదిస్తున్నావు. నా తండ్రి మనసును నొప్పించి నేను నీకోసం జీవితాన్ని త్యాగంచేస్తే, ఈరోజు నువ్విలా మాట్లాడుతావా!" ఉక్రోషం పట్టలేక అన్నాడు మధుబాబు.

"ఒకసారి మీరే నాతో చెప్పారు. మీరు హాస్టలులో ఉండలేనన్నారని, మీకోసం ఒంగోలులో ఇల్లు తీసుకున్నారటగా తాతయ్య. రెండు కాపురాల ఖర్చు భరించలేక ఉన్న పొలాన్ని కూడ అమ్మేయాల్సి వచ్చిందన్నారు. మరి ఆయనది మాత్రం త్యాగం కాదా. చూడండి.. బిడ్డలను పెంచి పెద్దచేయడం, చదివించి వారికొక జీవనోపాధి కల్పించడం, తండ్రిగా బాధ్యతే గానీ, పెద్ద త్యాగం కాదు. అయినా ఇదంతా ఎందుకు నాన్నా.. నాకు మీతో మాట్లాడే తీరిక, ఓపిక లేదు. పెట్టింది తిని, ఫోనుతోనో, పుస్తకాలతోనో కాలక్షేపం చేయండి. ఇప్పటికే నా టైమ్ సగం తినేశారు!" అని పెట్టవలసిన నాలుగూ పెట్టి వెళ్ళిపోయాడు అభిరామ్.

కొడుకును నిలదీయాలనుకుని తనే అభాసుపాలయేసరికి అవమానంతో తలదించుకున్నాడు మధుబాబు. ఇక ఇంట్లో ఉండాలనిపించలేదు. ఎవరు చేసిన పాపం వారనుభవించాలని పెద్దలు చెప్పింది అక్షరసత్యం. ఇక ఆలోచించి లాభం లేదనుకుని మనసులో ఒక నిర్ణయానికి వచ్చాడు మధుబాబు.

★★★

"ఏమండీ..మీరెందుకింత కఠినంగా మాట్లాడుతున్నారు మామయ్యగారి తోటి. పాపం ఆయన ఎంత చిన్నబుచ్చుకున్నారో మీకు తెలుసా. ఈరోజు సరిగా భోంచెయ్యలేదు కూడ!" పడకగదిలో పడుకుని ఉన్న భర్త దగ్గరకు వచ్చి అడిగింది అంజల.

మాట్లాడలేదు అభిరామ్. తలవంచుకుని కూర్చుని ఉన్నాడు. మెల్లగా దగ్గరికి వెళ్ళి అతని చుబుకం పట్టి పైకి లేపి "అడుగుతుంటే మాట్లాడరేం!" అంటూ అభిరామ్ కళ్ళల్లో నీరు చూసి ఆగిపోయింది.

"నేను తప్పుచేశానని తెలుసు అంజలా.. కానీ ఈరోజు నాన్న పడుతున్న బాధ, ఆరోజు తాతయ్య పడుతుంటే కళ్ళారా చూశాను. నాన్న ఎన్ని కారణాలు చెప్పినా తను చేసింది ముమ్మాటికీ తప్పే. కానీ తప్పని ఒప్పుకోవడానికి నాన్నకు భేషజం. అదే నాకు నచ్చడం లేదు. ఒకరోజు తాతయ్యతో నాన్నకు బాగా గొడవయింది. తాతయ్య ఆశ్రమానికి వెళతానన్నాడు. అప్పటికయినా తాతయ్య బాధను అర్థం చేసుకోకుండా నిర్లక్ష్యంగా 'ఉంటే ఉండు, పోతే పో' అని వెళ్ళిపోయాడు. కనీసం అమ్మ కూడ నాన్నకు నువ్వు చేస్తున్నది తప్పు అని చెప్పలేదు. అప్పుడు నాకు పదేళ్ళు. ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్న తాతయ్య దగ్గరికి వెళ్ళాను. 'తాతయ్యా వెళ్ళిపోతారా' అని అడిగాను. 'వెళ్ళలేనురా..నేను వెళ్ళిపోతే, అందరూ మీనాన్నను తండ్రిని వెళ్ళగొట్టిన విశ్వాసహీనుడు అంటారురా. నా కొడుకు అంత నింద మోయడం నాకు ఇష్టం లేదు. నా మూలంగా వాడు బాధపడకూడదు. ఇవాళో, రేపో రాలిపోయేవాడిని. నేనే సర్దుకుపోతాను' అన్న తాతయ్యను అడిగాను. 'నాన్న మాట్లాడకపోతే ఏం తాతయ్యా.. నాతో మాట్లాడు' అన్నాను అమాయకంగా. అప్పుడు ఆయన దానికి చెప్పిన సమాధానం నిజానికి నాకు ఆరోజు అర్థం కాలేదు. కానీ నేను తండ్రినయ్యాక తెలుస్తున్నది అంజలా. ఆయన ఏమన్నాడో తెలుసా.. 'ఒరేయ్ అభి. ఎంతమందితో మాట్లాడినా కన్నకొడుకుతో మాట్లాడినా తృప్తి ఉండదురా. వాడు దగ్గరకు వచ్చి పక్కన కూర్చుని 'నాన్నా..మీరెలా ఉన్నారు? మీకేదైనా కావాలా?' అని ఒక్క మాట అడిగితే అందులో కలిగే ఆనందమే వేరురా. బిడ్డ స్పర్శ తండ్రికి సంజీవినిరా. పసితనంలో గుండెల

మీదకు ఎక్కించుకుని తొక్కించుకుంటాము వాడి పాద స్పర్శకోసం. పెద్దయ్యాక వాడి చేతిని చేతులోకి తీసుకుని ఆత్మీయంగా ముద్దుపెట్టుకుంటాము. వయసు మళ్ళినప్పుడు వాడు పక్కన కూర్చుని మాట్లాడుతూ కాళ్ళు వత్తుతుంటే, ఆ స్పర్శలోని మధురానుభూతిని అనుభవించాలే గానీ, మాటలలో చెప్పలేము. కానీ ఎంతమందికి ఆ అదృష్టం ఉంది ఈరోజుల్లో' అని కళ్ళు తుడుచుకున్నాడు. ఆ మాటలు నా మనసులో అలాగే ముద్రవేసుకుపోయాయి!" చెప్పడం ఆపాడు అభిరామ్.

"మీ తాతయ్య అనుభవించిన బాధను మామయ్యగారు కూడ అనుభవించాలనుకుంటున్నారా? అది తప్పండి. ఏ సుఖాన్ని మామయ్యగారు తాతయ్యకు దూరం చేశారో, ఆ ఆనందాన్ని మీరు మామయ్యగారికి పంచితే, మన ప్రమేయం లేకుండానే మామయ్య చేసిన తప్పును ఆయనే తెలుసుకుంటారు. మీరింకా మామయ్యను ఇబ్బంది పెట్టకండి. చివరి రోజులలో ఆయనను సంతోషపెట్టడం కొడుకుగా మీ ధర్మం. మామయ్య గారిలా మీరూ ప్రవర్తిస్తే ఆయనకూ, మీకూ తేడా ఏముంది. నా మాట విని మీరిక సాధించడం ఆపండి!" హితబోధలా చెప్పింది అంజల. "కానీ ఇప్పటికీ తను చేసినది తప్పని ఒప్పుకోడే మానాన్న. తనేదో తాతయ్యను ఉద్ధరించినట్లు మాట్లాడతాడు. పొరపాటు చేయడం తప్పుకాదు అంజలా, పశ్చాత్తాప పడకపోవడమే నాకు నచ్చదు"

"ప్లీజ్..వదిలేయండి. ఏమో మీరు చూసే విధానమే ఆయనలో మార్పు తెచ్చి, తను చేసిన తప్పును తెలిసేలా చేస్తుందేమో" "నా మనసుకూ కష్టంగానే ఉంది అంజలా. నాన్నను ఇక బాధపెట్టదలుచుకోలేదు. రేపటినుంచి ఆయనకు అనుకూలంగానే నడుచుకోవాలనుకుంటున్నాను"

"మంచి నిర్ణయం. ఏ స్పర్శకోసం తాతయ్య తపించిపోయాడో, ఆ స్పర్శను మామయ్య గారికి మీరందించి, కొడుకుగా మీ కర్తవ్యం నిర్వహించండి!" అంటున్న అంజల వైపు తృప్తిగా చూశాడు అభిరామ్, ఎంత మంచి భార్య దొరికింది నాకు అనుకుంటూ.

★★★

"నన్ను క్షమించరా అభీ.. నేను చేసినది తప్పే. మామూలు తప్పు కాదు, క్షమించరాని తప్పు. దానికి నన్ను నేనే శిక్షించుకోవాలని అనుకుంటున్నాను. అందుకే వెళ్ళిపోతున్నాను. ఏ స్పర్శ కోసం నా తండ్రి తపించిపోయాడో, ఆ స్పర్శకు నేను కూడా దూరంగా ఉండడం, నేను చేసిన పాపానికి శిక్ష. ఎవరైనా అడిగితే మా నాన్న కాశీలో ఉంటానని వెళ్ళాడని చెప్పు. ఇదంతా నాకెలా తెలుసనుకుంటున్నావా. దాహం వేస్తే మంచితీర్థానికని వచ్చినపుడు మీ మాటలు నాకు వినిపించాయి. అప్పుడు అంతా అర్థమయింది. అందుకే వెళ్ళిపోతున్నాను. దయచేసి నన్ను వెదికే ప్రయత్నం చేయవద్దు. నీ మంచి మనసే నీకు శ్రీరామరక్ష!" తండ్రి గదిలోకి వెళ్ళినపుడు బల్ల మీద దొరికిన కాగితాన్ని చదివి నిశ్చేష్టుడయ్యాడు అభిరామ్. తండ్రి తప్పు తెలుసుకోవాలని అనుకున్నాడే గానీ, ఆయనను దూరం చేసుకోవాలనుకోలేదు. ఎలాగైనా నాన్నను దక్కించుకోవాలి అని అంజలకు చెప్పి బయలుదేరాడు అభిరామ్. ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగడంతో వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా తండ్రి మధుబాబు. తండ్రిని చూసి ఒక్క ఉదుటున వెళ్ళి కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్వసాగాడు. "నన్ను క్షమించు అభీ. ఆవేశంలో నేను ఇల్లు విడిచిపోవాలని తీసుకున్న నిర్ణయం, బయటకు వెళ్ళి ఆలోచించాక తప్పని తెలిసిందిరా. నాన్న ఆరోజు నన్ను నలుగురిలో పలుచన చేయకూడదని నా పంచనే నమ్ముకుని ఉండిపోయాడు. నాలాంటి కొడుకు విషయంలోనే ఆయన అటువంటి నిర్ణయం తీసుకుంటే,

నీలాంటి ఉత్తముడి విషయంలో నేను తీసుకున్న నిర్ణయం తప్పనిపించి తిరిగి వచ్చేశాను. నన్ను తప్పుగా అర్థం చేసుకోకు!" పశ్చాత్తాపంతో గుండె బరువెక్కుతుంటే, కొడుకు తల నిమురుతూ అన్నాడు మధుబాబు. "నాన్నా.. మిమ్మల్ని ఇంక ఇబ్బంది పెట్టను. మీరు కోరినట్టే ఉంటాను!" అంటూ అతుక్కుపోయిన కొడుకు స్పర్శలోని ఆనందాన్ని అనుభవిస్తూ, 'ఇందుకేరా ముసలి వయసులో బిడ్డల దగ్గర ఉండాలని అందరూ కోరుకునేది' అని మనసులో అనుకున్నాడు మధుబాబు. కాని తన తండ్రిని ఈ ఆనందానికి దూరం చేశాననే బాధ మాత్రం అతని అంతరంగాన్ని వేధిస్తూనే ఉన్నది.

# కొత్త సంతకం

పి. మంగరత్నం



✆ 9701426788

***కడుపు చించుకుంటే కాళ్ళ మీదపడుతుందని.. ఇలాంటి సమయంలో సూర్యచక్రానికి వయస్సు పెంపు ఆసరా ఎంతో చేయూతే! అయినా.. అతని సంతోషం పెదవి దాటకుండానే ఉద్యోగుల పీ.ఆర్.సీ లో పెంచిన జీతాలు తక్కువ అన్నట్లు సమ్మె సైరన్ మ్రోగించడంతో.. గోరుచుట్టు మీద రోకటి పోటూ అన్న చందంగా అయ్యింది ఆతని పరిస్థితి***

ఆఫీసులోకి అడుగు పెడుతూనే .. సూర్యచక్రం అందరికీ విష్ చేసి "ఏమిటి సార్ విశేషాలు!" అంటూ మా సెక్షన్ హెడ్ 'సన్నిధానం' గారి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు. ఏమాత్రం తీరిక దొరికినా వచ్చి బాతాఖానీ వేస్తుంటాడు.

మనిషి సన్నగా పొడుగ్గా ఉండి, టక్ చేసుకున్న షర్టు, డై వేసిన ఉంగరాల జుట్టుతో, కాళ్ళకి నల్లటి బూట్లతో సూర్యచక్రం స్టైలుగానే కనిపిస్తాడు. వచ్చాడంటే చాలు హడావుడి. సందడి అంతా అతనితో పాటేవచ్చినట్లు. పని తక్కువ కబుర్లెక్కువ. నిన్న సాయంత్రం ఇంటికి వెళ్లినప్పటి నుంచి మళ్ళీ ఈరోజు ఉదయం ఆఫీసుకి వచ్చేటప్పటికి.. ఏం విశేషాలు ఉండిపోతాయనో! రోజూ అదే ప్రశ్న.

"ఏమున్నాయి సార్! నిన్ననే కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. అందరికీ కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పేసాం. ఎవరైనా మిగిలిపోతే ఈరోజు చెప్పాలి. అంతకుమించి విశేషాలేమున్నాయి!" నవ్వేరు, సావధానంగా సెక్షన్ హెడ్ సన్నిధానం.

అప్పటి వరకూ నవ్వు ముఖంతో ఉన్నవాడు కాస్తా ..ఒక్కసారిగా విచారపు మాస్క్ వేసుకున్నట్లు "అదే సార్ నా బాధ కూడాను. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేసాం. మీరు.. నన్ను 'ఇంటికి' పంపించేసే రోజు దగ్గర పడిపోయింది. ఇన్నాళ్ళూ కలసి ఉన్నాం. మీ అందరినీ వదిలి వెళ్ళాలంటే కష్టంగా ఉంది. లేదు.. లేదంటే ఇంక ముప్పై రోజులు. ఏమిటో రోజులు చూస్తుండగానే గడిచిపోతున్నాయి గానీ, మూడున్నర ఏళ్లుగా ఎదురు చూస్తున్న పీ.ఆర్.సీ మాత్రం ఇంకా రాలేదు!" విచారపడ్డాడు.

"దాని గురించి అంతగా ఆలోచించక్కరలేదు. రిటైరు అయిపోయినా మీకు రావలసిన డబ్బులు మీకు వచ్చేస్తాయి. ఇంకా పెన్షను ప్రపోసల్స్ పంపుకోలేదు మీరు. దాని గురించి ఆలోచించండి!" హెచ్చరించారు సెక్షన్ హెడ్.

"ఏమి ఆలోచించడమో సార్! మీకోసారి చెప్పినట్లు గుర్తు.. బాగా తెలిసిన వాళ్ళ ద్వారా తెలిసింది భోగట్టా.. రిటైరుమెంటు వయస్సు పెంపు ఫైలు సీ.ఎం టేబుల్ మీద ఉందని, అందుకే ఏమైతే అయ్యిందని కూర్చున్నాను!" చెప్పాడు.. ఆశ మనిషిని బ్రతికిస్తుంది అనడానికి నిదర్శనంలా!

అయినా, ప్రొద్దుటే సుత్తి వేసేస్తున్నాడు. ఆఫీసుని వదిలి వెళ్ళడానికి కష్టపడుతున్నాడా? ఆ తరువాత ఇంత జీతం రాదని బెంగపడుతున్నాడా? భార్య పిల్లల్ని స్వంత ఊరిలో వదిలేసి, అద్దె గదిలో ఉంటూ ఎంతకాలం ప్రక్కవాళ్ళ స్నేహం కోసం ప్రాకులాడతాడు? ఎదుటివాళ్ళకు చెవిలో పూలు పెట్టడం కాకపోతేను... ఇలాంటి గుసగుసలు ఆయన ముందు వెనక మామూలే!

"అయ్యా సూర్యచక్రం గారు! ఉద్యోగం అన్న తరువాత రిటైరుమెంటు తప్పదు కదా! ఇప్పుడైనా ఇంటికి వెళ్లి హాయిగా భార్యాపిల్లలతో కబుర్లు చెప్పుకుంటే వాళ్ళు సంతోషపడతారు!" మరో హెడ్‌క్లర్క్ రత్నం కాస్త విసుగ్గానే, ఆ వాక్ప్రవాహాన్ని అడ్డుకోడానికి అంది.

"అమ్మా! అందరూ అలాగే అంటున్నారు గానీ, ఇంటికి వెళితే ఏం తోచదు. కష్టానికి అలవాటు పడ్డ ప్రాణం, మీ వదినీ పిల్లలనీ .. మా అన్నదమ్ములు ఎప్పుడూ కనిపెట్టుకుని ఉంటారు!" అని అనేసి యధాలాపంగా మళ్ళీ కబుర్లలో పడిపోయాడు.

'భర్త ఉన్నదారి.. వేరే వాళ్లతో వస్తుందా' అని అనాలని చాలా మందికి అనిపించినా, ఎందుకొచ్చిన గోడవలే అని ఊరుకున్నారు.

అంతలో ..



అటుగా వస్తున్న అవుట్‌సోర్సింగు అటెండరు చిన్నబాబుని చూసి "ఏవయ్యా చిన్నారావూ! నా రిటైరుమెంటు దగ్గరకు వచ్చేస్తోంది. ఆ రోజు ఫంక్షన్ ఏ విధంగా చేస్తారో మీరు... గుర్తుండిపోయేలా ఘనంగా చెయ్యాలి సుమా! ఆ విధంగా చేయించే పూచి నీది. ఆ రోజు మా స్నేహితులు కూడా వస్తారు!" అంటూ వాడిని ఇప్పటి నుంచే మంచి చేసుకుంటున్నాడు.

చిన్నబాబు ఆ ఊరి వాడే కావడమే కాదు, ఊరిలో కాస్తో కూస్తో పలుకుబడి కూడా ఉన్నవాడు. ఆర్థికంగా ఇబ్బందులేం లేవు. గవర్నమెంటు ఆఫీసులో పని చెయ్యాలన్న తపనతో.. దొరికింది అవుట్‌సోర్సింగు పోస్టు అయినా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్థానిక ఎం.ఎల్.ఏ రికమండేషనుతో అందులో ఇమిడిపోయాడు. జీతం ఎంతైనా.. రోజూ ఆ రెవెన్యూ ఆఫీసు మెట్లెక్కి, దిగడం ఒక ప్రత్యేక హోదాలా భావించేవాడు. అతని స్కూటర్ మీద 'రెవెన్యూ' అని కూడా వ్రాయించుకుని సంతృప్తిపడతాడు. ఏ పని అయినా ఎలా కావాలంటే అలా చేయించగల సమర్థుడు.

"నాదేముంది సార్! అంతా పైవాడి దయ .. కలెక్షన్ని బట్టే కదా.. ఖర్చు!" అంటూ చెయ్యి పైకి చూపించాడు నవ్వుతూ.

ఆఫీసులో ఇలాంటి ఫంక్షనులుంటే, డబ్బులు వెయ్యాల్సి వచ్చినప్పుడు మాత్రం సూర్యచక్రం వెనక ఉండేవాడు. ఒకటికి రెండుసార్లు అడగాల్సి వచ్చేది.

"సార్! మొత్తం కలెక్టు కాకుంటే, వాళ్ళకు ఇవ్వాల్సిన ఐటెం ఎలా తెస్తాం సార్. పూలదండలూ, మెమెంటోలూ ఎలా వస్తాయి సార్!" అంటూ నిలదీసేవాడు.

"ఏం చెయ్యమంటావు! అన్నిఖర్చులూ నెలాఖరుకే వస్తాయి. మొన్ననే మా ఆవిడకి మందులకి డబ్బు కావాలంటే పంపించాను!" అంటూ భారంగా జేబులో చెయ్యి పెట్టేవాడు.

అలాంటి సూర్యచక్రం.. ఆ నెలాఖరున వచ్చే తన రిటైరుమెంటు కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నాడు.. జనాలు లోలోన నవ్వుకునేలా!

★★★

రెండు నెలలుగా ఉద్యోగుల జీతాల పెంపు విషయంలో తర్జనభర్జన పడుతుంది ప్రభుత్వం. ఉద్యోగ సంఘాలను చర్చలు పిలుస్తుందే గాని ఫలప్రదం కావడం లేదు.

స్తబ్దుగా రోజులు గడుస్తుంటే ..

"ఈ నెలలో మీరు అనుకున్నట్లు రిటైరుమెంటు వయస్సు పెంచితే, మీ అంత అదృష్టవంతులు మరొకరు ఉండరు సార్! అదే గనుక జరిగితే మాకు గ్రాండ్‌గా పార్టీ ఇవ్వాలి మీరు!" అనే వారు జనాలు.

ఆ మాటకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యేది సూర్యచక్రానికి.

పార్టీ అంటే మాటలా? ఏదైనా పెద్ద హోటల్‌కి తీసుకువెళ్ళి నాన్ వెజిటేరియన్తో పాటు 'మందు' కూడా పొయ్యించాలి.

అందుకే .. అలాంటి మాటల్ని మొదట్లోనే తుంచేసేవాడు.

"ఈ మాట చాన్నాళ్ళుగా వింటున్నదేలెండి. అది అయ్యేదా.. ఏమిటి? ఏదో.. ఆశ అంతే! అయినా.. ఇంకా ఎన్నాళ్ళు కష్టపడతాం! అసలు లెక్క తేలక పెన్షను ప్రపోజల్సు పంపుకోలేదు గానీ, ముసలి వయస్సు వచ్చేసింది. నాలాంటి వాళ్ళు బయటికి వెళితేనే కదా.. పిల్లగాళ్ళకు ఉద్యోగాలొస్తాయి. ఎంతసేపూ మనమే సంపాదించుకోవాలంటే ఎలాగ!" అంటూ తర్కించేవాడు. ఎవరి ఆలోచనలు ఎలా ఉన్నా, నా ఆలోచన ఇదే అన్నట్లు!

ఆ తర్కానికి.. పనిగట్టుకుని పార్టీ అడగడానికి వెళ్ళిన వాళ్ళు వెనక్కి వచ్చేవాళ్ళు.

అదీ నిజమే. దేశ ఆర్థిక సంక్షోభానికి అసలు కారణం యువతకు సరియైన ఉపాధి లేకపోవడమే. ప్రభుత్వ నిర్ణయాల తాలూకు 'ఆనందం' అతని ముఖంలో కనబడలేదు. కాస్త సందు ఇచ్చామా.. పార్టీ పేరుతొ చేతి చమురు వదిలించేస్తారు వీళ్ళు అన్నట్టు ముఖం కనబడేది.

"మీరు ఈ రోజున అలాగే అంటారు. అవకాశం కలసి వస్తే, ఎవరు ..మాత్రం కాదంటారులెండి సార్!" అనేది టైపిస్ట్ మనోరమ.

"అబ్బే.. వద్దని రాసిచ్చేస్తానమ్మా! అలా రాసిస్తే ఎంక్వయిరీలు అవీ ఉంటాయట. మెడికల్‌బోర్డుకి రిఫర్ చేస్తే .. కష్టం కదా! అప్పుడైనా బెనిఫిట్స్ రావడం లేటవుతాయి. అందుకే ఆలోచిస్తున్న!" అంటూ అంతలోనే కొసమెరుపు కూడా ఇచ్చేవాడు.

అతని మాటల్లోని త్రాసు ఎటు తూగుతుందో తెలీదు.

"మీ అంతట మీరు కాదనుకుంటే, దానికి మెడికల్‌బోర్డుతో పనేంటి? అయినా అనుకోకుండా.. అదృష్టం తలుపు తట్టితే, కాదనుకుంటారా ఎవ్వరైనా? సిరి వస్తుంటే మోకాలడ్డం పెడతారా! మరో రెండేళ్ళపాటు గవర్నమెంటు జీతం తీసుకోవడానికి

కష్టమా!” ఆటపట్టించే ధోరణిలో చిరుకోపంతో అడిగింది జానకమ్మ.. ఎంతసేపని.. ప్రేక్షక పాత్ర వహించి మౌనంగా ఉండగలదు.. మనిషన్న తరువాత ఉడుకు నెత్తురు ఉంటుంది కదా!

“నా సమస్య నీకు తెలీదమ్మా. రిటైరుమెంటు తరువాత .. ఒక్కసారిగా డబ్బొస్తుంది. చిన్నపిల్ల పెళ్లి చెయ్యాలని అన్నాను కదా!” ఎప్పుడో చెప్పిన మాటని గుర్తుచేసాడు

ఇక ఆమె దగ్గర మాట్లాడడానికి విషయం లేదు.

★★★

ఎదురు చూసినట్లే పీ.ఆర్.సీ ని ప్రకటించిన ప్రభుత్వం .. ఉద్యోగుల వయస్సు రెండు సంవత్సరాలు పెంపును కూడా ప్రకటించింది. అంటే.. అరవై ఏళ్ళ వయోపరిమితిని, మరో రెండేళ్ళు పెంచి .. అరవై రెండు సంవత్సరాలుగా చేసింది. పెంచిన జీతాల వలన ప్రభుత్వం మీద కొన్ని వేల కోట్ల భారం పడుతుందనీ, ఆ ఆర్థిక లోటును పూడ్చుకోవడం కోసం.. ఈ వయసు పెంపు నిర్ణయం తీసుకుందనీ, ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయనీ తెలియచేసింది.

దాంతో ఒడ్డునపడ్డాడు సూర్యచక్రం. అదృష్టం అంటే ఇదేనని సంబరపడ్డాడు లోలోన! అయినా ఎప్పటిలానే.. ఆముదం త్రాగిన ముఖమే, నవ్వితే దొరికిపోతానన్నట్లు.

ఇంటి వాకిట్లో.. ఇంటి ఓనరు ‘జాన్ బాబు’ ఓ వారగా కుర్చీ వేసుకుని కూర్చున్నాడు సాయంత్రపు చల్లగాలికి! గేటు దాటి, మెట్లు ఎక్కి తన వాటాలోకి వెళ్ళబోతున్న సూర్యచక్రాన్ని చూసి “జాక్పాట్ కొట్టేసారు సార్! ఇంకో రెండేళ్ళ సర్వీసు అంటే మాటలా..! పార్టీ ఇవ్వాలి మాకు!” అంటూ పలకరించాడు.

ఏదో బిజినెస్ చేసుకునే అతను కూడా ‘పార్టీ’ అనేసరికి కాస్త చిర్రెత్తుకొచ్చినా.. ఇంటి ఓనరు కాబట్టి, తమాయించుకుని “ఏదో సార్! అంతా దేవుని దయ, మీలాంటి వాళ్ళ ఆశీర్వాదం!” అంటూ చేతులు జోడించాడు.. పైనున్న దేవుడికి కూడా కనబడేలా!

సూర్యచక్రం భార్యకు చాలా ఏళ్ళుగా బ్లెడ్కేన్సర్. ట్రీట్ మెంట్ కి ఎంత డబ్బైనా చాలడం లేదు. పిల్లకు పెళ్లి చేసి పంపాలన్నా, భార్యని చూడడానికి ఇంట్లో ఎవరూ ఉండరని ఓ ఆలోచన ఉంది. కొడుకు ఇంజనీరింగు పూర్తిచేసి, ఎక్కడా ప్లేస్మెంట్స్ రాక, ఏవో ట్రైనింగుల పేరు మీద హైదరాబాదులో ఉండి.. డబ్బులు తగలేస్తున్నాడు. ఉన్న సమస్యలు చాలవన్నట్లు, ఏడాదిగా.. పెద్దకూతురు పుట్టింటి పంచన చేరుకుంది.

ఆ పిల్లది మరో కథ. క్లాసులు ఎగ్గొట్టి తిరిగిన తిరుగుళ్ళకు క్లాసుమేట్ తోనే పెళ్ళయిందనిపించుకుంది. కొడుకుని వల్లో వేసేసుకుందని, ఆమె అత్తగారికి కోపం. ఇంటిలోకి రానివ్వలేదు. సూర్యచక్రానికి విషయం తెలిసి, పిల్ల చేసిన పనికి ముందు మొత్తుకున్నా, తరువాత ‘అత్త’ అనబడే ఆమెను ఒప్పించాల్సివచ్చింది. ఇష్టంలేని కోడరికం ఎన్నాళ్ళు చేస్తుందీ? మగపిల్లాడు పుట్టలేదన్ననెపంతో ఆడిపోసుకుంటుంటే, ఇద్దరాడపిల్లలతో పుట్టింటికి వచ్చేసింది.

కడుపు చించుకుంటే కాళ్ళ మీదపడుతుందని.. ఇలాంటి సమయంలో సూర్యచక్రానికి వయస్సు పెంపు ఆసరా ఎంతో చేయూతే! అయినా.. అతని సంతోషం పెదవి దాటకుండానే ఉద్యోగుల పీ.ఆర్.సీ లో పెంచిన జీతాలు తక్కువ అన్నట్లు సమ్మె సైరన్ మ్రోగించడంతో.. గోరుచుట్టు మీద రోకటి పోటు అన్న చందంగా అయ్యింది ఆతని పరిస్థితి.

ఇన్నాళ్ళుగా అతను మాట్లాడిన మాటలకు వకాలత్ పుచ్చుకుంటున్న ఎస్టాబ్లిష్మెంట్ క్లార్క్ వెంకటేశ్వరరావు, “మీకిష్టం

లేదుగా పోస్టు.. కాగితం రాసిచ్చేయ్యండి. ఫార్వార్డ్ చేసేస్తాను, వెంటనే రిటైరుమెంటు ఫంక్షనూ చేసేస్తాం!” అంటూ ఆట పట్టించేవాడు.

“అవును. నిజమే. మనకెలాగూ పార్టీ ఇచ్చే ఆలోచన సార్‌కి ఉన్నట్లు లేదు. కాబట్టి, స్ట్రైక్‌కి వెళ్ళే ముందే మనమే ఇద్దాం!” పక్క సీటు సువర్చల కూడా తగులుకుంది.

ఈ మాటలన్నీ పుండు మీద కారం చల్లుతున్నా, చెవినపడనట్లే ఉండేవాడు.

★★★

ఈరోజు .. ఒకటో తారీఖు.

ఆఫీసుకీ ‘వయస్సు పెంపు’ కు సంబంధించిన ఆర్డినెన్స్ కాగితంతో వచ్చాడు సూర్యచక్రం. తెచ్చిన కాగితం అందరికి చూపిస్తూ ఆఫీసంతా కలయతిరుగుతూ హడావుడి పడుతున్నాడు. అతని ముఖం తోమిన పింగాణి ప్లేటులా తళతళలాడిపోతుంది. అటెండర్లు అన్నీ గమనిస్తూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఇప్పుడైనా మనిషి .. తొణుకుతాడా.. లేదా.. అన్నట్లు!

సెక్షన్ హెడ్ సన్నిధానంగారికి చూపిస్తూ, “సార్! సంతకం పెట్టుకోనా!” అడిగాడు.

“మీకు అడ్డం ఏమిటండి. జీ.ఓ.కూడా వచ్చేసింది కదా! పెట్టుకోండి” అన్నారు.

విజయం సాధించిన బాలాకుమారుడిలా, అప్పటికే వ్రాసి ఉన్న అతని పేరు ఎదురుగా ఎప్పటిలా ఓ సంతకం పడేసి, చుట్టూ చూసాడు. కావలసిన వాళ్ళు కనిపించక పోవడంతో ..

“చిన్నారావూ.. చిన్నారావూ ఎక్కడున్నావ్?” అంటూ పోలికేకలు పెట్టాడు.

ఆ హడావుడికి కారణం అందరికి అర్థమైంది. ఆ నిముషం కోసమే చూస్తున్నాడు చిన్నబాబు కూడా.

ప్రక్క గదిలోంచి వస్తూ “ఓ మీరా సార్! గట్టిగా పిలుస్తుంటే ఎవరో అనుకున్నా! ఏమిటీ ఇలా వచ్చారు ఈరోజు? కొత్త పెళ్ళికొడుకులా కళకళలాడిపోతున్నారు, కొత్త బట్టలూ .. ఏమిటి కథా! పోస్టు అవసరం లేదని కాయితం రాసిచ్చేసారా? చాలా హాయిగా ప్రశాంతంగా కనిపిస్తున్నారు.” అన్నాడు ఏమీ ఎరగనట్లే నవ్వు నటిస్తూ.

“నీకలాగే ఉంటుంది!” అంటూ ఉడుక్కున్నట్లు చిన్నగా కసురుకుని, ఎవ్వరికి కనిపించకుండా.. చేతిలో డబ్బులు పెడుతూ, అతనికి మాత్రమే వినిపించేలా .. ఏదో చెప్పాడు.

అతని తత్వం తెలిసిన వాడే గనుక.. చిన్నబాబు వెంటనే, ఆ నోట్లని పైకి చూపిస్తూ “స్వీటూ, హాటుకి ముడోందలు ఎందుకు సరిపోతాయి సార్! పేపర్ ప్లేట్లు కొనాలి, ఆ తరువాత తిన్నది అరగడానికి ‘టీ’ లు కూడా కావాలి కదా! మార్కెట్టుకి వెళ్ళాలంటే.. నా బండికి పెట్రోలు కావాలి కదా! నాకు మాత్రం పెట్రోలు ఊరికినే వచ్చేస్తుందా ఏమిటి? బండికి అరలీటరు కొట్టించుకోవాలి. ఆ చేతిలో ఉన్నవి కూడా ఇవ్వండి!” అంటూ, చనువుగా మరో మూడువందలు కూడా లాక్కున్నాడు.

ఈ మాత్రం పార్టీ ఇవ్వాల్సి రావడం కోసమే.. ఇన్నాళ్ళూ ప్రాణాలు ఉగ్గబట్టుకుని నవ్వడం మానేసిన సూర్యచక్రాన్ని.. ఆ ఒకటో తారీఖు సంతకం .. అతన్ని మళ్ళీ మనుషుల్లో పడేటట్టు చేసింది!

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.


అవసరాల వెంకటరావు
9989976688

జయంతి ప్రకాశ శర్మ
9848629151


*

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది. కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.

మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా

submit@kathamanjari.in

మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

*

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.

వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..

www.kathamanjari.in

*

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.

మీ రచనలను పంపవలసిన చిరునామా

submit@kathamanjari.in